మంగళవారం
9-1-2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 213
• పేజీలు : 16 + (24/20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



సోమవారం కరీంనగర్ జిల్లాలో రూ.25 కోట్లతో చేపట్టిన ఐటీ టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తున్న దృశ్యం. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు కూడా ఉన్నారు.

మీరు ఉద్యోగాలు కోరడం కాదు..
ఉద్యోగాలివ్వాలి

నవీన ఆవిష్కరణలకు నాంది పలకాలి..
యువతకు మంత్రి కేటీఆర్ పిలుపు

- అభివృద్ధిలో మనమే నంబర్ 1
- వేగంగా పెరుగుతున్న ఐటీ ఎగుమతులు
- ప్రైవేట్ రంగంలో ఇప్పటికే లక్ష ఉద్యోగాల కల్పన
- ప్రభుత్వ రంగంలో లక్ష ఖాళీల భర్తీ
- సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిర్విరామంగా పనిచేస్తున్న మంత్రి హరీశ్
- రాష్ట్ర అభివృద్ధిలో ఈటల సామర్థ్యం సాటిలేనిది
- కరీంనగర్‌లో ఐటీ టవర్‌కు శంకుస్థాపనలో కేటీఆర్

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

నిత్యనూతనంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని.. నవీన ఆవిష్కరణలకు యువత నాంది పలుకాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి కే తారకరామారావు పిలుపునిచ్చారు. తెలంగాణ యువత 'జాబ్ సీకర్స్'గా కాకుండా.. 'జాబ్ క్రియేటర్స్'గా ఎదుగాలని ఆకాంక్షించారు. ఐటీ రంగంలో తెలంగాణ దూసుకుపోతున్నదని, రాజధానితో పాటు ఇతర జిల్లాలకు కూడా విస్తరిస్తున్నదని తెలిపారు. తెలంగాణ ఏర్పడటానికి ముందు రూ.56 వేల కోట్ల రూపాయల ఐటీ ఎగుమతులు జరిగాయని.. 2017 డిసెంబర్ నాటికి రూ.87 వేల కోట్లకు ఈ ఎగుమతులు పెరిగాయని తెలిపారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధిపథంలో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోతున్నదని స్పష్టంచేశారు. సోమవారం కరీంనగర్ జిల్లాలో పర్యటించిన మంత్రి కేటీఆర్ దిగువ మానేరు జలాశయం పరిధిలో రూ.25కోట్లతో చేపట్టిన ఐటీ టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలో రూ.250 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదిక పైనుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సిటిజన్ చార్టర్ కేంద్రాన్ని ప్రారంభించి, రూ.25 కోట్లతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్ పనులకు శంకుస్థాపన చేశారు. స్వచ్ఛత ఆటోలను కూడా మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఐటీ టవర్ శంకుస్థాపన సందర్భంగా కరీంనగర్ ఎమ్మెల్యే

మిగతా 2వ పేజీలో

లక్షా 80 వేల కోట్ల
బడ్జెట్!

- జనవరి 26 వరకు పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధం
- 26 తరువాత సీఎం సమీక్షించే అవకాశం
- కార్యదర్శుల సమావేశంలో చర్చ
- 15వ ఆర్థికసంఘం ద్వారా అత్యధిక నిధులు పొందేందుకు కృషి
- ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



బడ్జెట్ ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. సోమవారం సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి వస్తున్న ఆదాయం ఎంత? జీఎస్టీ తరువాత అభివృద్ధి రేటు ఎలా ఉంది? రాష్ట్రాల వాటాకింద కేంద్రం నుంచి వస్తున్న నిధులు ఎన్ని? అభివృద్ధి రేటు ఎలా ఉంది? వంటి అంశాలపై చర్చ జరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్థూలంగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు వివరించారు. పెట్రోల్, ఎక్సైజ్ ద్వారా

మిగతా 11వ పేజీలో

సమృద్ధిగా ఆదాయం

పుంజుకున్న జీఎస్టీ, వ్యాట్ రాబడులు
19 శాతం దాటిన వృద్ధిరేటు 3



గనుల రెవెన్యూ
2290 కోట్లు

- లక్ష్యాన్ని మించిన ఆదాయం
- పారదర్శక విధానాలు, జవాబుదారీతనం పెరుగడంతోనే దూకుడు
- గనుల నిర్వహణను టెక్నాలజీతో అనుసంధానించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గనుల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. పారదర్శక విధానాలను అవలంబించడంతోపాటు, జవాబుదారీతనం పెరుగడంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమిస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో నవంబర్ చివరి నాటికే ప్రభుత్వం నిర్దేంచిన లక్ష్యాన్ని దాటింది. రాష్ట ఐటీ, గనులు, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు తీసుకొచ్చిన సంస్కరణలు రాష్ట్రంలో గనుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచేందుకు ఎంతో దోహదం చేశాయని చెప్పవచ్చు. అదేవిధంగా పర్యావరణ హితమైన గనుల తవ్వకాలపై దృష్టి పెట్టడంతో కాలుష్యాన్ని అరికట్టగలిగారు. ఈ ఆర్థిక సంవత్సరం 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి వరకు రూ.3,500 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో నవంబర్ నాటికి రూ. 2,213 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఆదాయం రూ.2,290 కోట్లకు చేరుకుని లక్ష్యాన్ని అధిగమించింది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగేండ్లలో గనుల ఆదాయం 80 శాతం పెరుగగా, కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో పెరిగిన ఆదాయం 50 శాతం మాత్రమే.

సత్ఫలితాలిచ్చిన సంస్కరణలు

రాష్ట్ర గనుల శాఖ మంత్రి కే తారకరామారావు తీసుకున్న అనేక నిర్ణయాలు గనులశాఖ ఆదాయం పెరుగడానికి దోహదం చేశాయి. లీజుల అనుమతుల ప్రక్రియను మొత్తం

మిగతా 2వ పేజీలో



సోమవారం జోగులాంబ గద్వాల జిల్లాలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రులు జూపల్లి, లక్ష్మారెడ్డి, ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథం , ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాల్‌రాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు కూడా ఉన్నారు.

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని
ఆశీర్వదించండి

సీఎం కేసీఆర్ ఆశయాలకు అండగా నిలువాలి: మంత్రి హరీశ్

- కేసీఆర్ నాటి పాదయాత్ర ఫలితమే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం
- ఏడు నెలల్లో పూర్తి.. వానకాలంలో నీరు
- సమైక్యంలో జరిగిన అన్యాయాలకు ఆర్డీఎస్ నిదర్శనం
- అధికారంలో ఉన్నప్పుడు చుక్క నీరు కూడా ఇవ్వని కాంగ్రెస్
- ఫిబ్రవరికల్లా ఏదుల రిజర్వాయర్ పూర్తి
- తుమ్మిళ్ల ఎత్తిపోతల శంకుస్థాపనలో నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:

రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరందివ్వాలన్న లక్ష్యంతో రేయింబవళ్లు శ్రమిస్తూ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నామని నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న టీఆర్‌ఎస్ సర్కార్‌ను, సీఎం కేసీఆర్‌ను ప్రజలు నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. రైతులకు సాగునీటిని అందించి శాశ్వతంగా బాధల నుంచి విముక్తి చేయాలన్న సంకల్పంతో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకు ప్రజలంతా అండగా నిలవాల్సిన అవసరముందని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. రైతులను అప్పుల ఊబి నుంచి బయట పడేసేందుకు వచ్చే వానకాలం సీజన్ నుంచి రెండు పంటలకు ఎకరాకు రూ.8వేల పెట్టుబడిని అందిస్తామని చెప్పారు. ఆర్డీఎస్ రైతులకు జరుగుతున్న అన్యాయంపై నాటి ఉద్యమనేతగా 2002 జూలై 23న కేసీఆర్ ఐదురోజులపాటు చేపట్టిన పాదయాత్ర ఫలితమే నేటి తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం స్వరూపమని తెలిపారు. దశాబ్దాలుగా నీటికోసం వేచిచూస్తున్న ఆర్డీఎస్ రైతులకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని ఏడు నెలల్లో పూర్తిచేసి వానకాలంనాటికి నీళ్లందిస్తామని ప్రకటించారు. సమైక్య రాష్ట్రంలో సాగునీటిపరంగా తెలంగాణకు జరిగిన అన్యాయానికి ఆర్డీఎస్ నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం తుమ్మిళ్లలో రూ.783 కోట్ల రూపాయలతో చేపట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మొదటిదశ

మిగతా 6వ పేజీలో



తుమ్మిళ్ల ఎత్తిపోతల ప్రాంతం ఏరియల్ వ్యూ



అగ్ని ప్రమాదానికి గురైన బెంగళూరులోని కైలాశ్ బార్ అండ్ రెస్టారెంట్

బార్ దగ్ధం

బెంగళూరులో ఘోర అగ్ని ప్రమాదం..
గాఢ నిద్రలో ఉండగా..
ఐదుగురు సిబ్బంది సజీవదహనం 2

మన బార్లు భద్రమేనా?

స్పష్టత కరువు 12

స్వలింగ సంపర్కం నేరమా? కాదా?

మళ్లీ చర్చకు తెరతీసిన సుప్రీంకోర్టు 2

రైతుకు నగదు పంపిణీ ఎలా?

పంట పెట్టుబడి రూ. 4000 ఇచ్చేందుకు ప్రణాళిక
వచ్చే వానాకాలం నుంచి అమలుకు సై.. మంత్రివర్గ ఉపసంఘం భేటీలో చర్చ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ:

రైతన్నకు ఆసరాగా నిలిచేందుకు తెలంగాణ సర్కారు వ్యవసాయానికి పెట్టుబడి సమకూర్చేందుకు సన్నద్ధమవుతున్నది. వ్యవసాయాన్ని పండుగలా మారుస్తానని మాటఇచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు. ఎకరానికి రూ.4000 మొత్తాన్ని పెట్టుబడిగా అందించేందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పనపై చర్చించేందుకు రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో సోమవారం ఉదయం సమావేశమైంది. పెట్టుబడి సాయం నేరుగా రైతులకు అందేందుకు వీలుగా నగదురూపంలో ఇవ్వాలన్న అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. మెజారిటీ రైతులు నేరుగా నగదురూపంలో అందిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తంచేయడంతో మంత్రివర్గసభ్యులు కూడా ఆ వాదనతో ఏకీభవించినట్టు తెలిసింది. అయితే, దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నారు. ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నారు. నగదు ఇవ్వాలన్న ప్రతిపాదన వైపే మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రులంతా మొగ్గుచూపినట్టు తెలిసింది. జనవరి 10న నిర్వహించే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు.

మే 15 నాటికి పెట్టుబడి సాయం

వచ్చే వానకాలం నాటికి రైతులకు పెట్టుబడిసాయం నగదు రూపంలో ఇవ్వడానికి ఒక సీజన్‌కు సుమారు రూ.4000 కోట్లు అవసరమవుతాయని మంత్రివర్గ ఉపసంఘం

మిగతా 11వ పేజీలో



బెంగళూరు బార్‌లో అగ్నిప్రమాదం

- ఐదుగురు ఉద్యోగుల సజీవదహనం
- ముంబైలో మరో ప్రమాదం.. సెషన్స్‌కోర్టు భవనం దగ్ధం
- గోరఖ్‌పూర్ దవాఖానలో చెలరేగిన మంటలు



దగ్ధమైన బారును పరిశీలిస్తున్న అధికారులు

న్యూఢిల్లీ: బెంగళూరులోని కళాసిపాల్యంలో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. కైలాశ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో మంటలు చెలరేగడంతో ఐదుగురు ఉద్యోగులు సజీవదహనమయ్యారు. పొట్టచేతబట్టుకుని వచ్చిన వీరంతా అదే బార్‌లో పనిచేస్తున్నారు. బార్‌లోని ఓ గదిలో ఉంటున్నారు. అగ్నిప్రమాదం కారణంగా మంటలు చుట్టుముట్టడంతో గాఢనిద్రలో ఉన్న వీరంతా శాశ్వతనిద్రలోకి వెళ్లిపోయారు. తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయని, స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకశకటాలు, సహాయ బృందాలు అక్కడికి చేరుకున్నాయని పోలీసులు తెలిపారు. అయితే అప్పటికే బార్ మొత్తం మంటల్లో ఉండిపోవడంతో సిబ్బందిని కాపాడలేకపోయామని డీసీపీ ఎంఎన్ అనుచేత్ చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని, దీనిపై దర్యాప్తు జరుపుతున్నామని ఆయన తెలిపారు. కాగా బార్ యజమాని వీఆర్ దయాశంకర్ పరారీలో ఉన్నారు. దయాశంకర్ బార్ లైసెన్సును పొందినప్పటికీ దానిని మరొకరికి లీజ్‌కు ఇచ్చారని పోలీసు విచారణలో తేలింది. సంఘటనాస్థలాన్ని పరిశీలించిన కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల భద్రత బాధ్యత యజమానిదేనని, అందుకే బార్ యజమాని దయాశంకర్‌పై పోలీసులు కేసు నమోదు చేస్తారని వెల్లడించారు. మృతుల కుటుంబాలకు కర్ణాటక ప్రభుత్వం ఐదులక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది.

ముంబై సెషన్స్ కోర్టులో అగ్నిప్రమాదం

ముంబై: ముంబైలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా సోమవారం బాంబే సెషన్స్‌కోర్టులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఉదయం 7:30 గంటల ప్రాంతంలో కోర్టు భవనంలోని మూడో అంతస్తులో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. చారిత్రక వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన సెషన్స్ కోర్టు భవనానికి పెద్దగా నష్టం వాటిల్లనప్పటికీ, ప్రమాదం కారణంగా పలు దస్త్రాలు దగ్ధమైనట్లు తెలుస్తున్నది. ఉదయం 11గంటల నుంచి సెషన్స్ కోర్టు యథావిధిగా తన కార్యకలాపాలను కొనసాగించింది.

గోరఖ్‌పూర్ దవాఖానలో అగ్నిప్రమాదం

గోరఖ్‌పూర్: చిన్నారుల మృతితో గత ఏడాది వార్తల్లో నిలిచిన గోరఖ్‌పూర్(ఉత్తరప్రదేశ్) లోని బాబా రాఘవ్‌దాస్ వైద్యకళాశాలలో మంటలు చెలరేగాయి. సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో ప్రిన్సిపాల్ కార్యాలయం, రికార్డుల గది దగ్ధమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని జిల్లా ఎస్పీ ప్రహ్లాద్ యాదవ్ తెలిపారు.

స్వలింగ సంపర్కం నేరమా? కాదా?

- మళ్లీ చర్చకు తెరతీసిన సుప్రీంకోర్టు
- 2013 నాటి తీర్పును పునఃపరిశీలిస్తామని వెల్లడి
- విస్తృతస్థాయి రాజ్యాంగ ధర్మాసనానికి నివేదన



న్యూఢిల్లీ: స్వలింగ సంపర్కంపై చర్చకు సుప్రీంకోర్టు మరోసారి తెరతీసింది. స్వలింగ సంపర్కం నేరమో కాదో మళ్లీ తీర్పు చెప్పనుంది. భారతీయ నేర స్మృతిలోని సెక్షన్ 377 ప్రకారం స్వలింగ సంపర్కం నేరం అంటూ 2013లో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలిస్తామని సోమవారం ప్రకటించింది. సెక్షన్ 377 నుండి ఉత్పన్నమైన సమస్యపై విస్తృతస్థాయి ధర్మాసనం చర్చించాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఏఎం ఖాన్విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పరస్పర అంగీకారంతో ఇద్దరు వయోజనుల మధ్య జరిగే స్వలింగ సంపర్కం నేరమంటూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ నవతేజ్‌సింగ్ జోహర్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారణకు స్వీకరించింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కు అని గత ఆగస్టులో సుప్రీంకోర్టు ప్రకటించిన నేపథ్యంలో లైంగిక భాగస్వామిని ఎంపిక చేసుకోవడం కూడా వ్యక్తిగత గోప్యతగానే భావించాలని పిటిషనర్ పేర్కొన్నారు. సెక్షన్ 377 రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. సెక్షన్ 377 ప్రకారం ఎవరైనా ప్రకృతికి విరుద్ధంగా స్త్రీ, పురుషుడు లేదా జంతువులతో లైంగిక సంపర్కం జరుపడం నేరం. పరస్పర అంగీకారంతో అసహజమైన రీతిలో లైంగిక సంపర్కంలో పాల్గొనే వయోజనులను జైలులో ఎలా పెట్టగలరని పిటిషనర్ తరపు న్యాయవాది అర్వింద్ దాతర్ ప్రశ్నించారు.



నేడు రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ

రెండు రాష్ట్రాల్లోని పరిస్థితులు, హైకోర్టు విభజనపై చర్చ

మూడు రోజులపాటు ఢిల్లీలోనే బస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. బెస్ట్ ప్రాక్టీసెస్, కామన్ ప్రాక్టీసెస్‌పై కేంద్రప్రభుత్వం నియమించిన గవర్నర్ల కమిటీకి నరసింహన్ చైర్మన్‌గా ఉన్నారు. ఈ కమిటీ ఇటీవల సమర్పించిన నివేదికను నరసింహన్ మంగళవారం ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు అందజేయనున్నారు. ఆ తర్వాత ఆయన ప్రధాని నరేంద్రమోదీని కలువనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, జఠిలమైన సమస్యల పరిష్కారానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సానుకూలంగా స్పందించడం, సుహృద్భావ వాతావరణంలో ఏ విధంగా సమస్యలు పరిష్కారమవుతున్నాయనే విషయాలను గవర్నర్ నరసింహన్ ప్రధానికి వివరించే అవకాశముందని తెలిసింది. హైకోర్టు విభజన ప్రక్రియ అంశం కూడా చర్చకు రావచ్చని సమాచారం. బుధవారం వరకు ఢిల్లీలోనే ఉండే గవర్నర్ ఆ రోజు కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసే అవకాశముంది.

ముహూర్తం

సూర్యోదయం: 6.52 గంటలకు

సూర్యాస్తమయం: 5.54 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, అష్టమి సాయంత్రం 4.17 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: హస్త తె. 1.47 వరకు తదుపరి చిత్త, అమృత ఘడియలు: రాత్రి 8.21 నుంచి 9.57 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.09 నుంచి 4.31 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.05 నుంచి 9.49 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.14 నుంచి 2.58 వరకు, వర్జ్యం: ఉదయం 10.13 నుంచి 11.49 వరకు.

లోకం పోకడ



అసలు 24 గంటలు కరెంటు ప్రసారం అవుతున్నదో, లేదో నాకు అనుమానమే.. ఒకసారి పట్టుకొని చూడండి సార్!



సోమవారం కరీంనగర్‌లోని దిగువ మానేరు జలాశయం పరిధిలో ఐటీ టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం సభలో మాట్లాడుతున్న ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు ఉన్నారు.



ఐటీ టవర్‌లో శాఖను ఏర్పాటు చేయడానికి మంత్రి కేటీఆర్‌కు ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న ఆస్ట్రేలియాకు చెందిన నెవి ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ కాసర్ల నాగేందర్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్ తదితరులు ఉన్నారు

మీరే ఉద్యోగాలివ్వాలి

మొదటిపేజీ తరువాయి...

గంగుల కమలాకర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన బహిరంగసభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కావాల్సిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను యువత కోసం ప్రభుత్వం నిర్వహిస్తుందని వివరించారు. ముప్పై నిమిషాలపాటు భావోద్వేగంతో మాట్లాడిన కేటీఆర్ ప్రపంచంలో పోటీపడాలంటే నేటియువత అనుసరించాల్సిన మార్గాలపై దిశానిర్దేశం చేశారు.

జాబ్ క్రియేటర్స్‌గా ఎదగాలి

వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ కనిపెట్టిన వాళ్లే గొప్పవాళ్లు కాదని.. ఎవరికి వారు తమలోని సృజనాత్మకతను వెలికితీస్తే అద్భుతమైన ఫలితాలెన్నో ఆవిష్కృతమవుతాయని సూచించారు. వినూత్న ఆవిష్కరణలు చేయగలిగిన సత్తా మనకున్నదని భావించినప్పుడే ప్రపంచంతో పోటీపడగలమని చెప్పారు. యువతకు అండగా నిలవడానికే ప్రభుత్వం టీహబ్ ఏర్పాటు చేసిందని తెలిపారు. పిల్లలు రెండు రకాలుగా ఉంటారనీ, ఇందులో మొదటి రకం జాబ్ సీకర్స్ అనీ, రెండో రకం జాబ్ క్రియేటర్స్ అనీ, ఇందులో ఎలా ఉండాలన్నది ప్రతీ విద్యార్థి ఎవరికి వారు ఆలోచించుకోవాలని సూచించారు. ఉద్యోగం పొందాలనుకొనేవారికోసం టాస్క్ కేంద్రం ఏర్పాటు చేస్తామని వివరించారు. జాబ్ క్రియేటర్లకు ఉపయోగపడేందుకు హైదరాబాద్‌లో ఉన్న టీహబ్ కేంద్రాన్ని కరీంనగర్ ఐటీ టవర్ వద్ద ఏర్పాటుచేస్తామని చెప్పారు. టీహబ్ కేంద్రంగా యువత తమ మేధస్సుకు పదును పెట్టాలని సూచించారు. కొత్త కొత్త రంగాల్లో ఉద్యోగావకాశాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచంలో అందరూ భయపడుతున్న సైబర్ సెక్యూరిటీ, డేటా అనలైటిక్స్, రొబోటిక్స్‌తోపాటు కొత్తగా వచ్చే సాంకేతిక పరిజ్ఞానం విషయంలో నైపుణ్యాన్ని పెంచుకుని ప్రపంచంతో పోటీ పడాలని పిలుపునిచ్చారు. 'కరీంనగర్ వేదికగా రాష్ట్రంలోని యువతకు నేను చేసే విజ్ఞప్తి ఒక్కటే.. ఈ మూడున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం తీసుకొన్న కార్యక్రమాల వల్ల ఒక వైపు ప్రభుత్వపరమైన ఉద్యోగ నియమాకాలు జరుగుతున్నాయి, ఇంకోవైపు టీఎస్ ఐపాస్ ద్వారా ప్రైవేట్ రంగంలో పెద్ద మొత్తంగా పెట్టుబడులు రావడం వల్ల ఐటీ రంగంలో లక్ష ఉద్యోగాలు, ఇతర రంగాల్లో మరో రెండు లక్షల ఉద్యోగాలు ప్రత్యక్షంగా సృష్టించగలిగాం. పరోక్షంగా వీటికి మూడు రెట్ల ఉద్యోగాలు సృష్టించాం. భవిష్యత్‌లో వీటిని విస్తరిస్తాం' అని కేటీఆర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పెద్ద మొత్తంలో ఉద్యోగాలున్నాయనీ, ఇవి కూడా మన పిల్లలకే రావాలన్న ఉద్దేశంతో కావాల్సిన శిక్షణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

నోళ్లు మూతపడ్డాయి

తెలంగాణ ఏర్పడితే రాష్ట్రం అంధకారమవుతుందని.. పరిపాలించే నాయకత్వం ఉండదని.. శక్తివిహీనమవుతుందని.. తెలంగాణ ప్రజలు, నాయకులు ఉద్యమాలు తప్ప పాలన చేయలేరని.. పెట్టుబడులు రావని.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తాయంటూ ప్రచారాలు చేసిన నాయకుల నోళ్లు.. తెలంగాణ దూసుకెళ్తున్న తీరును చూసి మూతపడ్డాయని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. స్వయంగా ఇటీవల కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీని కలిసినప్పుడు ఉద్యమ నాయకులు పరిపాలనా దక్షకులుగా రాణించడం కష్టతరమనీ, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వీటికి విభిన్నమనీ, నాడు ఉద్యమాన్ని ఉరకలెత్తించినట్లే.. నేడు తన పాలనా దక్షతతో తెలంగాణను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడినట్లు తెలిపారు. కేంద్రంలోని అనేక మంది మంత్రులు ఇదే విషయాన్ని పలుమార్లు ప్రస్ఫుటం చేశారని, ఢిల్లీ నాయకత్వం భేష్ అంటూ కీర్తిస్తుంటే రాష్ట్ర నాయకత్వం గల్లీలో లొల్లిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. తాజాగా వచ్చిన మహేశ్‌శర్మ కూడా కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నాయకుడనీ, ఇటువంటి నాయకుడిని పోగొట్టుకోవడం మంచిది కాదని చెప్పి వెళ్లారని గుర్తుచేశారు. దాశరథి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అని చెప్పగా, మన ముఖ్యమంత్రి కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాల ద్వారా కోటి రతనాల వీణే కాదు..కోటి ఎకరాల మాగాణే కావాలని ప్రతిజ్ఞ చేశారు' అనీ, ఆ వైపు దూసుకెళ్తున్నారని వివరించారు. మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో నీటి పారుదలశాఖ నిర్విరామంగా పని చేస్తున్నదనీ, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా అద్భుతమైన ప్రయత్నాలు ప్రభుత్వం కొనసాగిస్తున్నదని వెల్లడించారు. సేద్యానికి 24 గంటల ఉచిత కరంటు ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశంసిస్తూ, హరిత విప్లవ సారథి స్వామినాథన్ లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేశారు.



సోమవారం కరీంనగర్‌లో ఐటీ టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఐటీశాఖ మంత్రి కే తారక రామారావు. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నగర మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సత్తా ఉన్న నేత ఈటల

ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందంటే అందులో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ సత్తా, సామర్థ్యం, నాయకత్వ పటిమే కారణమని మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. పెద్ద మొత్తంలో ప్రాజెక్టులు, ఒక వైపు సంక్షేమ కార్యక్రమాలు చేస్తుంటే నిధుల పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన ఉండేదనీ, కానీ నేడు ఆర్థిక వృద్ధి రేటులో భారత దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉందంటే కేసీఆర్‌కు చేదోడువాదోడుగా ఉన్న మంత్రి ఈటల రాజేందరే కారకులని కొనియాడారు. వయస్సులో తెలంగాణ రాష్ట్రం చిన్నదైనప్పటికీ వృద్ధి రేటులో మాత్రం అగ్రగామిగా నిలిపామని స్పష్టం చేశారు. దేశ జీడీపీతో పోల్చితే తెలంగాణ జీడీపీ డబుల్ ఉండడం ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి కష్టానికి నిదర్శనమని వెల్లడించారు.

యువత.. తెలంగాణ ఆస్తి : మంత్రి ఈటల

నేటి యువతీయువకులను తమ ప్రభుత్వం తెలంగాణ భవిష్యత్ ఆస్తులుగా పరిగణిస్తున్నట్లు ఆర్థికశాఖ మంత్రిఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అవకాశాలు అందరికీ కల్పించకపోయినా ప్రైవేట్ రంగం ద్వారా పెద్ద మొత్తంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విషయంలోనూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నదని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముందుగా ప్రసంగిస్తూ కరీంనగర్‌లో ఒకవైపు మానేరు రివర్‌ఫ్రంట్, మరోవైపు సస్పెన్షన్ బ్రిడ్జితో పాటుగా ఇక్క ఉన్న సౌకర్యాల దృష్ట్యా చాలా ఐటీ కంపెనీలు తమ తమ శాఖలను పెట్టేందుకు అసక్తిచూపుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు తుల ఉమ, నగర మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, భానుప్రసాదరావు, గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డితో పాటుగా పలువురు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లక్ష ఉద్యోగాల కల్పన

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మూడున్నర నుంచి 4 లక్షల వరకు ఉద్యోగాలు ఉన్నాయని, ఏటా 4 నుంచి 5 శాతం ఉద్యోగులు రిటైర్ అవుతారని తెలిపారు. అ లెక్కన చూస్తే ఖాళీలు లక్ష వరకు భర్తీ చేసే అవకాశం ప్రభుత్వ రంగంలో ఉంటుందనీ, అంతకన్నా ఎక్కువ ఉద్యోగాలిచ్చే శక్తి ప్రపంచంలో ఏ ప్రభుత్వానికీ ఉండదని స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలని ఆలోచించినప్పుడు ముఖ్యమంత్రి.. ప్రభుత్వ పరంగా ఆ అవకాశాలు లేనప్పుడు ప్రైవేట్ పరంగా ఉద్యోగ వకాశాలు కల్పించడానికి విస్తృత ప్రయత్నాలు చేయాలని సూచించారని గుర్తుచేశారు. 2014లో ఐటీ ఎగుమతులు రూ. 56వేల కోట్లు ఉంటే 2020 నాటికి వాటిని డబుల్ చేస్తామని ఆ రోజే చెప్పామన్నారు. గత ఏడాది చివరి నాటికి రూ. 87వేల కోట్లకు ఐటీ ఎగుమతులు పెరిగాయని తెలిపారు.

మరో ఐటీ టవర్

కరీంనగర్‌లో ఐటీ టవర్ నిర్మాణాన్ని 9 నెలల్లో పూర్తి చేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారు. శంకుస్థాపన జరిగిన రోజునే 8 కంపెనీలు 650 ఉద్యోగాల కల్పనతో ఒప్పందాలు చేసుకోవడం సంతోషంగా ఉన్నదని వివరించారు. మరికొన్ని సంస్థలు కరీంనగర్‌లో తమ శాఖల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయని, తద్వారా కనీసంగా వెయ్యిమందికి ఇక్కడ ఉద్యోగాలు వచ్చేందుకు బీజం వేశామని తెలిపారు. కరీంనగర్‌లోనే మరో ఐటీ టవర్ కోసం త్వరలోనే రూ. 25 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. కరీంనగర్ గడ్డపై పుట్టిన తాను ఈ జిల్లాకు సేవలందించి రుణం తీర్చుకొంటానని చెప్పారు. పార్టీ ఆవిర్భావానికి ఊపిరిలూదిన జన్మనివ్వడమే కాకుండా 2006 ఎన్నికల్లో పునర్జన్మను ప్రసాదించిన ఈ గడ్డకు ఎంత చేసినా తక్కువే అని చెప్పారు. కరీంనగర్ ప్రజల రుణం అందరి కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకున్నా తీర్చుకోలేమన్నారు. మానేరు రివర్ ఫ్రంట్, సస్పెన్షన్ బ్రిడ్జి, మౌలిక వసతుల విషయంలో శరవేగంగా పనులు జరుగుతున్నాయని.. భూగర్భ మురికి కాలువ పనుల కోసం అవసరమైన రూ. 30 కోట్ల నిధులను ఇస్తామన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన షీ టీమ్స్, షీ షటిల్స్‌ను కరీంనగర్‌లో విస్తరిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న 4800 మంది మహిళా సంఘాల రిసోర్స్‌పర్సన్స్‌కు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మెప్మా సిబ్బందికి సంబంధించిన హెచ్‌ఆర్‌పీ విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

పంటల బీమాపై అమెరికన్ వర్సిటీ అధ్యయనం

హైదరాబాద్/బండ్లగూడ, నమస్తే తెలంగాణ: మన దేశంలో అమలవుతున్న పంటల బీమా పథకంపై అధ్యయనం చేసేందుకు అమెరికాలోని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావుతో భేటీ అయ్యారు. దేశంలో అమలవుతున్న వ్యవసాయ బీమా పథకం అమలుతీరు, రైతులకు మరింత మేలు కల్గించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు వంటి పలు అంశాలపై అధ్యయనం చేయనున్నట్టు జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రతినిధులు కరీనా అబోర్న్‌సెన్, సీవీ కుమార్ ఉపకులపతికి వివరించారు. రాష్ట్రంలో అధ్యయనం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారాన్ని కోరారు. వారి అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు ఈ నెల 17 నుంచి 20 తేదీల మధ్య పంటల బీమాకు సంబంధించిన నిపుణులు, విశ్వవిద్యాలయంలోని అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ ఎకనామిక్స్ విభాగాల అధ్యాపకులు, వ్యవసాయశాఖ అధికారులతో ఒక సెమినార్‌ను నిర్వహించేందుకు అంగీకరించారు. దీంతోపాటు తమ విద్యార్థులు ప్రాజెక్టు వర్క్ చేసుకోవటానికి అవకాశం కల్పించాలని జాన్స్ హాప్‌కిన్స్ బిజినెస్ స్కూల్‌కి చెందిన ఫ్యాకల్టీ సభ్యులు ఉపకులపతిని కోరారు.



సోమవారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీ ప్రవీణ్‌రావుతో సమావేశమైన జాన్స్ హాప్‌కిన్స్‌వర్సిటీ ప్రతినిధులు

గనుల రెవెన్యూ 2290 కోట్లు

మొదటిపేజీ తరువాయి...

ఆన్‌లైన్ చేయడంతోపాటు, ఇతర పరిపాలనాపరమైన అంశాల్లో సాంకేతికతను వినియోగించి సులువైన విధానాలను తీసుకొచ్చారు. గనులశాఖకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించడంతో ఆ శాఖకు చెందిన పూర్తి సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఈ పోర్టల్ ద్వారానే గనులశాఖ చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా చేసే వెసులుబాటు కలిగింది. ఒకే చోట సంవత్సరాలుగా తిష్టవేసిన అధికారులు, సిబ్బందిని ఏకకాలంలో బదిలీచేసి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసాధారణ పురోగతి సాధించిన శాఖల్లో గనులశాఖ ఒకటిగా నిలిచింది. ఈ శాఖ ద్వారా 2016-17లో రూ.3,169 కోట్ల ఆదాయం లభించింది. 103 శాతం లక్ష్యాన్ని సాధించి, దేశంలోనే అత్యధిక వృద్ధిరేటు నమోదైన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

గనికి జియో ట్యాగింగ్.. హద్దులకు జియో ఫెన్సింగ్

ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ఎలాంటి కార్యకలాపాలు చేపట్టని గనులపై చర్యలు తీసుకుంటున్నారు. లీజు నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ ప్రారంభిస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఈ కారణంగానే పనులు ప్రారంభించని గనులపై చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అలాగే ప్రమాణాలు పాటించకుండా మైనింగ్ చేస్తున్న క్వారీలపైనా కఠినంగా వ్యవహరిస్తున్నారు. గనులశాఖలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా తనిఖీలను డిజిటలైజ్ చేసేందుకు ఐటీ సహకారాన్ని తీసుకుంటున్నారు. తనిఖీలను రియల్ టైం మానిటరింగ్ చేయడం, తనిఖీల నివేదికలను క్షేత్రస్థాయి నుంచే పంపే ఏర్పాట్లు చేశారు. ప్రతి గనిని జియోట్యాగ్ చేయడంతోపాటు, హద్దులు దాటి మైనింగ్ చేయకుండా జియోఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇలా సాంకేతిక అంశాలను గనులశాఖలో అమలు చేయడం ద్వారా పారదర్శకత పెరగడంతో పాటుగా ప్రభుత్వ ఆదాయం పెరుగుతూ వచ్చింది.

గనుల శాఖ ఆదాయం వివరాలు
(2017 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు)

	లక్ష్యం	చేరింది (రూ.కోట్లలో)
మేజర్ మినరల్స్	143.49	141.61
బొగ్గు	1291.25	1273.59
మైనర్ మినరల్స్	514.31	522.68
ఎంబీఎల్ సెస్	6.68	7.29
ఇసుక ద్వారా	257.75	344.83
మొత్తం	2213.48	2290


2010 నుంచి గనుల శాఖ ఆదాయం

సంవత్సరం	ఆదాయం (రూ.కోట్లలో)
2010-11	207.82
2011-12	1361.56
2012-13	1780.88
2013-14	1806.99
2014-15	1968.27
2015-16	2369.72
2016-17	3169.00
2017-18	2290.00 (2017 నవంబర్ వరకు)

గుండు హనుమంతరావుకు కేటీఆర్ అండ

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం • కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న హాస్యనటుడు





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మరోమారు నిరూపించుకొన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ప్రముఖ హాస్యనటుడు గుండు హనుమంతరావుకు.. మంత్రి కేటీఆర్ అండగా నిలిచి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షల సహాయం అందించారు. కొద్దికాలంగా సినిమా అవకాశాలు లేకపోవడంతో హనుమంతరావు ఆర్థికంగా కష్టాలు పడుతున్నారు. వారానికి మూడుసార్లు డయాలిసిస్ చేయించుకోవలసి ఉన్నప్పటికీ, అందుకు అవసరమైన డబ్బు లేకపోవడంతో ఇంట్లోనే ఉండి చికిత్స చేయించుకుంటున్నారు. హనుమంతరావు దీన స్థితిని గమనించిన మెగాస్టార్ చిరంజీవి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ద్వారా రూ.2 లక్షల సాయం అందించారు. తనకు ఆరోగ్యం బాగలేకపోవడంతోపాటు, ఆర్థికంగా కూడా ఇబ్బందులున్నాయంటూ గుండు హనుమంతరావు ఇటీవల ఓ టీవీ చానల్‌లో వివరించడం తన దృష్టికి రావడంతో మంత్రి కేటీఆర్ తక్షణం స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆయనకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను మంత్రి ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. గుండు హనుమంతరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా కొత్త పంచాయతీరాజ్ చట్టం

- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి
- చట్టం రూపకల్పనపై మంత్రుల సబ్‌కమిటీ సమావేశం



సోమవారం పంచాయతీరాజ్‌చట్టం రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ సబ్‌కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జూపల్లి కృష్ణారావు. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కే తారాక రామారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, హరీశ్‌రావు, ఈటల రాజేందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందిస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనపై ఏర్పాటుచేసిన మంత్రుల సబ్‌కమిటీ తొలి సమావేశం సోమవారం ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగింది. జూపల్లి అధ్యక్షతన జరిగిన ఈ సబ్‌కమిటీ సమావేశానికి మంత్రులు కేటీఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, అధికారులు నర్సింగ్‌రావు, వికాస్‌రాజ్, స్మితా సబర్వాల్, నీతూ కుమారి, రిటైర్డ్ ఐఏఎస్ చెల్లప్ప, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం సబ్‌కమిటీ చైర్మన్ మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాల రూపురేఖలు పూర్తిగా మార్చే లా కొత్తచట్టం రూపొందిస్తున్నామని చెప్పారు. సర్పంచ్‌లకు మరిన్ని అధికారాలు, పెద్దఎత్తున నిధులు కేటాయించడం ద్వారా స్థానిక సంస్థలను మరింత పటిష్ఠం చేయాలన్నదే చట్టంలో ప్రధాన ఆంశంగా ఉండబోతున్నదని తెలిపారు. ఎవరైనా ప్రజలకు సరైన సేవచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇచ్చిన హామీమేరకు తండాలను పంచాయతీలుగా మార్చడం, నూతన పంచాయతీలను ఏర్పాటు చేయనున్న ట్టు తెలిపారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిదీపాల ఏర్పాటు వంటివాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా బడ్జెట్‌లోనే నిధులు కేటాయించే ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. మంగళవారం సబ్‌కమిటీ మరోవిడుత సమావేశమలుతుందని జూపల్లి తెలిపారు.

సమృద్ధిగా ఆదాయ వృద్ధి

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

- పుంజుకున్న జీఎస్టీ, వ్యాట్ రాబడులు
- 19 శాతం దాటిన వృద్ధిరేటు
- లక్ష్యాన్ని అధిగమించే దిశగా అడుగులు
- రాబడుల పెంపుదలకు ప్రత్యేక చర్యలు
- పన్ను ఎగవేతదారులపై స్పెషల్ డ్రైవ్
- ఆన్‌లైన్‌లోనే నోటీసులు



రాష్ట్ర సొంత రాబడి ఆదాయం ఏటికేడు భారీగా పెరుగుతున్నది. గత ఏడాది వ్యాట్ రాబడులతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం వ్యాట్, జీఎస్టీ ఆదాయం బాగా పుంజుకున్నది. గతంలో వ్యాట్ రాబడితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి వ్యాట్, జూలై నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ రాబడుల్లో 19 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఈ ఏడాది వాణిజ్యపన్నులశాఖ ద్వారా రూ.42 వేల కోట్ల రాబడిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా డిసెంబర్ నాటికే రూ.30,224 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో ఇదే సమయానికి రూ.25,390 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఈసారి అదనంగా రూ.5వేల కోట్లకు పైగా రాబడి రావడం విశేషం. మరో మూడునెలల్లో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడానికి రాష్ట్ర అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుత తీరుని పరిశీలిస్తే ఈసారి లక్ష్యాన్ని మించి రాబడులు సాధిస్తామన్న ధీమాతో అధికారులున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు వచ్చిన ఆదాయంలో పెట్రోల్, డీజిల్‌ఉత్పత్తులపై వ్యాట్ రూ.6,400 కోట్ల కాగా.. మద్యంపై వ్యాట్ ద్వారా రూ.5,511.89 కోట్ల రాబడి వచ్చింది. ఇక స్టేట్ జీఎస్టీ రూపంలో రూ. 3,437.92 కోట్లు, ఐజీఎస్టీ ద్వారా రూ.3,985.47 కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ సర్దుబాటు రూ.2,900 కోట్ల ఆదాయం వచ్చింది. జీఎస్టీ నష్ట పరిహారం రూ.169 కోట్లతోపాటు వ్యాట్ నుంచి జీఎస్టీకి మారిన సమయానికి బకాయిలు, ఇతర అన్నిరకాల పన్ను వసూళ్ల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.8,327 కోట్లు వసూలయ్యాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో రాబడులలో వృద్ధిరేటు పెరిగింది.

అదనంగా రూ.రెండు వేల కోట్ల ఆదాయం

జీఎస్టీ, వ్యాట్ రాబడులను మరింత పెంచి ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అధిగమించడానికి వాణిజ్యపన్నులశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బకాయిలను వసూలు చేయడానికి వాణిజ్యపన్నులు, ఆబ్కారీశాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదేశాలతో 22 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. గతంలో అత్యధికంగా వ్యాట్ చెల్లించి.. ప్రస్తుతం జీఎస్టీ చెల్లించని 185 మంది ఎగవేతదారులను, 8824 మంది పన్ను రిటర్న్‌లను దాఖలు చేయని వారిని గుర్తించారు. వారికి ఆన్‌లైన్‌లోనే నోటీసులు పంపాలని సోమేశ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. వారి ద్వారా సుమారు రూ.186 కోట్ల వరకు రావొచ్చని అంచనా వేశారు. పాత బకాయిల వసూలు కోసం కమిషనర్ వీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ మొదలైంది. 15,792 మంది వ్యాట్ చెల్లింపుదారులు జీఎస్టీ రిటర్న్‌లను దాఖలు చేయలేదని.. వీరంతా గత ఏడాది రూ.708 కోట్ల పన్నులు చెల్లించారని గుర్తించారు. ప్రవేశపన్నుపై రైల్వేశాఖతోపాటు ఇతర కేంద్ర సంస్థలతో ఉన్న కోర్టు వివాదాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. దీనిద్వారా రూ.448 కోట్ల వరకు ఆదాయం రావచ్చని అంచనా. ప్రస్తుతం ప్రతినెలా కనీసస్థాయిలో వ్యాట్, జీఎస్టీ ద్వారా రూ.3 వేల కోట్లు వస్తున్నాయి. వచ్చే మూడునెలల్లో అధమపక్షం మరో రూ.పదివేల కోట్ల వరకు రాబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంతోపాటు ప్రత్యేక చర్యల వల్ల మరో రూ.వెయ్యి కోట్ల వరకు రాబడి పెరిగే అవకాశమున్నదని విశ్లేషిస్తున్నారు. అంటే ప్రస్తుతం వసూలైన రాబడికి మూడునెలల ఆదాయాన్ని కలిపితే నిర్దేశిత లక్ష్యం రూ.42 వేల కోట్లు దాటే అవకాశమున్నది. దీంతోపాటు ఈసారి ఆబ్కారీ రాబడి రూ.5,400 కోట్ల నుంచి రూ.7వేల కోట్ల వరకు.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఆదాయం రూ.3,500 కోట్ల నుంచి రూ.5 వేల కోట్లకు మించి రాబడి వచ్చే అవకాశముంది.

గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది రాబడుల తీరు (రూ.కోట్లలో)

నెల	2016-17 వ్యాట్ వసూళ్లు	2017-18 వ్యాట్, జీఎస్టీ ఇతర	వృద్ధిరేటు (%లో)
ఏప్రిల్	2934.59	3372.09	15
మే	2591.58	3126.92	21
జూన్	2737.30	3323.23	21
జూలై	2792.10	3549.32	27
ఆగస్టు	2799.56	2967.81	6
సెప్టెంబర్	2815.44	3228.48	15
అక్టోబర్	2750.79	3506.57	27
నవంబర్	2880.80	3403.70	18
డిసెంబర్	2675.54	3333.18	25
మొత్తం	24,977.70	29,811.30	19

(డిసెంబర్ చివరివారం)

తాజా లెక్కల ప్రకారం డిసెంబర్ 31నాటికి రాబడి రూ.30,224 కోట్లు దాటింది. వృద్ధిరేటు 19 శాతంగా ఉన్నది. వచ్చే మూడునెలల్లో వృద్ధిరేటు 21 నుంచి 25 శాతం వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో నేటినుంచి సీడీపీవో, ఏసీడీపీవో ప్రాథమిక 'కీ'



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖలోని చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ప్రాథమిక 'కీ' మంగళవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ 'కీ' పై అభ్యంతరాలను ఈ నెల 11 నుంచి 17వ తేదీవరకు తెలుపవచ్చని కమిషన్ కార్యదర్శి వివరించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టంచేశారు. ఈ నెల 4న ఈ పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే.

టీఆర్టీకి 2,62,390 దరఖాస్తులు

ఎల్లుండి వరకు సవరణకు అవకాశం: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీచర్ కొలువుల భర్తీ కోసం నిర్వహించనున్న టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ)కు 2,62,390 దరఖాస్తులు వచ్చినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ నెల ఏడో తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియగా సోమవారం దరఖాస్తుల వివరాలను టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. ఈ నెల 9వ తేదీ నుంచి ఈ నెల 11వ తేదీ వరకు టీఆర్టీ అప్లికేషన్ బయోడేటాలో తప్పులు ఉంటే సవరించుకోవాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి సూచించారు. ఒక్కసారి మాత్రమే తప్పులు సవరించే అవకాశం ఉన్నదని వెల్లడించారు. ఒకసారి అప్లికేషన్ సబ్మిట్ చేసిన తర్వాత మరోసారి అవకాశం ఉండదని స్పష్టంచేశారు.

టీఆర్టీకి సబ్జెక్ట్‌లవారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు

స్కూల్ అసిస్టెంట్స్	- 1,45,158
సెకండరీ గ్రేడ్ టీచర్	- 89,149
లాంగ్వేజ్ పండిత్	- 24,219
స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	- 2177
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	- 16,871

టీఎస్ కాప్ యాప్ భేష్

ప్రశంసించిన ఇతర రాష్ట్రాల డీజీపీలు

మధ్యప్రదేశ్‌లో ముగిసిన 52వ డీజీపీల వార్షిక సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డీజీపీల వార్షిక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పోలీసులు ప్రత్యేకస్థానాన్ని దక్కించుకొన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన టీఎస్ కాప్ యాప్ పనితీరు, ఫలితాలపై ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు ఇతర రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, ఇతర ఉన్నతాధికారులు మంత్రముగ్ధులయ్యారు. ట్యాబ్ సహాయంతో వస్తున్న ప్రయోజనాలు, రాష్ట్ర పోలీసుశాఖలో అమలవుతున్న విధివిధానాలను డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి, ఇతర అధికారులు సమావేశంలో వివరించారు. ఈ నెల ఆరో తేదీ (శనివారం) నుంచి మూడురోజులపాటు మధ్యప్రదేశ్ టెకన్‌పూర్ బీఎస్ఎఫ్ అకాడమీలో 52వ డీజీపీల వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 250 మంది ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇందులోభాగంగా తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు విధానం, వస్తున్న ఫలితాలను డీజీపీ, సహా ఉన్నతాధికారులు వెల్లడించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజల్లోకి వెళ్లడం, శాంతిభద్రతలతోపాటు ఇతరశాఖల సమన్వయంతో ప్రజలకు దగ్గరయ్యే విధానం, స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహంగా ఉండేందుకు ప్రవేశపెట్టిన ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు, ఫలితాలను డీజీపీ తెలిపారు. అన్నిరకాల భద్రత కోసం టెక్నాలజీ, సీసీ కెమెరాల వినియోగం దానితో కలిగిన ప్రయోజనాలు.. రాష్ట్రంలో సాధించిన ఫలితాలను వివరించారు. సీసీ కెమెరాలు, టీఎస్ కాప్ యాప్‌తో శాంతిభద్రతల పరిరక్షణ, నేరస్థులపై నిఘా పెట్టడంతోపాటు ఏదైనా నేరం జరిగితే సాంకేతికంగా పక్కా ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించవచ్చని చెప్పారు. దీనిని రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. సాంకేతిక సహాయంతో ఉగ్రవాదులు, మావోయిస్టులపై నిఘా పెడుతున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగాల కోసం వికలాంగులకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలకు రాష్ట్రంలోని అర్హత కలిగిన నిరుద్యోగ వికలాంగులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బీ శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హతకలిగిన నిరుద్యోగ వికలాంగులు www.tvcc.telangana.gov.in, www.wdsc.telangana.gov.in వికలాంగుల సంక్షేమశాఖ వెబ్‌సైట్‌ల ద్వా రా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆయా జిల్లాలకు సంబంధించిన జిల్లా సంక్షేమ అధికారులకు ఈ నెల 20 తేదీలోగా సమర్పించాలని సూచించారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



సోమవారం సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో సౌత్ ఇండియా సైన్స్ ఫేర్‌ను ప్రారంభించాక ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, ఎంపీ దత్తాత్రేయ, ఎమ్మెల్యే సాయన్న

- మూడున్నరేండ్లలో 544 గురుకులాల ఏర్పాటు
- విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య
- విద్యాహబ్‌గా ఎదుగుతున్న హైదరాబాద్
- సౌత్ ఇండియా సైన్స్ ఫేర్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం కడియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, ఇందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ సీఎం, విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో గురుకుల విద్యావిధానాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్‌ను కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యనందించేందుకు 2014 నుంచి మూడున్నరేండ్లలో 544 గురుకులాలను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సంక్షేమం, అభివృద్ధిరంగాలతోపాటు, విద్యారంగంలోనూ నంబర్‌వన్‌గా దూసుకుపోతున్నదన్నారు. దేశంలో ప్రతి లక్షమందికి ప్రభుత్వ విద్యాలయాలు సగటున 28 మాత్రమే ఉండగా, తెలంగాణలో మాత్రం 59 విద్యాలయాలు ఉన్నాయని కడియం తెలిపారు. దీనిద్వారా దేశం మొత్తంలో తెలంగాణలోనే నాణ్యమైన విద్య అందుతున్నదని స్పష్టమవుతున్నదన్నారు. ఇప్పటికే హైదరాబాద్ విద్యాహబ్‌గా మారిందని, అనేక ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలతో పాటు పరిశోధనా కేంద్రాలు, చారిత్రకసంస్థలు వంటివి అనేకం ఇక్కడ ఉన్నాయని చెప్పారు. రాజధానిలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలకు సంబంధించి సౌత్ ఇండియా సైన్స్ ఫేర్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు సైన్స్‌ఫేర్‌ల ద్వారా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ఈ పరిశోధనలు మానవాళి అభివృద్ధికి ముఖ్యంగా వ్యవసాయఅభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని కోరా రు. దేశవ్యాప్తంగా పరిశోధనలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటుచేస్తున్న సైన్స్‌ఫేర్‌ల నిర్వహణకు కేంద్రం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నానని తెలిపారు. డిప్యూటీ సీఎం మహమూద్ అలీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి సైన్స్‌ఫేర్‌లను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం కేసీఆర్ మైనారిటీ విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే సాయన్న, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బీ శేషుకుమారి, విట్ డైరెక్టర్ మదన్‌గోపాల్, హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్ నిఖిల తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌పై త్రైపాక్షిక భేటీకి కసరత్తు!

- కర్ణాటకతో పలుమార్లు తెలంగాణ సంప్రదింపులు
- అడ్డుపడుతున్న ఏపీ.. ముందుకుసాగని పనులు
- ఆర్డీఎస్ ఆధునీకరణకు పరిష్కారం దిశగా నీటిపారుదలశాఖ అడుగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్) ఆధునీకరణపై రాష్ట్ర సర్కారు ప్రత్యేక దృష్టిపెట్టింది. నీటిపారుదలశాఖ చొరవతో పనుల్లో వేగం పెంచింది. అయితే, తెలంగాణ పరిధిలోని పనులు పూర్తయినా.. కర్ణాటక పరిధిలోని పనులు సగం కూడా పూర్తికాలేదు. పనులకు ఆంధ్రప్రదేశ్ మోకాలడ్డుతుండటంతో సర్కారు ప్రయత్నాలు ఫలించడంలేదు. అందుకే ఏపీ, కర్ణాటక, మన రాష్ట్రంతో కలిపి త్రైపాక్షిక సమావేశానికి తెలంగాణ నీటిపారుదలశాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులను 2008లోనే ప్రారంభించినా నాటి ప్రభుత్వం శ్రద్ధ పెట్టకపోవడంతో ముందుకుసాగలేదు. కర్ణాటక పరిధిలో ఆర్డీఎస్ కాల్వ 42.60 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ పనులు పదేండ్లయినా సగం కూడా పూర్తికాలేదు. కర్ణాటక జలవనరులశాఖ మంత్రి పాటిల్ ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఆర్డీఎస్ ఆధునీకరణపై ప్రత్యేకంగా చర్చించారు. ఏపీ సహకారంలేనిదే పనులు ముందుకుసాగవని పాటిల్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమతో మాట్లాడి మూడు రాష్ట్రాలతో త్రైపాక్షిక సమావేశాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హరీశ్‌రావు చెప్పారు.

కర్ణాటక పరిధిలో ఆర్డీఎస్ ఆధునీకరణ పనుల తీరు..

- **ప్యాకేజీ-1:** రూ.2.60 కోట్ల అంచనా వ్యయంతో ఆర్డీఎస్ ఆనకట్ట హెడ్‌వర్క్స్ పనులు చేపట్టాలి. తర్వాత ఈ వ్యయం రూ.12.85 కోట్లకు పెరిగింది. ఆనకట్ట జాకెటింగ్ 820 మీటర్ల మేర చేయాల్సి ఉండగా.. 2014 జూన్‌లో మొదలైన పనులు 160 మీటర్ల మేర పూర్తయ్యాయి. ఏపీ రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి గత ఏప్రిల్‌లో పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించినా ఏపీ మళ్లీ అడ్డుకున్నది. ప్రస్తుతం దీనివ్యయం రూ.13.20 కోట్లకు పెరిగింది.
- **ప్యాకేజీ-2:** ఆర్డీఎస్ ప్రధాన కాల్వ మొదటి 15 కిలోమీటర్ల మరమ్మతులు, సీసీ లైనింగ్ చేపట్టాల్సి ఉంది. దీని అంచనా వ్యయం రూ.50.23 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.15 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.
- **ప్యాకేజీ-3:** ఆర్డీఎస్ ప్రధాన కాల్వ 15 నుంచి 30వ కిలోమీటర్ వరకు మరమ్మతులు, సీసీ లైనింగ్ పనులు చేయాలి. అంచనా వ్యయం రూ.23.05 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.22.41 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.
- **ప్యాకేజీ-4:** ఆర్డీఎస్ ప్రధాన కాల్వ 30 నుంచి 42.5 కిలోమీటర్ వరకు మరమ్మతులు, సీసీ లైనింగ్ పనులు చేయాలి. అంచనా వ్యయం రూ.19.58 కోట్లు కాగా.. మొత్తం పని పూర్తయింది. మొత్తం నాలుగు ప్యాకేజీల అంచనా వ్యయం రూ.105.73 కోట్లు కాగా, ఇందులో రూ.58.94 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి.



ఇదేం ప్రజాస్వామ్యం, ఇదేం ప్రభుత్వం. ఒక జర్నలిస్టు నిజాయితీతో ఆధార్ సమాచారం దుర్వినియోగంపై కథనం రాస్తే కేసులు పెడతారా? మరో దేశం కనుసన్నల్లో నడిచే బానిస ప్రభుత్వంలో మనం నివసిస్తున్నామా? ఇది ప్రజాస్వామ్య స్వతంత్ర పాలనకు నిదర్శనం ఎంతమాత్రం కాబోదు.

శత్రుఘ్నసిన్హా, బీజేపీ సీనియర్ నేత

ఒడిషా సంస్కృతిక చిహ్నం కోణార్క్ సూర్య దేవాలయ చక్రాన్ని పది రూపాయల నోట్‌పై ముద్రించటం హర్షణీయం. ఒడిషా ప్రజల తరపున ఆర్బీఐ గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కోణార్క్ చక్రం మన దేశ సంస్కృతి, శిల్పకళా నైపుణ్యానికి ప్రతీక.

నవీన్ పట్నాయక్, ఒడిషా ముఖ్యమంత్రి




చరిత్రలో నేడు




1768

లండన్‌లో ఆధునిక సర్కస్‌ను ప్రారంభించిన ఫిలిప్ ఆస్ట్లీ

1799



నెపోలియన్‌పై యుద్ధం కోసం నిధుల సమీకరణకు ఆదాయపన్ను విధించిన బ్రిటిష్ ప్రధాని విలియం పిట్.



1915

దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన మహాత్మాగాంధీ.

పార్లమెంటు శీతాకాల సమావేశాలు రాజకీయ అంశాలకన్నా ట్రిపుల్ తలాక్‌పై న్యాయపరమైన అంశాల విషయంలో వేడి వేడిగా సాగాయి. ట్రిపుల్ తలాక్ కారణంగా ముస్లిం మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని సవరించేందుకు, చట్టపరంగా రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు లోక్‌సభలో నెగ్గుకొచ్చిన బిల్లు రాజ్యసభలో ప్రతిపక్షాల ఆందోళనతో పెండింగ్‌లో పడింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌లో న్యాయపరమైన విషయాలకన్నా, రాజకీయాంశాలే ప్రధానమయ్యాయన్న తీరు కనిపిస్తున్నది. ఏదేమైనా ముస్లిం మహిళల హక్కుల రక్షణకు ఉద్దేశించిన బిల్లుపై పార్టీలు రాజకీయాలకతీతంగా వ్యవహరించాలి.

ది హిందూ

మారుతున్న సామాజిక, అభివృద్ధికి అనుగుణంగా భారతీయ విశ్వవిద్యాలయాలు మారాల్సిన అవసరమున్నదని కేంద్ర మానవాభివృద్ధిశాఖ, ఉన్నత విద్యామండలి అభిప్రాయపడుతున్నాయి. ఉత్పాదకత కేంద్రంగా గాకుండా నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా విద్య సాగాలి. ఇదే క్రమంలో శాస్త్ర, సాంకేతిక రంగ అభివృద్ధితో ఉద్యోగుల తొలిగింపు ఒక విధానంగా ముందుకు వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందే మేల్కోవాల్సిన అవసరం ఉన్నది. లేకపోతే భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుంది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

శబ్ద కాలుష్యం

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎట్టకేలకు అనుమతి లేకుండా వాడుతున్న లౌడ్ స్పీకర్లను తొలిగించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టక తప్పలేదు. అనుమతిలేని లౌడ్‌స్పీకర్లను తొలిగించాలంటూ హైకోర్టు లక్నో బెంచి గత నెల ఇరవయ తేదీన యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల పదిహేనవ తేదీలోగా అనుమతిలేని లౌడ్‌స్పీకర్లను తొలిగించాలని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించింది. దేవాలయాలు, మసీదులు, చర్చిలతో సహా అన్ని ప్రదేశాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. సామాజిక ప్రదేశాలలో ఎక్కడైనా లౌడ్‌స్పీకర్లను అనుమతి లేకుండా ఉపయోగిస్తున్నట్టయితే, వారికి దరఖాస్తు పత్రాలు ఇచ్చి, గడువులోగా అనుమతి తీసుకోమని సూచిస్తారు. అయినప్పటికీ అనుమతి పొందనట్టయితే చర్యలు తీసుకుంటారు. ఆయా సంస్థలు దరఖాస్తు పత్రంలో నిర్దేశిత నియమాలకు లోబడి ఉంటామని హామీ ఇవ్వవలసి ఉంటుంది. ఏదైనా ఏ ఆవరణలోనైనా లౌడ్ స్పీకర్ పెట్టుకుంటే, పరిసర శబ్ద స్థాయి కన్నా పది డెసిబెల్స్ మించి ధ్వని ఉండకూడదు. ఈ నిబంధనలను పాటిస్తే శబ్దం ఆ ఆవరణను దాటి బయటికి వినిపించదు. కోర్టు ఆదేశాలు గతంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయి. సమావేశాలను నిర్వహించుకునే వారి సౌకర్యానికి ఇబ్బంది కలుగకుండానే, మిగతా ప్రజల హక్కులను కాపాడే విధంగా నిబంధనలు ఉన్నాయి. కానీ వీటిని ఇంతకాలం అమలు చేయడానికి ప్రభుత్వాలు ఆసక్తి చూపలేదు. కానీ కాలానుగుణంగా ఇదొక పెద్ద సమస్యగా ముందుకు రావడంతో న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవలసి వచ్చింది.

శబ్ద కాలుష్యాన్ని కట్టడి చేయడానికి కేంద్రం 2000 సంవత్సరంలో జారీచేసిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వవలసిందిగా కోరుతూ ఒక న్యాయవాది దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ఆధారంగా చేసుకొని న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, అబ్దుల్ మొయిన్‌తో కూడిన ధర్మాసనం యూపీ ప్రభుత్వానికి తాజా ఆదేశాలు జారీ చేసింది. శబ్ద కాలుష్యం లేకుండా జీవించేహక్కు, నిద్రపోయే హక్కు రాజ్యాంగంలోని 21వ అధికరణానికి రెండు పార్శ్వాలన్న పిటిషనర్ వాదనను ధర్మాసనం పునరుద్ఘాటించింది. అనుమతి లేని లౌడ్ స్పీకర్లను తొలిగించి ఫిబ్రవరి ఒకటవ తేదీలోగా తమకు సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణ సమయంలో అఫిడవిట్లు దాఖలు చేయకపోతే, వ్యక్తిగతంగా హాజరు కావలసి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లు ఉపయోగించ కూడదు. రాత్రి పదిగంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు వాటిని వాడకూడదు. సాంస్కృతిక ఉత్సవాల వంటి సందర్భాలలో రాత్రి పదిగంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి ఇచ్చినా, ఆ మినహాయింపు ఏడాదికి పదిహేను రోజులకు మించకూడదు. ఈ సందర్భంగా కూడా నిర్దేశిత నియమాలను ఉల్లంఘించకూడదు. లౌడ్ స్పీకర్ల వాడకం వల్ల శబ్ద కాలుష్యం పెరుగుతున్నా, అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడం లేదని న్యాయస్థానం తప్పు పట్టింది. న్యాయస్థానం కఠినంగా ఆదేశాలు జారీ చేయడంతో, రాష్ట్ర ప్రభుత్వం అధికార బృందాలను ఏర్పాటు చేసి, లౌడ్‌స్పీకర్లపై చర్యలు తీసుకుంటున్నది. అనుమతి తీసుకున్న లౌడ్ స్పీకర్లకు నెంబర్లు కేటాయించి, నియంత్రించాలని నిర్ణయించింది.

> **దేశ వ్యాప్తంగా పలు నగరాలలో సంబంధిత పరికరాలను అమర్చి శబ్దకాలుష్యాన్ని నమోదు చేస్తున్నారు. కానీ ఈ కాలుష్యాన్ని అరికట్టే విషయంలోనే ప్రభుత్వాలు సఫలం కావడం లేదు. అందుకే యూపీ న్యాయస్థానం కఠినంగా ఆదేశాలు జారీ చేయాలసి వచ్చింది. శబ్ద కాలుష్యాన్ని ఏ సామాజికవర్గానికి వ్యతిరేకమైనదిగా భావించకూడదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, మన చర్యల వల్ల ఇతరులకు ఇబ్బంది కలుగకూడదనే ఆధునిక విలువను గౌరవించడం అందరి బాధ్యత**

నగర ప్రాంతాలలో శబ్దకాలుష్యం పెద్ద సమస్యగా మారింది. గత ఏడాది మే నెలలో ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించిన వివరాల ప్రకారం– దేశంలోని ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర ఏడు నగరాలలో శబ్దకాలుష్యం పరిమితిని మించి ఉన్నది. వాహనాల మోత కూడా శబ్ద కాలుష్యానికి కారణం. శబ్ద కాలుష్యం వల్ల అనేక మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయి. తాత్కాలిక, దీర్ఘకాలిక అనారోగ్యం ఏర్పడుతుంది. వినికిడి లోపం సాధారణంగా ఏర్పడే ముప్పు. శబ్దకాలుష్యం వల్ల మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఏకాగ్రత దెబ్బతింటుంది. ప్రవర్తనాసరళి మార్పు చెందుతుంది. హైపర్‌టెన్షన్, గుండె వ్యాధులు రావచ్చు. నిద్రలేమి అనేక సమస్యలకు దారితీస్తుంది. అయినా సమస్య తీవ్రతను సమాజం ఇంకా గుర్తించలేదు. శబ్ద కాలుష్యం పరిశ్రమల మూలంగా లేదా సామాజిక కార్యక్రమాల వల్ల ఏర్పడవచ్చు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వం నిబంధనలను రూపొందించినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. ప్రజలకు, ప్రభుత్వాలకు వీటిపై ఇందుకు సంబంధించిన స్పృహ కొరవడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తరగతి గదిలో, నిద్రపోయే గదిలో ఏస్థాయిలో శబ్దం మించకూడదో నిర్దేశించింది. 1981 నాటి కాలుష్య నియంత్రణ చట్టం మితిమీరిన శబ్దాన్ని వాయు కాలుష్యంగా గుర్తించింది. దేశ వ్యాప్తంగా పలు నగరాలలో సంబంధిత పరికరాలను అమర్చి శబ్దకాలుష్యాన్ని నమోదు చేస్తున్నారు. కానీ ఈ కాలుష్యాన్ని అరికట్టే విషయంలోనే ప్రభుత్వాలు సఫలం కావడం లేదు. అందుకే యూపీ న్యాయస్థానం కఠినంగా ఆదేశాలు జారీ చేయాలసి వచ్చింది. శబ్ద కాలుష్యాన్ని ఏ సామాజికవర్గానికి వ్యతిరేకమైనదిగా భావించకూడదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, మన చర్యల వల్ల ఇతరులకు ఇబ్బంది కలుగకూడదనే ఆధునిక విలువను గౌరవించడం అందరి బాధ్యత.

స్పందన

విద్వేషం మంచిది కాదు

తిట్లు రెండు రకాలు. పెత్తందార్లు సామాన్యులను ఉద్దేశించి నిష్కారణంగా అనేవి, సామాన్యులు కడుపుమండి పెత్తందార్లనుద్దేశించి అనేవి. మొదటి తిట్టులో దురద్దేశం వుంటుంది. రెండో తిట్టులో తీవ్రస్థాయి నిరసన వుంటుంది. ఈ రెండోది ఎప్పుడూ Literal కాదు! ఏ ఉద్యమమైనా వికాసోన్ముఖంగా సాగుతున్నప్పుడు మితవాదవర్గంతో పాటు ఉద్యమకారులు, కవులు దోపిడీదార్లయిన సీమాంధ్రులను ముఖ్యంగా రాజకీయ నాయకులను ఉద్దేశించి దూషణలు వాడిన మాట వాస్తవం. దీనికి సహేతుకతతో పాటు, కడుపుమండిన ధర్మాగ్రహం కారణం.

ఇప్పుడు.. ఇన్నేండ్ల తర్వాత ఒక పుస్తకావిష్కరణ కోసం విజయవాడ పుస్తక మహోత్సవానికి వెళ్లిన సైకిబాబపై భౌతికదాడికి పూనుకోవటం గర్హనీయం. లక్ష ఉద్యోగాలను కబళించి, పది లక్షల తెలంగాణ కుటుంబాల పొట్టగొట్టిన వాళ్లు క్షమాపణ చెప్పాలి. సాగునీటిని దశాబ్దాల పాటు దోచుకున్నవాళ్ళు క్షమాపణ చెప్పాలి, కానీ సైకిబాబ కాదు. అలాగే స్థానబలంతో దౌర్జన్యపూరితంగా తెలుగుతల్లి పాట పాడాలని బలవంత పెట్టడం దౌర్జన్యమే. తెలుగుతల్లిని ఏనాడూ తెలంగాణ ఉద్యకారులు సొంత తల్లిగా భావించలేదు. దీనికి తాము ఎదుర్కొన్న వివక్షనే పునాది. మా తల్లి తెలంగాణ తల్లి మాత్రమే.

ఇంటికి వచ్చిన అతిథికి కలిగినంతలో మర్యాద చేసి పంపంచటం సంస్కారం వున్నవాళ్ళు చేసే పని. కాని, నాలుగైదేండ్ల నాటి మాటలను కుంటిసాకులుగా చేసుకొని దౌర్జన్యానికి పూనుకోవ టం కచ్చితంగా శత్రువైఖరే. ఇది ఆంధ్రావారు గ్రహిస్తే మంచిది. విజయవాడకు వెళ్ళే అవసరం తెలంగాణ కవులకు కళాకారులకు అంతగా వుండదు. కాని హైదరాబాద్‌లో వందల సంఖ్యలో మర్యాదస్తులైన సీమాంధ్ర కవులు, కళాకారులున్నారన్న గౌరవంగా, స్వేచ్ఛగా ఉన్న విజ్ఞతతో అక్కడివాళ్ళు మెలగటం మంచిది.

-అమ్మంగి వేణుగోపాల్
(కన్వీనర్, హైదరాబాద్ కవుల వేదిక)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



డాక్టర్ ఎం. మల్లారెడ్డి

డిజిటల్ లావాదేవీలకు ఊతం

ఇటీవల రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎమ్‌డీఆర్)కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ఇవి డిజిటల్ లావాదేవీలకు ఊతం కల్పించే విధంగా ఉన్నాయి. దీంతో రానున్న రోజుల్లో డిజిటల్ లావాదేవీలు వేగంగా వృద్ధి చెందవచ్చు.

ఇటీవల రిజర్వు బ్యాంకు పరపతి విధాన సమీక్షలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి డెబిట్ కార్డు లావాదేవీలపై వసూలు చేసే ఎమ్‌డీఆర్‌ను చిన్న, పెద్ద వ్యాపారుల సౌకర్యార్థం వేర్వేరు పరిమితులతో నిర్ణయించారు. సాధారణంగా ఒక బ్యాంకు డెబిట్ లేదా క్రెడిట్ కార్డు సేవలు అందించినందుకు వ్యాపారుల నుంచి వసూలు చేసే రేటును ఎమ్‌డీఆర్ అంటారు. ఇరువై లక్షల వరకు వార్షిక టర్నోవర్ ఉన్న వర్తకులకు పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) లేదా ఆన్‌లైన్ లావాదేవీలపై ఒక్కోదానికి 0.4 శాతం లేదా గరిష్ఠంగా రూ. 200 ఎమ్‌డీఆర్‌ను విధిస్తారు. క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ ద్వారా జరిపే లావాదేవీలపై 0.3 శాతం లేదా గరిష్ఠంగా రూ. 200లుగా నిర్ణయించా రు. అలాగే వ్యాపారస్తుని వార్షిక టర్నోవర్ రూ. ఇరువై లక్షల పైబడి ఉంటే ఒక్కో లావాదేవీపై 0.9 శాతం లేదా గరిష్ఠంగా రూ. 1000 ఎమ్‌డీఆర్‌ను విధిస్తారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా అయితే దీన్ని 0.8 శాతం లేదా గరిష్ఠంగా రూ.1000 వరకు వసూలు చేస్తారు.

ప్రస్తుతం వ్యాపారులు ఎమ్‌డీఆర్‌ను వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులు డెబిట్ కార్డు చెల్లింపులను తగ్గించి నగదు రూపంలోనే చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కార్డు ద్వారా చేసే చెల్లింపులపై రూ. 1000 వరకు 0.25 శాతం ఎమ్‌డీర్, రూ. 1000–2000 వరకు లావాదేవీలపై 0.5 శాతం ఎమ్‌డీఆర్ ఉన్నది. రెండువేలకు పైబడిన లావాదేవీలపై ఒక శాతం ఎమ్‌డీఆర్ వసూలు చేస్తున్నారు. తాజా నిర్ణయంతో ఎమ్‌డీఆర్‌ను టర్నోవర్ ఆధారంగా విడదీశారు. గరిష్ఠ పరిమితి విధించారు. దీనివల్ల వినియోగదారులు తమ డెబిట్‌కార్డులను ఎక్కువగా వినియోగించే అవకాశం ఉన్నది. అలాగే చిన్న వర్తకులకు లావాదేవీల వ్యయాలు తగ్గుతాయి. ఏటీఎమ్‌లలో నగదు అందుబాటులో ఉండటం లేదు. దీంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్‌డీఆర్‌ను తగ్గించడం మంచి నిర్ణయం.

డిజిటల్ లావాదేవీలను మరింత పెంచే దిశగా ఇటీవల కేంద్ర క్యాబినేట్ సమావేశంలో మరో కీలక అడుగు పడింది. రెండు వేల వరకు వ్యాపార లావాదేవీలపై విధించే మర్చంట్ డిస్కౌంట్ రేటును రానున్న రెండేండ్లలో ప్రభుత్వమే బ్యాంకులకు రీయింబర్స్ చేయనున్నట్టు కేంద్రం వెల్లడించింది. దీంతో రెండు వేల వరకు జరిపే డిజిటల్ లావాదేవీలపై ఎమ్‌డీఆర్‌ను వినియోగదారులు వ్యాపారస్తులకు, వ్యాపారస్తులు బ్యాంకులకు చెల్లించనవసరం లేదు. ఇది డెబిట్ కార్డు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), భీమ్ యాప్, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్స్ సర్వీసెస్ (ఏఈపీఎస్) ద్వారా జరిపే లావాదేవీలకు వర్తిస్తుంది. ఇటు వినియోగదారులపై, వ్యాపారులపై కొంతభారం తగ్గించడానికి, తద్వారా పెద్ద మొత్తంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. ఈ చర్య ద్వారా 2018–19 ఆర్థిక సంవత్సరంలో 1050 కోట్లు, 2019–20లో 1462 కోట్ల భారం పడనుందని ప్రభుత్వం అంచనా వేసింది. మొత్తం డిజిటల్ వ్యవహారాల్లో రెండు వేల లోపు జరిగే లావాదేవీలు దాదాపు 15–20 శాతం లోపు విలువను కలిగి ఉంటాయని తెలిపారు. ఈ వ్యవహారాల మొత్తం వ్యయం, రీయింబర్స్‌మెంట్ స్థాయిలను నిర్ణయించడానికి కేంద్ర ప్రభుత్వం కార్యదర్శులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. డిజిటల్ లావాదేవీలు పెంచడానికి ఈ రెండు కీలక నిర్ణయాలు దోహదపడుతాయి.

అయితే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎమ్‌డీఆర్‌ను తగ్గింపు చేయడం వల్ల బ్యాంకులపై స్వల్ప ప్రభావం పడనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తాజా నిర్ణయం వల్ల దేశంలోని ప్రధాన బ్యాంకులైన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకుల ఆదాయంపై 0.3 శాతం మేరకు లాభదాయకతపై 1.1 శాతం వరకు ప్రభావం పడనుందని అమెరికాకు చెందిన మోర్గాన్ స్టాన్లీ వెల్లడించింది. స్తబ్దుగా ఉన్న డెబిట్ కార్డు లావాదేవీలను పెంచడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ బీపీ కనుంగో తెలిపారు.

రిజర్వుబ్యాంకు వెల్లడి చేసిన గణాంకాల ప్రకారం– 2016 నవంబర్‌లో మొత్తం డెబిట్ కార్డుల సంఖ్య 75.12 కోట్లు ఉండగా, 10 శాతం పెరుగుదల రేటుతో 2017 అక్టోబర్ నాటికి 82.63 కోట్లకు చేరుకుంది. అదే విధంగా పాయింట్ ఆఫ్ సేల్స్ (పీఓఎస్) యంత్రాల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2016 నవంబర్‌లో 15.90 లక్షలుగా ఉన్న పీఓఎస్‌లు, 2017 అక్టోబర్ వరకు 29.58 లక్షలకు పెరిగాయి. దాదాపు 86 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. దీన్నిబట్టి వ్యాపారులు డిజిటల్ వ్యవహారాలపై అడుగులు వేస్తున్నట్టు ప్రస్ఫుటం అవుతున్నది. పీఓఎస్‌ల ద్వారా డెబిట్ కార్డు లావాదేవీలు 2016 నవంబర్‌లో 32, 174.28 కోట్ల నుంచి 2017 అక్టోబర్ వరకు రూ. 40, 869.5 కోట్లకు పెరిగి 27 శాతం వార్షిక పెరుగుదల రేటును నమోదు చేశాయి. ప్రస్తుతం రిజర్వుబ్యాంకు, కేంద్ర ప్రభుత్వం ఎమ్‌డీఆర్ తగ్గించిన నేపథ్యంలో డెబిట్‌కార్డు వ్యవహారాల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉన్నది. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జరిపే యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ ద్వారా జరిపే లావాదేవీలు కూడా గణనీయమైన వృద్ధిని సాధించాయి.

> రానున్న కేంద్ర బడ్జెట్‌లో డిజిటల్ లావాదేవీలను పెంచడానికి మరింత ప్రోత్సాహం కల్పించాలి. డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్‌పై మరింత అవగాహన పెంచాలి. తొలిసారి డిజిటల్ లావాదేవీలలో అడుగులుపెడుతున్న సాధారణ వినియోదారుడికి విశ్వాసం కల్పించాలి. సైబర్ భద్రత కల్పించడం చాలా ముఖ్యం.

ప్రస్తుతం పాయింట్ ఆఫ్ సేల్స్ యంత్రాలను వ్యాపారులు వినియోగించే విధంగా ప్రభుత్వం, బ్యాంకులు అవగాహన కల్పించాలి. అదే విధంగా ఎమ్‌డీఆర్‌లో వచ్చిన తగ్గింపు గురించి, రెండు వేల వరకు లావాదేవీలపై ఎమ్‌డీఆర్‌ను ప్రభుత్వం బ్యాంకులకు రీయింబర్స్ చేసే విషయం గురించి వినియోగదారులలో, వ్యాపారులలో విస్తృత అవగాహన కల్పించాలి. అలాగే వ్యాపారులు ఎమ్‌డీఆర్ రీయింబర్స్‌మెంట్ విషయంలో అక్రమాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వినియోగదారులు, వ్యాపారులు నగదు రహిత లావాదేవీల వైపు అడుగులు వేస్తారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు నాంది పలుకుతారు. ప్రస్తుతం దేశంలో నగదు, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) నిష్పత్తి 12 శాతం ఉందని, సాధారణంగా అభివృద్ధిచెందిన దేశాల్లో ఇది 7–8 శాతం ఉంటుందని ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ హెచ్.ఆర్. ఖాన్ తెలిపారు. భారత ప్రభుత్వం ఈ నిష్పత్తిని 12 శాతం నుంచి 5–6 శాతానికి పరిమితం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

రానున్న కేంద్ర బడ్జెట్‌లో డిజిటల్ లావాదేవీలను పెంచడానికి మరింత ప్రోత్సాహం కల్పించాలి. డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్‌పై మరింత అవగాహన పెంచాలి. తొలిసారి డిజిటల్ లావాదేవీలలో అడుగులుపెడుతున్న సాధారణ వినియోదారుడికి విశ్వాసం కల్పించాలి. సైబర్ భద్రత కల్పించడం చాలా ముఖ్యం. డిజిటల్ లావాదేవీల వల్ల వ్యవహారాలలో పారదర్శకత పెరుగుతుంది. అవినీతి, అక్రమాలు తగ్గుతాయి.

ఆర్‌బీఐ డెబిట్‌కార్డు లావాదేవీలపై ఎమ్‌డీఆర్ తగ్గించడంతోపాటు, కేంద్ర ప్రభుత్వం బ్యాంకులకు చేసే ఎమ్‌డీఆర్ రీయింబర్స్‌మెంట్ వంటి కీలక నిర్ణయాల మూలంగా కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన రూ. 2500 కోట్ల డిజిటల్ లావాదేవీలను సాధించడం ఏమాత్రం కష్టం కాకపోవచ్చు.

(రచయిత: ఎస్ఆర్ఆర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్)

నిలువ నీడలేని నిరుపేదలు

సామాజికం

మనిపద్మ జేనా

కరువులు, వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏటా ఎంతో మంది గ్రామీణ పేదలు నగరబాట పడుతున్నారు. ఇది గత కొన్నేండ్లుగా కొనసాగుతూనే ఉన్నది. ఇలా వలసబాట పట్టి నగరానికి చేరుకున్న పేదల్లో ఎక్కువ శాతం గ్రామీణ భూమి లేని నిరుపేదలే ఎక్కువ శాతం ఉంటున్నారు. నగరాల్లోని ఫుట్‌పాత్‌లపై ఆకాశమే పైకప్పుగా ఉండటానికి చోటు లేక నివసిస్తున్న వారు దేశంలో నానాటికీ పెరిగి పోతున్నారని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. గ్రామాల్లో జీవనోపాధి కోల్పోయి పొట్ట పోసుకోవటం కోసం మహానగరాలకు చేరుకున్న వారి కష్టాలు వర్ణనాతీ తం. రోజువారీ అవసరాల కోసం అనేక అవస్థలు పడుతున్న వారికి సామాజికంగా ఎదురవుతున్న కష్టనష్టాలు అనేకం. ఇలా గ్రామం నుంచి బతుకు బాటలో నగరానికి చేరుకున్న వారిలో అకిల బీబీ ఒకరు. కోల్‌కతా ఫుట్‌పాత్‌పై నివసిస్తున్న అకిల ఏరుకొచ్చిన చెత్త కాగితాల్లోంచి తెల్ల కాగితాలను వేరు చేస్తూ పొట్ట పోసుకుంటుంది. ఈ క్రమంలో ఆమె కిలో తెల్లపేపర్‌ను ఏరితే మూడు రూపాయలిస్తారు. ఇలా రోజుకు 30నుంచి 50 కిలోల పేపర్‌ను వేరు చేస్తే వచ్చే వంద రూపాయలతోనే ఆమె పొట్ట పోసుకుంటుంది. ఇలా జీవించే క్రమంలో స్త్రీలుగా వారు ఎదుర్కొనే సమస్యలు అనేకం. వీధి రౌడీలు మొదలు పోలీసులు, పోకిరీల నుంచి ఎదురయ్యే సమస్యలు మరింత తీవ్రమైనవి. అవి లైంగిక దాడుల నుంచి హత్యల దాకా ఉంటాయి. ఇది అకిల ఒక్కదాని కథ మాత్రమే కాదు. దేశంలో లక్షలాదిమందిగా ఉన్న వలస నిర్వాసితుల కన్నీటి గాథ.

అలాగే మహానగరాల్లో ఫుట్‌పాత్‌లు, రైల్వే స్టేషన్లు, దేవాలయ పరిసరాలు, నిరుపయోగంగా ఉన్న నీటి పైపుల్లో ఎంతో మంది నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇలా వలస వచ్చినవారిలో స్త్రీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటున్నది. వారు రోజువారీ పనుల్లో భాగంగా తమ నివాసాల దగ్గర ఉంచిపోయే ఆడబిడ్డల పరిస్థితి గాలిలో దీపంలాగా ఉంటున్నది. అనేక సందర్భాల్లో ఏడెనిమిదేండ్ల నుంచి పది పన్నెండేండ్ల వయసు ఉన్న ఆడబిడ్డలను తమ నివాసాల దగ్గర ఉంచి పోయేటప్పుడు వారి ముఖాలకు నల్లటి మసి, లేదా నల్లటి ఆయిల్ పూసి అంధ వికారం చేసి వీధి గూండాలు పోకిరీల దుష్ట దృష్టి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా చేసి కూడా సాయంత్రం తిరిగి వచ్చే దాకా తమ బిడ్డలు సురక్షితంగా ఉంటారన్న నమ్మకం లేక అనుక్షణం తల్లడిల్లుతున్నారని వీధి జీవితాల గురించి అధ్యయనం చేస్తున్న 'విలేజ్ స్క్వైర్ డాట్ ఇన్' అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది. ఈ క్రమంలో నగరాల్లో 'హోం లెస్ పీపుల్'గా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో వెకిలి చూపులు, మాటల హింస సర్వసాధారణం. ఒక్కోసారి మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వేధింపులు తీవ్రస్థాయిలో భరించలేనివిగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలోనే గత ఆగస్టు నెలలో కొలకతా నగరంలో ఓ పన్నెండేండ్ల బాలిక సామూహిక లైంగిక దాడికి గురై హత్యగావించబడింది. వీధి బాలిక అయిన ఆమెను క్యాబ్ డ్రైవర్లు కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసి చంపి కాలువలో పడేశారు.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని మహానగరాల్లో 9,38,000 మంది నిలువనీడలేని నిరుపేదలు (హోం లెస్ పీపుల్) ఉన్నారు. నిజానికి ఇది వాస్తవ సంఖ్యకు చాలా దూరంగా ఉన్నదని అనేక స్వచ్ఛంద సంస్థలు అంటున్నాయి. దేశంలోని నగరాల జనాభా 377 మిలియన్లు ఉన్నారని ఒక అంచనా. ఒక కమిషన్ చేసిన అధ్యయనం ప్రకారం నగర జనాభాలో ఒక శాతం మంది హోం లెస్ పీపుల్ ఉంటున్నారు. వీరిలో నిలువనీడలేని నిరుపేదల అధ్యయనంపై వేసిన సుప్రీంకోర్టు కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. 30లక్షల 70వేల దాకా ఉంటారు. ఒక కోల్‌కతా నగరంలోనే 14.1 మిలియన్ల జనాభాలో లక్షా యాభై వేల మంది హోం లెస్ పీపుల్ ఉంటారు. హౌసింగ్ అండ్ ల్యాండ్ రైట్స్ నెట్‌వర్క్ (హెచ్‌ఎల్ఆర్ఎన్) అధ్యయనం ప్రకారం 70వేల మంది కోల్‌కతాలోనే ఉంటారని తెలిపింది.

ఇలా హోంలెస్ పీపుల్‌గా మహానగరాల్లో ఫుట్‌పాత్‌లపై నిలువ నీడ లేకుండా సాలు లేక ఆకాశం కిందనే బతుకులు వెళ్లదీస్తున్నారని తేలింది.

అలాగే కేంద్ర ప్రభుత్వం నగరాల్లోని హోం లెస్ పీపుల్ కోసం ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా నిర్మిస్తున్న షెల్టర్లు చాలినంతగా లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఒక్క కోల్‌కతా నగరంలోనే 33 షెల్టర్లు అవసరం ఉన్నది. ఇవి చాలినంతగా లేకపోవటం ఒకటైతే నగర నిరుపేదలు తమ జీవిక కోసం పని చేసుకోవటానికి అనువుగా లేక పోవటంతో ఉన్న షెల్టర్లు కూడా ఖాళీగా ఉంటున్నాయి. హోం లెస్ షెల్టర్లకు పోవాలంటే పదిహేను కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి రావటం కూడా పేదలకు పెద్ద అవరోధంగా మారింది. షెల్టర్లను ఎక్కడో నగరానికి దూరంగా నిర్మిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే నిరుపేదల కోసం నిర్మించిన షెల్టర్లన్నీ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయి. ఢిల్లీ నగరంలో తేలికపాటి లోహంతో తయారు చేసిన షెల్టర్లను నిర్మించి తరలించటానికి అనువుగా ఉండేవిగా(పోర్టబుల్ క్యాబిన్స్) తయారు చేశారు. దీంతో కొంత ఇబ్బంది తగ్గినా అవి చాలినన్ని లేక నిరుపేదలు అనేక అవస్థలు పడుతున్నారు.



> ఆకాశమే పై కప్పుగా నిలువ నీడలేక, ఉండే జాగ లేక కన్నీరు పెడుతున్న నగర నిరుపేదల బతుకుల్లో వెలుగులు నిండాలంటే వారికి కనీస గుర్తింపు ఉండాలి. ఆ గుర్తింపు ఇవ్వటం కోసం, సంరక్షణ కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి.

నివసిస్తున్న వారి రక్షణ కోసం ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది. దీని కోసం 2013లో కార్యాచరణకు పూనుకుని హోంలెస్ పీపుల్ రక్షణ కోసం ఆవాసాలు నిర్మించాలనే పథకాన్ని ప్రారంభించింది. దేశంలో ఉన్న 790 నగరాల్లో లక్ష మందికి ఒక ఆవాసాన్ని (షెల్టర్) నిర్మించాలని తలపెట్టింది. ఆ ఆవాసంలో ప్రతి వ్యక్తికీ 50 చదరపు ఫీట్ల స్థలం, పక్కన ఓ సూట్‌కేసు పెట్టుకోవటానికి అనువైన స్థలం, బట్టలు ఉంచుకోవటానికి అల్మరా, వంట స్థలం ఉండాలని తీర్మానించింది. ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించి నగరాల్లోని నిలువ నీడలేని వారిని ఆదుకోవాలని తలంచింది. కానీ ఆ పథకం ఏ విధంగానూ వారికి రక్షణ ఇవ్వలేక పోతున్నదని ఆచరణలో తెలిసి వస్తున్నది. 2014లో ఒక ఢిల్లీ నగరంలోనే వంద మంది హోంలెస్ పీపుల్ తీవ్ర చలిని తట్టుకోలేక చనిపోయారు. అలాగే ఎండాకాలం ఎండలకు, చలికాలం చలికి తట్టుకోలేక చనిపోతున్న వారు కోకొల్లలు. ఈ నేపథ్యంలోనే ఈ పథకం అమలు తీరుపై అధ్యయనం కోసం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి కైలాశ్ గంభీర్ నేతృత్వంలో ఓ కమిషన్ వేసింది. ఈ కమిషన్ అధ్యయనం ప్రకారం కూడా నగరాల్లోని నిలువ నీడలేని వారిలో 90 శాతం ఇంకా ఎలాంటి ఆవాసాలు లేక ఆకాశం కిందనే బతుకులు వెళ్లదీస్తున్నారని తేలింది.

ప్రభుత్వం చేపడుతున్న రక్షణ చర్యలతో పాటు సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా చూడాల్సిన అవసరం ఉన్నదని స్వచ్ఛంద సంస్థలు అంటున్నా యి. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందాలంటే వారికి ఆధార్ కార్డు ఉండాలి. ఆధార్ కావాలంటే నివాసం ఉండాలి. ఇలా ఏ ఆధారం లేని వారికి ఆధార్ కార్డు రాదు, దీంతో రేషన్ కార్డు రాదు. ఇలా నగర నిరుపేదలు సర్వత్రా అనాథలుగా మిగులుతున్నారు. అలాగే వీరికి ఎలాంటి గుర్తింపు లేదు. కాబట్టి వీరు జనాభా లెక్కల్లోకి కూడా రావటం లేదు. కాబట్టి ఆకాశమే పై కప్పుగా నిలువ నీడలేక, ఉండే జాగ లేక కన్నీరు పెడుతున్న నగర నిరుపేదల బతుకుల్లో వెలుగులు నిండాలంటే వారికి కనీస గుర్తింపు ఉండాలి. ఆ గుర్తింపు ఇవ్వటం కోసం, సంరక్షణ కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి.

(వ్యాసకర్త– ప్రముఖ జర్నలిస్టు, భువనేశ్వర్, ఢిల్లీ)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఆధునిక వైద్యం రాకముందు
మనిషి సగటు జీవితకాలం 70 ఏండ్లు!
దంత అవశేషాల ఆధారంగా వయసు లెక్కగట్టే విధానం అభివృద్ధి


దంత అవశేషాలు

మెల్‌బోర్న్, జనవరి 8: ఆధునిక ఔషధాలు రాకముందు ప్రపంచవ్యాప్తంగా మనుషులు సగటున 70 ఏండ్లపాటు బతికారని ఓ తాజా పరిశోధన వెల్లడించింది. ఆధునిక వైద్యవిధానాలు, మందులు రాకముందు మనుషులు 40 ఏండ్లకు మించి జీవించలేదంటూ ఇప్పటివరకూ ఉన్న అభిప్రాయం శుద్ధ అబద్ధమని పేర్కొన్నది. ఏయే కాలాల్లో మనుషులు ఎంతకాలం జీవించారనే దానిని గుర్తించేందుకు ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన క్రిస్టీన్ కేవ్ ఓ విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ విధానంలో మానవ దంత అవశేషాల స్థితిని, అవి ఎంతగా అరిగిపోయాయనే అంశాలను విశ్లేషించడం ద్వారా సదరు వ్యక్తి ఏ వయసులో చనిపోయారో నిర్ణయిస్తారు. ఆంగ్లో-సాక్సన్ సమాధుల నుంచి సేకరించిన మూడు అస్థిపంజరాలను క్రిస్టీన్ కేవ్ విశ్లేషించారు. 'మూడు అస్థిపంజరాలు క్రీస్తుశకం 475 నుంచి 625 మధ్య కాలానివి. వాటిని విశ్లేషిస్తే అప్పట్లో మనిషి సగటు జీవితకాలం 70 ఏండ్లుగా తేలింది. ఇప్పటివరకు మనిషి ఏ వయసులో మరణించాడో లెక్కగట్టేందుకు కచ్చితమైన విధానాల్లేవు. ఒకదశకు వచ్చేసరికి మానవ శరీరంలోని ఎముకల ఎదుగుదల ఆగిపోతుంది. 45 ఏండ్ల బలమైన వ్యక్తి ఎముకలు, 95 ఏండ్ల వృద్ధుడి ఎముకలు పరిమాణంలో ఒకేరకంగా ఉండొచ్చు. కేవలం ఎముకల పెరుగుదలను బట్టి వయసును నిర్ధారించలేం. అందుకే దంతాల అరుగుదలను బట్టి లెక్కగట్టే విధానాన్ని రూపొందించాం. దీని ద్వారా కచ్చితంగా వయసును నిర్ధారించవచ్చు' అని కేవ్ తెలిపారు.

200% సురక్షితం అన్నారు..43 లక్షలు గుంజారు
అయినా ప్రాణం దక్కలేదు ❑ ప్రైవేట్ దవాఖానలో మరో దారుణం




ముంబై, జనవరి 8: 'నా భార్యకు వారు చేయబోయే శస్త్రచికిత్స 200 శాతం సురక్షితమైనదని చెప్పారు. ఐదు రోజుల్లో ఆమె ఇంటికి వెళ్లిపోవచ్చని అన్నారు. మొత్తంగా వైద్యం కోసం రూ.43 లక్షలు తీసుకున్నారు. చివరికి కోమాలో ఉన్న ఆమెను అంబులెన్స్ ఎక్కించారు. దారి మధ్యలోనే ప్రాణం పోయింది' అంటూ మహారాష్ట్రలోని ఠాణె నివాసి మితూలాల్ బాఫ్నా తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన గుండె వాల్వ్‌ను నిపుణుల సమక్షంలో అమరుస్తామని దవాఖాన వాళ్లు చెప్పారని, కానీ చివరికి ఆ వాల్వ్ ఆమె గుండెలోకి జారిపోయిందని, అందువల్లే ఆమె చనిపోయిందని అంటున్నారని ఆయన వాపోయారు. దీనిపై మితూలాల్ హిందూజా హాస్పిటల్‌కు వ్యతిరేకంగా మహారాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌లో గత నెల 28న ఫిర్యాదు చేశారు. మంజూ బాఫ్నాకు ఆరేండ్ల క్రితం ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్స చేసినప్పుడు ఆమె ఎడమ జఠరిక ఎడమ కర్ణికకు మధ్యనుండే ద్విపత్ర కవాటము (మిట్రల్ వాల్వ్) అసాధారణంగా ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. బృహద్ధమని కవాటము (అవోర్టిక్ వాల్వ్)ను మార్చిన వైద్యులు మిట్రల్ వాల్వ్‌ను మరమ్మతు చేసి వదిలేశారు. దీంతో ఆరు నెలల క్రితం వరకు ఆరోగ్యంగా ఉన్న మంజూకు మళ్లీ గుండె సమస్య మొదలైంది. అక్టోబర్ 25న ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించారు. అయితే ఈ శస్త్రచికిత్సలో ఇంత ప్రమాదం ఉంటుందని డాక్టర్లు తమకు చెప్పలేదని మితూలాల్ ఆరోపించారు. చికిత్స కోసం తమ నుండి రూ.43 లక్షలు వసూలు చేశారని ఆయన చెప్పారు. మానవతా దృక్పథంతో మితూలాల్‌కు రూ.12.47 లక్షలు తిరిగిచ్చేశామని, ఇన్సూరెన్స్ రూపంలో ఆయనకు మరో 11 లక్షలు లభించాయని హిందూజా దవాఖాన వర్గాలు తెలిపాయి.

దేశంలోనే అత్యంత వేగవంతమైన
సూపర్ కంప్యూటర్ 'ప్రత్యూష్'
పుణే ఐఐటీఎంలో ఏర్పాటు



పుణే, జనవరి 8: దేశంలో అత్యంత వేగవంతమైన, బహుళ 'పెటాఫ్లాప్స్' సామర్థ్యం గల సూపర్ కంప్యూటర్‌ను కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి హర్షవర్ధన్ సోమవారం జాతికి అంకితమిచ్చారు. కంప్యూటర్ వేగాన్ని కొలిచే ప్రమాణాన్ని 'పెటాఫ్లాప్' అంటారు. 'ప్రత్యూష్' పేరిట రూపొందించిన ఈ కంప్యూటర్‌ను పుణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం)లో నెలకొల్పారు. వాతావరణ మార్పులపై మెరుగైన సమాచారాన్ని అందించేందుకు ఇది దోహదపడుతుందని ఐఐటీఎం ఒక ప్రకటనలో తెలిపింది. రుతుపవనాలు, సునామీలు, తుఫానులు, భూకంపాలు, గాలి నాణ్యత, పిడుగులు, వరదలు, కరువు తదితర ప్రకృతి విపత్తులను అంచనా వేయడానికి ప్రత్యూష్ తోడ్పడుతుందని పేర్కొంది.

గాంధీని చంపింది గాడ్సేనే!
'అజ్ఞాత వ్యక్తి, నాలుగో బుల్లెట్' వాదనలకు ఆధారాలు లేవు
కేసును తిరుగదోడాల్సిన అవసరం లేదు
సుప్రీంకోర్టుకు నివేదించిన అమికస్ క్యూరీ



న్యూఢిల్లీ, జనవరి 8: మహాత్మాగాంధీని గాడ్సేనే కాల్చి చంపాడని, ఈ హత్య కేసును తిరుగదోడాల్సిన అవసరం లేదని సీనియర్ న్యాయవాది, ఈ కేసులో సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు) అమరేంద్ర శరణ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జస్టిస్ ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనానికి నివేదిక అందించారు. ఆరు దశాబ్దాల కిందట జరిగిన ఈ హత్యపై పునర్విచారణ అవసరం లేదని నివేదికలో పేర్కొన్నారు. గాంధీ హత్యలో విదేశీ నిఘా సంస్థల ప్రమేయం ఉన్నదని, గాడ్సేతోపాటు మరో అజ్ఞాత వ్యక్తి జరిపిన కాల్పుల్లోనే గాంధీ మరణించారన్న వాదనలను కొట్టివేశారు. ఇందుకు తగిన ఆధారాలు లేవన్నారు. 'గాడ్సే పిస్టోల్ నుంచి వచ్చిన మూడు బుల్లెట్లు గాంధీ శరీరంలోకి దూసుకెళ్లి ప్రాణాలు తీశాయి. కుట్ర, భావజాలం ఈ హత్యకు దారితీశాయి. అనుమానాస్పదంగా ఎలాంటి వస్తువులు, ఆధారాలు దొరుకలేదు. కాబట్టి ఈ కేసును పునర్విచారించడం, నిజ నిర్ధారణ కమిటీ వేసి మరోసారి దర్యాప్తు జరుపడం అవసరం లేదు' అని నివేదికలో పేర్కొన్నారు. అజ్ఞాత వ్యక్తి జరిపిన కాల్పుల్లో శరీరంలోకి నాలుగో బుల్లెట్ దూసుకుపోవడం వల్లే గాంధీ మరణించారన్న పిటిషనర్ వాదనలను కొట్టివేశారు. గాంధీ హత్యలో తమకు పలు అనుమానాలు ఉన్నాయని, కేసును పునర్విచారించాలని ముంబైకి చెందిన పరిశోధకుడు, అభినవ్ భారత్ ట్రస్టీ డాక్టర్ పంకజ్ ఫడ్నిస్ 2001లో సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. గాంధీ హత్యపై 1966లో నియమించిన జస్టిస్ జేఎల్ కపూర్ కమిషన్ పూర్తిస్థాయిలో విచారణ జరుపలేదని, ఈ హత్య వెనుక విదేశీ సంస్థల హస్తం ఉన్నదని ఆయన ఆరోపించారు. ఈ కేసులో న్యాయసలహా కోసం గత అక్టోబర్‌లో సీనియర్ న్యాయవాది అమరేంద్ర శరణ్‌ను కోర్టు అమికస్ క్యూరీగా నియమించింది. ఈ మేరకు పలు నివేదికలను, క్షేత్రస్థాయి నివేదికలను అధ్యయనం చేసిన తర్వాత అమరేంద్ర శరణ్ తుదినివేదిక రూపొందించి కోర్టుకు అందజేశారు. నివేదికను పరిశీలించి తమ నిర్ణయాన్ని ఈ నెల 12వ తేదీన తెలియజేస్తామని ధర్మాసనం ప్రకటించింది.

'ఐ లవ్ ముస్లిమ్స్' అన్నందుకు..
వెంటపడి వేధించారు
కర్ణాటకలో విద్యార్థిని ఆత్మహత్య.. బీజేపీ యువజన నేత అరెస్ట్


ధన్యశ్రీ


అనిల్‌రాజ్

బెంగళూరు: తన స్నేహితుడితో వాట్సాప్‌లో చాట్‌చేస్తున్న ధన్యశ్రీ (20) అనే బీకాం విద్యార్థిని 'ఐ లవ్ ముస్లిమ్స్' అనడమే పాపమైపోయింది. వేధించి.. బెదిరించడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నది. కర్ణాటకలోని చిక్కమంగళూరు సమీపంలోని ముదిగరేకు చెందిన ధన్యశ్రీ శుక్రవారం సంతోష్ అనే స్నేహితుడితో వాట్సాప్‌లో చాటింగ్ చేసి.. మధ్యలో అతడు అడిగిన ప్రశ్నకు 'ఐ లవ్ ముస్లిమ్స్' అని సమాధానం ఇచ్చింది. దీంతో మండిపడ్డ ఆ యువకుడు.. ముస్లింలతో సన్నిహితంగా మెలుగొద్దని హెచ్చరించాడు. ఆ తర్వాత ధన్యశ్రీ చేసిన వాట్సాప్ చాటింగ్‌ను స్క్రీన్ షాట్ తీసి స్థానిక భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ సభ్యులకు పంపించాడు. ఇది కాస్త వైరల్ అవడంతో ధాన్యశ్రీ, ఆమె తల్లి తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. దీంతో తీవ్రమనస్తాపానికి గురైన విద్యార్థిని శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. 'అనిల్‌రాజ్ వేధింపులతో నా జీవితం నాశనమయింది' అని సూసైడ్ లేఖలో విద్యార్థిని పేర్కొన్నారు. అనిల్‌రాజ్‌ను అరెస్ట్‌చేసినట్టు ఎస్పీ ఎం అన్నామలై తెలిపారు. సంతోష్ సహా మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

జాతీయ గీతంపై కేంద్రం యూటర్న్
సినిమా థియేటర్లలో ఆలాపనపై తీర్పును
సవరించాలని సుప్రీంకోర్టుకు సూచన
మార్గదర్శకాలకోసం మంత్రివర్గ కమిటీ

న్యూఢిల్లీ: థియేటర్లలో సినిమా ప్రదర్శన ప్రారంభానికి ముందు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా వినిపించాలంటూ ఇచ్చిన తీర్పును సవరించాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సూచించింది. జాతీయ గీతాన్ని ఏ పరిస్థితులు, సందర్భాలలో ఆలపించాలి, అప్పుడు గౌరవసూచకంగా ఏం చేయాలన్న దానిపై మార్గదర్శకాలు రూపొందించేందుకు ఒక మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపింది. ఈ కమిటీ ఏర్పడిన తరువాత ఆరు నెలల్లో తన నివేదికను అందజేస్తుందని పేర్కొంది. అంతవరకు 2016, నవంబర్ 30కి పూర్వమున్న యథాతథ స్థితిని కొనసాగించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఒక అఫిడవిట్‌ను సోమవారం దాఖలు చేసింది. సినిమా ప్రదర్శన ప్రారంభానికి ముందు థియేటర్లలో జాతీయ గీతాన్ని వినిపించాలని సుప్రీం కోర్టు 2016, నవంబర్ 30న ఆదేశించింది. గత అక్టోబర్‌లో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ మాట్లాడుతూ, భారత్ విభిన్నమైన దేశమని, అందువల్ల ఏకత్వాన్ని తెచ్చేందుకు సినిమా హాళ్లలో జాతీయ గీతాన్ని వినిపించాలని చెప్పారు.

పాక్ వైఖరిని నిరసిస్తూ చెప్పులు అందజేత

వాషింగ్టన్: కుల్‌భూషణ్ జాదవ్ కుటుంబం పట్ల పాక్ ప్రభుత్వ అమానుష ప్రవర్తనపై సోమవారం వాషింగ్టన్‌లోని పాకిస్థాన్ రాయబార కార్యాలయం వద్ద భారతీయులు, ఆఫ్ఘన్, బలూచిస్థాన్ పౌరులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పాక్ అధికారులకు పాదరక్షలు అందజేశారు. ఈ నిరసనకు నాయకత్వం వహించిన అమెరికన్ ఫ్రెండ్స్ ఆఫ్ బలూచిస్థాన్ ప్రతినిధి అహ్మర్ ముస్తీఖాన్ మాట్లాడుతూ కుల్‌భూషణ్ జాదవ్ విచారణలో పాకిస్థాన్ అన్ని అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించిందని ఆరోపించారు. గత నెల 25న కుల్‌భూషణ్ జాదవ్‌ను కలుసుకునేందుకు వెళ్లిన తల్లి, భార్య చెప్పులు విడిపించి, బొట్టు తొలిగించాకే పాక్ అధికారులతో వారి సమావేశం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

మర్మాంగంతో ట్రాక్టర్‌ను లాగిన సాధువు



అలహాబాద్: పెద్ద పెద్ద ట్రక్కులు, బండ్లను, రాళ్లను తల వెంట్రుకలు, దంతాలతో లాగడం చూశాం.. కానీ అలహాబాద్‌లో ఓ సాధువు మాత్రం మర్మాంగంతో ట్రాక్టర్‌ను లాగాడు. ఇక్కడ నిర్వహించిన 'మాఘమేళా'లో సాధువు ఈ ప్రదర్శన చేశాడు. దీంతో తన ఆధ్యాత్మిక శక్తిని నిరూపించుకున్నానని ఆయన ప్రకటించారు. ఇలాగే 2014 ఏడాదిలో ఓ సాధువు డజన్ల ఇటుకలను మర్మాంగానికి కట్టుకొని ప్రదర్శన ఇవ్వగా.. 2016లో మరో సాధువు తన మర్మాంగానికి తాడు కట్టి బండ రాళ్లను లాగారు.


మనం నిరంకుశ రాజ్యంలో ఉన్నామా?
ఆధార్ అవకతవకల్ని వెలుగులోకి తెస్తే కేసు పెడుతారా?
మోదీ సర్కార్‌పై బీజేపీ ఎంపీ శత్రుఘ్నసిన్హా ధ్వజం
వెనక్కి తగ్గిన కేంద్రం ❑ గుర్తుతెలియని వ్యక్తులపైనే ఎఫ్‌ఐఆర్ అని వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 8:

ఆధార్ అవకతవకలను వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టు మీద ఎఫ్ఐర్ నమోదు చేయడంపై బీజేపీ పార్లమెంట్ సభ్యుడు శత్రుఘ్న సిన్హా విస్మయం వ్యక్తంచేశారు. ఆధార్ లోటుపాట్లను బహిర్గతం చేస్తే కేసులు పెడతారా? ఇదెక్కడి న్యాయం? అంటూ ఆయన ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. 'దీని వెనుక రాజకీయ కక్షసాధింపు ఏమైనా ఉందా? మనమేమైనా నిరంకుశరాజ్యం (బనానా రిపబ్లిక్)లో ఉన్నామా? దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం నిజాయితీగా పనిచేస్తున్నవారినీ బాధితులను చేస్తున్నారు' అని ఆయన ప్రశ్నించారు. సోమవారం ట్విట్టర్ వేదికగా ఆయన కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. సిన్హా పలు సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీని ఇరుకున పెట్టేలా విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. ఆధార్ అంశంలో ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా దీటుగా నిలిచిన ఎడిటర్స్ గిల్డ్‌ను సిన్హా ప్రశంసించారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందించి దిద్దుబాటు చర్యలు చేపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. వందకోట్లమందికి చెందిన ఆధార్ వివరాలను బహిరంగమార్కెట్‌లో అమ్మకానికి పెట్టారంటూ 'ది ట్రిబ్యూన్' పత్రికలో ప్రచురితమైన పరిశోధనాత్మక కథనంపై యూఐడీఏఐ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆధార్ డేటాను జర్నలిస్టు రచనా ఖైరా అక్రమంగా పొందారని ఆరోపిస్తూ భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) డిప్యూటీ డైరెక్టర్ బీఎం పట్నాయక్ ఇచ్చిన ఫిర్యాదుపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే జర్నలిస్టుకు ఎడిటర్స్ గిల్డ్ అండగా నిలిచింది. ఇది పత్రికాస్వేచ్ఛను అణిచివేయడమే అవుతుందని, ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని పేర్కొంటూ కేంద్రానికి లేఖ రాసింది.

పత్రికాసేచ్ఛకు కట్టుబడి ఉన్నామన్న కేంద్రం


పత్రికాస్వేచ్ఛను గౌరవిస్తామని, దానికి తాము కట్టుబడి ఉన్నామని కేంద్రం స్పష్టంచేసింది. ఆధార్ అవకతవకల్ని బయటపెట్టిన జర్నలిస్టుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కలకలం రేపిన నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం ట్విట్టర్‌లో వివరణ ఇచ్చారు. 'పత్రికా స్వేచ్ఛకు ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వం విఘాతం కలుగనీయదు. అదే సమయంలో దేశప్రగతి కోసం ఆధార్ భద్రతను, పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. ఎఫ్ఐఆర్ నమోదు చేసింది గుర్తుతెలియని వ్యక్తులపైనే' అని పేర్కొన్నారు. నిజమైన దోషుల్ని పట్టుకునే దిశగా ది ట్రిబ్యూన్ పత్రిక, జర్నలిస్టు రచనాఖైరా సహకారం కోరాల్సిందిగా తాను యూఐడీఏఐకి సూచిస్తున్నానని రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.



చిన్నతరహా పొదుపు పథకాలకు ఆధార్ అనుసంధాన గడువు పొడిగింపు

చిన్నతరహా పొదుపు పథకాలకు ఆధార్ అనుసంధాన గడువును కేంద్రం మూడునెలలు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. 'పోస్టాఫీస్ డిపాజిట్ స్కీములు, పీపీఎఫ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీం, కిసాన్ వికాస్ పత్రాలు, ఇతర చిన్నతరహా పొదుపు పథకాలను ఆధార్‌తో అనుసంధానించేందుకు ఆఖరి గడువును డిసెంబర్ 31 నుంచి మార్చి 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది' అని అందులో పేర్కొన్నది. బ్యాంకు ఖాతాలు, మొబైల్ నెంబర్లకు ఆధార్ అనుసంధాన గడువును కేంద్రం ఇప్పటికే పొడిగించిన విషయం తెలిసిందే. మొత్తం 35 ప్రభుత్వశాఖల పరిధిలోని 135 పథకాలకు ఆధార్‌ను తప్పనిసరి చేసిన కేంద్రం చిన్నతరహా పొదుపు పథకాలకూ దానిని వర్తింపజేస్తూ అక్టోబర్‌లో ఉత్తర్వులిచ్చింది.

అవినీతి జరుగలేదు
- అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కొనుగోలు కేసులో ఇటలీ కోర్టు తీర్పు
- ఓర్సీ, స్పాగ్నోలిని నిర్దోషులుగా విడుదల
- భారత్‌లో దర్యాప్తు కొనసాగుతుంది.. తీర్పు ప్రభావం ఉండదన్న సీబీఐ



మిలాన్, జనవరి 8: కాంగ్రెస్ పార్టీకి ఊరట కలిగించే ఓ తీర్పును ఇటలీ కోర్టు సోమవారం వెలువరించింది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కొనుగోలు కేసులో అవినీతి జరిగినట్టు ఆధారాలు లేవని పేర్కొంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేసింది. అయితే హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందం సందర్భంగా అవినీతి జరిగిందని, అక్రమ మార్గాల్లో నగదు బదిలీ అయిందని వచ్చిన ఆరోపణలపై భారత్‌లో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్నది. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.3600 కోట్ల వ్యయంతో 12 అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్లను కొనుగోలు చేసేందుకు ఇటలీతో ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాన్ని దక్కించుకొనేందుకు ఇటలీకి చెందిన ఫిన్‌మెకానికా సంస్థ రూ.360 కోట్ల ముడుపులు చెల్లించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇందులో ఇటలీ రక్షణ శాఖకు చెందిన ఫిన్‌మెకానికా గ్రూపు మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ గైసెప్పీ ఓర్సీ, సంస్థ హెలికాప్టర్ల యూనిట్ మాజీ అధిపతి బ్రూనో స్పాగ్నోలిని పాత్రధారులుగా ఉన్నట్టు ఆరోపణలు వెలువడ్డాయి. వీరిద్దరు ఆ ముడుపులను 'ఏపీ' (కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోనియాగాంధీకి రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్)కు ఇచ్చినట్టు బీజేపీ ఆరోపించింది. ఈ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2013లో హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసింది. అయితే ముడుపుల ఆరోపణలపై భారత్‌లో సీబీఐ దర్యాప్తు చేస్తుండగా, మరోవైపు ఇటలీ ప్రభుత్వం కూడా విచారణ చేపట్టింది. ఫిన్‌మెకానికా అధికారులు ఓర్సీ, బ్రూనోలను అదుపులోకి తీసుకున్న ప్రభుత్వం తప్పుడు లెక్కలు, లంచం ఇవ్వడం ఆరోపణలపై చెరో నాలుగున్నరేండ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును వారిద్దరు మిలాన్‌లోని అప్పీలేట్ కోర్టులో సవాలు చేశారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన అపీలేట్ కోర్టు, వారిద్దరూ అవినీతికి పాల్పడ్డారనేందుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది. అందువల్ల వారిపై నమోదైన అభియోగాల నుండి వారినివిడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ తీర్పుపై ఢిల్లీలోని సీబీఐ అధికారులు స్పందిస్తూ తమ దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ దర్యాప్తుపై ఈ తీర్పు ప్రభావం ఉండబోదని అన్నారు. ఓర్సీ, బ్రూనోలకు వ్యతిరేకంగా తమవద్ద బలమైన సాక్ష్యాధారాలున్నాయని చెప్పారు. మిలాన్ కోర్టు తీర్పుపై ఇటలీ అధికారులు ఆ దేశ సుప్రీంకోర్టులో అప్పీలు చేసే అవకాశముందన్నారు.

మేం ఏం తినాలో మీరే చెబుతారా?
యోగి ఆదిత్యనాథ్‌కు సిద్దరామయ్య కౌంటర్



బెంగళూరు, జనవరి 8: అభివృద్ధి, పరిపాలనపై కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు సిద్దరామయ్య, యోగి ఆదిత్యనాథ్ ట్విట్టర్ వేదికగా పరస్పరం చేసుకున్న విమర్శలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. బీజేపీ కర్ణాటక శాఖ ఆదివారం నిర్వహించిన ఒక సభలో పాల్గొనేందుకు ఆదిత్యనాథ్ బెంగళూరు వచ్చారు. ఈ సందర్భంగా సిద్దరామయ్య ట్విట్టర్‌లో స్పందిస్తూ 'యూపీ సీఎం ఆదిత్యనాథ్‌కు స్వాగతం పలుకుతున్నాను. మా నుండి మీరు నేర్చుకోవలసింది ఎంతో ఉంది సర్. ఇందిరా క్యాంటీన్‌ను, ఏదైనా ఒక రేషన్ షాపును తప్పకుండా సందర్శించండి. మీ రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న ఆకలిచావుల సమస్యను పరిష్కరించడానికి దోహదపడుతుంది' అని పేర్కొన్నారు. దీనికి యోగి ఆదిత్యనాథ్ కూడా దీటుగా సమాధానమిచ్చారు. 'సిద్దరామయ్యాజీ మీ స్వాగతానికి ధన్యవాదాలు. మీ హయాంలోనే కర్ణాటకలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువ జరుగుతున్నాయని విన్నాను. ఇక నిజాయితీగల అధికారుల చావులు, బదిలీల గురించి చెప్పవలసిన అవసరమే లేదు. యూపీలో మీ మిత్రపక్షాలు సృష్టించిన కష్టాలు, దుర్నీతిని తొలిగించడానికి ప్రయత్నిస్తున్నాను' అంటూ ట్వీట్ చేశారు. బెంగళూరులో జరిగిన బహిరంగ సభలో యోగి మాట్లాడుతూ, 'హిందువుగా ఉంటూ ఆయన (సిద్దరామయ్య) గొడ్డు మాంసం తినాలని ఇతరులను ప్రోత్సహించకూడదు. కర్ణాటకలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు గో హత్యను నిషేధిస్తూ చట్టం చేసింది. కాంగ్రెస్ వచ్చి ఆ చట్టాన్ని రద్దు చేసింది' అన్నారు. ఈ వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకు కర్ణాటక సీఎం మరోసారి ట్విట్టర్‌లో స్పందించారు. 'మేం ఏమి తినాలో చెప్పడానికి మీరెవరు? ఎంతోమంది హిందువులు గొడ్డుమాంసం తింటారు. అభ్యంతరపెట్టడానికి వీరెవరు? నాథూరాం గాడ్సే సూత్రీకరించిన హిందూమతాన్ని కాకుండా స్వామి వివేకానంద నిర్వచించిన హిందూ మతాన్ని నేను అనుసరిస్తాను' అని ట్వీట్ చేశారు.

సిక్కిం ప్రచారకర్తగా ఏఆర్ రెహ్మాన్



గ్యాంగ్‌టక్: సిక్కిం ప్రభుత్వ ప్రచారకర్తగా ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌ను నియమిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం పవన్‌కుమార్ చామ్లింగ్ తెలిపారు. సోమవారం సిక్కిం రెడ్ పాండా వింటర్ కార్నివాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చామ్లింగ్ ఈ సంగతి చెప్పారు.


సముద్ర మార్గంలో హజ్ యాత్ర
భారత్ ప్రతిపాదనకు అంగీకరించిన సౌదీ అరేబియా

న్యూఢిల్లీ, జనవరి 8: హజ్ యాత్రికులను సముద్ర మార్గంలో జెడ్డాకు చేర్చేందుకు భారత్ చేసిన ప్రతిపాదనకు సౌదీ అరేబియా అంగీకారం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ సోమవారం వెల్లడించారు. సౌదీ అరేబియాకు చెందిన హజ్, ఉమ్రా శాఖల మంత్రి మొహమ్మద్ సలేహ బిన్ తామెర్ బెంటెన్‌తో మక్కాలో ఆదివారం ఒక ద్వైపాక్షిక వార్షిక ఒప్పందం కుదిరిందని చెప్పారు. అయితే ఏ సంవత్సరం నుంచి హజ్‌కు సముద్రయానం ప్రారంభమవుతుందో మాత్రం నఖ్వీ వెల్లడించలేదు. ప్రస్తుతం భారత్ నుంచి ఏటా 1.7 లక్షల మంది యాత్రికులు విమానాల ద్వారా వెళ్లివస్తున్నారు.

ఆస్ట్రేలియాలో పీఏసీఎల్ ఆస్తులు జప్తు
472 కోట్ల విలువైన ఆస్తుల్ని అటాచ్ చేసిన ఈడీ

న్యూఢిల్లీ: వివిధ పథకాల పేరుతో మదుపరుల నుంచి భారీగా నగదు సేకరించిన పెరల్స్ ఆగ్రోటెక్ కార్పొరేషన్ (పీఏసీఎల్)కు ఆస్ట్రేలియాలో గల రూ.472 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. అక్రమ లావాదేవీల నిరోధక చట్టం కింద వీటిని జప్తు చేసింది. ఇందులో గ్రూప్ చిరాస్తులతో పాటు షేర్లు కూడా ఉన్నాయి. ఆస్ట్రేలియాలోని 'మీ రిసార్ట్స్ గ్రూప్1', 'శాంక్చువరీ కోవ్ ప్రాపర్టీస్' లకు చెందిన ఆస్తులనూ జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది. ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించిన నిర్మల్ సింగ్ భాంగో సారథ్యంలోని 'పీఏసీఎల్'.. 2009 – 14 మధ్య దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల అభివృద్ధి, విక్రయం పేరిట సుమారు ఐదు కోట్ల మంది నుంచి రూ.49,100 కోట్ల పెట్టుబడులు సేకరించింది.

పద్మావత్ విడుదలకు అనుమతించం
రాజస్థాన్ ప్రభుత్వం వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 8: పద్మావత్ చిత్రాన్ని రాజస్థాన్‌లో విడుదల చేసేందుకు అనుమతించబోమని ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. నటి దీపికా పదుకొనే ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రం విడుదలపై ఆదినుంచి వివాదాలు చెలరేగుతూనే ఉన్నాయి. పద్మావతిగా ఉన్న చిత్రం పేరును ఇటీవల పద్మావత్‌గా మార్చడం, సినిమాలో మరికొన్ని మార్పులు చేసి.. ఈ నెల 25 విడుదల చేసేందుకు నిర్మాతలు సిద్ధమయ్యారు. అయినప్పటికీ చిత్రాన్ని రాజస్థాన్‌లో విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించబోదని రాష్ట్ర హోంమంత్రి గులాబ్‌చంద్ కటారియా తెలిపారు.



సోమవారం తిరుమల శ్రీవారిని టాటాగ్రూప్ అధినేత రతన్‌టాటా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. స్వామివారి జ్ఞాపికను ప్రదానం చేశారు.



సోమవారం గచ్చిబౌలిలోని తన క్యాంపు కార్యాలయంలో భద్రాద్రిసీతారామచంద్రస్వామి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో అధికారులు ఉన్నారు.

తెలంగాణ చట్టసభల నిర్వహణ భేష్

'విప్'ల సదస్సుల సిఫారసుల అమలులో రాష్ట్రం ఫస్ట్ • విప్‌ల జాతీయ సదస్సులో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'తెలంగాణ రాష్ట్ర చట్టసభల నిర్వహణ భేష్‌గా ఉన్నది. గతంలో జరిగిన విప్‌ల సదస్సుల్లో చేసిన సిఫారసులను అమలుచేయడంలోనూ రాష్ట్రం ప్రథమస్థానంలో ఉన్నది' అని తెలంగాణ శాసనమండలి, శాసనసభల విప్‌లు పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో 18వ అఖిలభారత విప్‌ల సదస్సు సోమవారం ప్రారంభమైంది. దీన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్నది. సదస్సులో రాష్ట్రం నుంచి మండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, అసెంబ్లీ విప్‌లు గొంగిడి సునీత, గంప గోవర్ధన్, లోక్‌సభలో టీఆర్‌ఎస్ విప్ నగేశ్, తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014లో గోవా, 2015లో విశాఖపట్నం నగరాల్లో జరిగిన అఖిలభారత విప్‌ల సదస్సుల్లో చేసిన సిఫారసులను సక్రమంగా అమలుచేయడంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి, శాసనసభ అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పారు. బీఏసీ సమావేశాలు ఏర్పాటుచేసి వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్ల సూచనలు తీసుకుని అన్ని అంశాలు చర్చకు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. 'తెలంగాణ సమావేశాల పనిగంటలు పెరిగాయి. ప్రైవేట్ మెంబర్ బిల్లుకు రెండురోజులు కేటాయించుకున్నాం. సభ్యుల హాజరుశాతం గణనీయంగా పెరిగింది. సభ్యులు క్రమశిక్షణగా వ్యవహరిస్తున్నారు. ప్రతి అంశం చర్చకు వచ్చేలా, ప్రజా సమస్యలపై చర్చించడానికి ఎన్ని రోజులైనా సభలు నడిపేలా తెలంగాణ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తున్నది. శీతాకాల సమావేశాలు 20 రోజుల పాటు నడపటం ద్వారా తెలంగాణ చట్టసభలు దేశానికి స్ఫూర్తిని చ్చాయి' అని పేర్కొన్నారు. రాష్ట్ర చట్టసభలు దేశానికే ఆదర్శంగా ఉండేలా నడవాలని సీఎం కేసీఆర్ నిత్యం శ్రద్ధతో ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత చెప్పారు. ప్రజల ఆశలు వమ్ముకాని రీతిలో తెలంగాణ సభలు నిర్వహిస్తున్నామని, ఇందుకు అన్ని పార్టీలు సహకరిస్తున్నాయని పేర్కొన్నారు. తాను మొదటిసారి శాసనసభకు ఎన్నికయ్యానని, సదస్సులో పాల్గొనే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.



సోమవారం ఉదయ్‌పూర్‌లో జరిగిన అఖిలభారత విప్‌ల సదస్సులో పాల్గొన్న తెలంగాణ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గొంగిడి సునీత, బీ వెంకటేశ్వర్లు

కేంద్రమంత్రులతో భేటీ

రాష్ట్రం నుంచి వెళ్లిన ప్రభుత్వ విప్‌లు, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు విప్‌ల సదస్సు అనంతరం కేంద్ర మంత్రులు అనంతకుమార్, విజయ్‌గోయల్‌తో భేటీ అయ్యారు. వారితో పలు అంశాలపై చర్చించినట్లు విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు వారు రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజేను కలిశారు.

అఖిల్ సినిమా హక్కుల కేసులో నితిన్‌కు ఊరట

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అఖిల్ సినిమా హక్కుల విషయంలో రూ.50 లక్షలు తీసుకొని తమను మోసం చేశారంటూ సినీనటుడు నితిన్, అతని తండ్రి సుధాకర్‌రెడ్డి, అతని సోదరి నిఖితారెడ్డిపై హైదరాబాద్‌లోని మల్కాజిగిరి కోర్టు లోదాఖలైన కేసును ఉమ్మడి హైకోర్టు కొట్టివేసింది. నైనిక్షిప్ ప్రాంతానికి చెందిన గంగాధర సత్యనారాయణ అనే వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా మల్కాజిగిరి కోర్టు నితిన్‌తోపాటు అతని కుటుంబ సభ్యులకు సమన్లు జారీచేసింది. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన న్యాయస్థానం.. దీనిని సివిల్ వివాదంగా పరిగణించాలని పేర్కొంటూ, క్రిమినల్ వ్యవహారం కిందకు రాదంటూ కేసును కొట్టివేసింది.

టీఆర్టీకి అనుమతించండి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిగ్రీలో 45 శాతం మార్కులు పొందిన ఓపెన్ క్యాటగిరీ, 40 శాతం మార్కులు వచ్చిన ఎస్సీ, ఎస్టీ , బీసీ, దివ్యాంగ విభాగాల అభ్యర్థులకు టీఆర్టీ రాసే అవకాశం కల్పించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. హైకోర్టును ఆశ్రయించిన పిటిషనర్లకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తిస్తుంది.

నిందితుల వివరణ తర్వాతే విచారణ

• కులంపేరుతో తహసీల్దార్‌ను దూషించారనే కేసులో హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కులంపేరుతో దూషించారంటూ నమోదైన కేసులో నిబంధనలను కచ్చితంగా అమలుచేయాలని పోలీసులకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట తహసీల్దార్ ఎం మంత్రునాయక్‌ను కులంపేరుతో మహ్మద్ అమ్జద్, నర్సింహారెడ్డి తదితరులు దూషించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ తమ పొలాల నుంచి రోడ్డు వేయడంపై తహసీల్దార్‌ను నిందితులు కులంపేరిట దూషించారని కేసు నమోదైంది. కేసును కొట్టివేయాలంటూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. నర్సింహారెడ్డి కూతురైన న్యాయవాది రచనారెడ్డి ప్రభుత్వ వ్యతిరేక కేసుల్లో వాదనలు చేస్తుండడంతో, తహసీల్దార్ తప్పుడు ఫిర్యాదు ఆధారంగా కేసులు నమోదు చేశారని నిందితుల తరపున న్యాయవాది కోర్టుకు నివేదించారు. రాజకీయకక్షలతోనే కేసునమోదు చేశారని వివరించారు. న్యాయస్థానం దీనిపై స్పందిస్తూ, సుప్రీం ఇటీవల జారీచేసిన మార్గదర్శకాల కారణంగా నిందితుల అరెస్ట్‌పై స్టే విధించడం ఈ దశలో సాధ్యం కాదని పేర్కొన్నది. పోలీసులు చట్టనిబంధనలను విస్మరించొద్దని స్పష్టంచేసింది. తదుపరి విచారణను మూడువారాలకు వాయిదా వేసింది.



తుమ్మిళ్ల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రులు లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ జితేందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ మంద జగన్నాథం, జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్



అభివృద్ధిని ఆశీర్వదించండి

> మొదటిపేజీ తరువాయి...

పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో నిర్మితమవుతున్న ఏదుల రిజర్వాయర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మిళ్ల వద్ద ఏర్పాటుచేసిన బహిరంగసభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఆర్డీఎస్ పరిధిలోని 87,500 ఎకరాలకు కచ్చితంగా సాగునీరందించి తీరుతామని స్పష్టంచేశారు. ఆర్డీఎస్ నుంచి 17.09 టీఎంసీల నీటి కేటాయింపులున్నా కేవలం ఐదు టీఎంసీలు కూడా సమైక్య పాలకులు పారించలేదని విమర్శించారు. ఆర్డీఎస్ గురించి ఇటీవలే కర్ణాటక ప్రభుత్వంతోనూ చర్చించామని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తిచేసేందుకు కర్ణాటక ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు గతంలో పదేండ్లపాటు తమ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పనులు చేశామని చెప్పినా ఏ ఒక్క ప్రాజెక్టు నుంచి కూడా చుక్కనీరు పారించలేదని ఎద్దేవా చేశారు. ఇందుకు ఉమ్మడి పాలమూరులోని ఎంజీకేఎల్ఐ, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలే నిదర్శనమని వివరించారు.

ప్రతి ఎకరాకు సాగునీరు

రాష్ట్రంలోని ప్రతి ఎకరానికీ సాగునీరందించాలనే లక్ష్యంతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. తుమ్మిళ్ల ఎత్తిపోతలను కేవలం ఏడు నెలల్లోనే పూర్తిచేసి చూపిస్తామని పేర్కొన్నారు. వచ్చే వానకాలం నాటికి తుమ్మిళ్ల ద్వారా సాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన విడుతలవారీ కరంటు.. రైతులకు చుక్కలు చూయించిందన్నారు. నేడు టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరాయంగా త్రీఫేస్ కరంటును అందిస్తూ, దేశంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్‌వన్‌గా నిలిపిందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన ఏదుల రిజర్వాయర్ పనులు వచ్చే నెలాఖరుకల్లా పనులు పూర్తి అవుతున్నాయని.. వచ్చే సీజన్‌లో ఈ రిజర్వాయర్‌లో సాగునీటిని నిలువ చేసి ఉమ్మడి పాలమూరు సాగుబడులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, ఇక్కడి కాంగ్రెస్ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నాలు చేయడం పాలమూరు రైతుల దురదృష్టకరమని వెల్లడించారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వారికి పూర్తి స్థాయిలో ఇండ్లు నిర్మించి ఇస్తామని భరోసా ఇచ్చారు.



తుమ్మిళ్ల ఎత్తిపోతల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఇన్నాళ్లు ఏం చేశారు: మంత్రి జూపల్లి కృష్ణారావు

ఈ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టుల్లో 90శాతం పనులు పూర్తయ్యాయని చెప్పుకొంటున్న నేతలు అధికారంలో ఉన్నప్పుడు సాగునీటిని ఎందుకు పారించలేదని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులతో పచ్చబడ్డ ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని తెలిపారు. వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తుమ్మిళ్ల ద్వారా ఆర్డీఎస్ రైతుల కష్టాలు గట్టెక్కుతున్నాయని తెలిపారు. నడిగడ్డ రైతుల కష్టాలను స్వయంగా చూసిన సీఎం కేసీఆర్ తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి ఈ ప్రాంత రైతులకు గొప్ప మేలు చేశారని పేర్కొన్నారు. ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు చొరవ కారణంగా తుమ్మిళ్ల పనులు వేగవంతంగా పూర్తి అవుతాయని చెప్పారు. ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి దశాబ్దాల తరబడి పనులు చేస్తే.. నేడు టీఆర్‌ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన రోజే ప్రాజెక్టును ఎప్పుడు ప్రారంభిస్తామో చెప్పడం సీఎం కేసీఆర్ ఘనత అని అభివర్ణించారు. ఆర్డీఎస్‌కు చివరలోని తాండ్రపాడు, సింధనూరులతో పాటు మరో 8 గ్రామాలకు జనవరిలో నీటి ఇబ్బందులున్నాయని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా, నెట్టెంపాడు ద్వారా అదనపు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ హయాంలోనే సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ మందా జగన్నాథం అధ్యక్షత వహించగా, జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాల్‌రాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మార్కెట్ చైర్మన్లు విష్ణువర్దన్‌రెడ్డి, బండ్ల విజయలక్ష్మి, టీఆర్‌ఎస్ నాయకులు కృష్ణమోహన్‌రెడ్డి, మంద శ్రీనాథ్, గట్టు తిమ్మప్పపాల్గొన్నారు.

రద్దీ సమస్యే రాదు

సంక్రాంతికి స్వగ్రామాలకు దూసుకెళ్లేలా సర్కారు చర్యలు

టోల్‌ప్లాజాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు • వాహనాల చెంతకే వెళ్లి వసూలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు ప్రయాణం సమస్యల్లేకుండా సాగేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్ నుంచి దాదాపు 10 లక్షల కార్లు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు ఏపీకి వెళ్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోకుండా, టోల్‌ప్లాజాల వద్ద రద్దీ సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నది. టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరకుండా.. వాహనాల వద్దకే వెళ్లి టోల్ వసూలు చేసేలా అదనపు సిబ్బందిని నియమిస్తున్నది. దారి పొడవునా దురదృష్టవశాత్తు ప్రమాదాలు జరిగితే వెంటనే సాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. ఆయా మార్గాల్లో అంబులెన్సులను పెంచింది. ఏటా సంక్రాంతి పండుగ సమయంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి, రాజీవ్ రహదారి, హైదరాబాద్ -బెంగళూరు, నిజామాబాద్ వైపు వెళ్లే హైవేలు వాహనాల రద్దీతో కిక్కిరిసిపోతాయి. జాతీయ రహదారిపై ఉన్న టోలు వసూలు కేంద్రాల వద్ద రద్దీ సమస్య నెలకొంటున్నది. గంటల కొద్దీ అక్కడే వేచి ఉండాల్సి వస్తున్నది. ఈ సారి ఆ సమస్య తలెత్తకుండా టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని నియంత్రించేందుకు బూత్‌లోనే కాకుండా వరుసలో ఉన్న వాహనాల దగ్గరకు సిబ్బంది వెళ్లి రసీదు ఇచ్చేలా అధికారులు అదనపు సిబ్బందిని నియమిస్తున్నారు. వారికి ప్రత్యేక మెషిన్లను అందించనున్నారు. ఈటీసీ విధానంలో మెయిన్ సర్వర్‌కు యంత్ర పరికరం అనుసంధానం చేయడం ద్వారా వాహనాల రద్దీని నియంత్రించనున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటే వెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు అదనపు వాహనాలను సిద్ధం చేశారు. చిల్లకల్లు టోల్ కేంద్రం పరిధిలో 60 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్ ఉండగా.. ప్రస్తుతం అదనంగా మరొకటి ఏర్పాటుచేశారు. పెట్రోలింగ్‌కు ఒక వాహనం ఉండగా, అదనంగా రెండు వాహనాలను సిద్ధంచేశారు. కీసర టోల్ ప్లాజా పరిధిలో అత్యవసర పరిస్థితి తలెత్తితే గొల్లపూడి నుంచి మినీ అంబులెన్స్ వచ్చేలా ఏర్పాట్లుచేశారు. ఈ నెల 11వ తేదీ నుంచి 17 వరకు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా ప్రయాణ సమయంలో వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టోల్‌ప్లాజా అధికారులు చైతన్యపర్చనున్నారు. హైదరాబాద్ -విజయవాడ హైవేపై నాలుగు టోల్‌ప్లాజాలు ఉండగా.. సాధారణ రోజుల్లో 3వేల నుంచి 4వేల వాహనాలు ప్రయాణిస్తే, సంక్రాంతి పండుగ రోజుల్లో రోజుకు సగటున 14 వేల నుంచి 16వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. గత ఏడాది జనవరి 10 నుంచి 14 వరకు సంక్రాంతి సందర్భంగా చిల్లకల్లు, కీసర టోల్ ప్లాజాల సగటున రోజుకు దాదాపు 15వేల వాహనాలు రాకపోకలు సాగించాయి.

నేడు ఫుడ్ సేఫ్టీ సదస్సు

• ఢిల్లీ వెళ్లిన మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఢిల్లీలో నిర్వహించనున్న ఆహార భద్రతా సదస్సులో పాల్గొనేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి లక్ష్మారెడ్డి సోమవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలోని ఎఫ్‌డీఏభవన్‌లో మంగళవారం ఉదయం జరుగనున్న ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సదస్సులో మంత్రి పాల్గొంటారు. పోషక విలువలతో కూడిన పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధించేందుకు దేశంలో ఫుడ్‌సేఫ్టీ మీద కేంద్ర ప్రభుత్వం ఈ సదస్సు నిర్వహిస్తున్నది. దేశంలోని అన్నిరాష్ట్రాల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రులు ఈ సమావేశంలో పాల్గొంటారు. కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా ఈ సమావేశానికి నేతృత్వం వహిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ మీద ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రజల్లో కల్పిస్తున్న అవగాహన, తరచుగా నిర్వహిస్తున్న దాడులు, ఆహార పరీక్షలు వంటి పలుఅంశాలను ఈ సదస్సులో మంత్రి లక్ష్మారెడ్డి వివరించనున్నారు. అనంతరం రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన ఎయిమ్స్, వైద్య ఆరోగ్య, కుటుంబసంక్షేమ నిధులు వంటి పలు అంశాలను కేంద్ర మంత్రి నడ్డా దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌కు మాతృవియోగం



నేతి విద్యాసాగర్ మాతృమూర్తి రాధమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం తదితరులు ఉన్నారు.



రాధమ్మ (ఫైల్)



నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ పూల రవీందర్

సీఎం కేసీఆర్, అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, పలువురు మంత్రుల సంతాపం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ఖైరతాబాద్/కేతేపల్లి: తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ మాతృమూర్తి రాధమ్మ (94) సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారు. స్వగ్రామమైన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం చెరుకుపల్లిలో సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరిగాయి. రాధమ్మ మృతి పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్, శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు టీ హరీశ్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

చెర్కుపల్లిలో అంత్యక్రియలు

రాధమ్మ పార్థివదేహానికకి విద్యాసాగర్ స్వగ్రామమైన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం చెర్కుపల్లి సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి, మండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో పాటు పలువురు ఆమె పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. విద్యాసాగర్ కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. నివాళులర్పించినవారిలో ఎంపీలు కే కేశవరావు, గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్సీలు పూల రవీందర్, ఆకుల లలిత, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల కలెక్టర్లు సురేంద్రమోహన్, గౌరవ్ ఉప్పల్, మాజీ ఎమ్మెల్యేలు నోముల నర్సింహ్మయ్య, చిరుమర్తి లింగయ్య, టీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.



ఒకప్పుడు దొంగ.. ఇప్పుడు మోడల్!


ఈ అందాల ముద్దుగుమ్మ ఒకప్పుడు ఎన్నో దొంగతనాలు చేసింది. వాటిని నుంచి బయటపడి ఇప్పుడు మోడలింగ్ రంగంలో రాణిస్తున్నది. అయినా ఆ మీద దొంగ ముద్ర మాత్రం పోలేదు.

రెండు నెలల్లో 42 ఇండ్లల్లో దొంగతనాలు చేసి దాదాపు 58 వేల డాలర్ల సొత్తును దోచుకెళ్లింది. ఈ నేరంలో ముగ్గురు మైనర్‌లను ఉపయోగించి మరీ దొంగతనం చేసింది స్టీఫెన్ బ్యూడోయిన్. 21 యేండ్ల ఈ అమ్మడు.. దొంగతనాలు చేసి పట్టుబడి మూడు నెలలు జైలు శిక్ష అనుభవించింది. అయితే ఆ దొంగతనాలే ఆమెను పాపులర్ చేశాయి. దొంగతనం చేసినప్పుడు ఆమె ఫొటోలు పేపర్లలో, సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టాయి. దాంతో ఆమెకు మోడలింగ్ ఆఫర్లు రావడం మొదలయ్యాయి. వాటిని సద్వినియోగం చేసుకుంది. ఇంతకుముందు చిన్న చిన్న లోకల్ మ్యాగజైన్‌ల్లో కనిపించిన ఈ అమ్మడు ఇప్పుడు ఇంటర్నేషనల్ మ్యాగజైన్లలోనూ కనిపిస్తున్నది. అయితే మళ్లీ క్రిమినల్ ఆలోచనలు ఏవీ లేవంటున్న స్టీఫెన్‌కి 'సెక్సీ దొంగ' అనే ముద్ర మాత్రం పోవడం లేదు.

పిల్లలకు ఎంత నీరు ఇస్తున్నారు?

ఆరోగ్యంగా ఉండాలంటే నీరు తాగడం చాలా ముఖ్యం. ఒక వ్యక్తి రోజులో ఎంత నీరు తాగాలి? పిల్లలకు ఎంత మోతాదులో ఇవ్వాలి? దీనిపై అనేక అనుమానాలున్నాయి.

పెద్దలు తాగినట్లే పిల్లలూ నీరు తాగితే ప్రమాదమా? అనే సందేహాలు చాలామందికి ఉన్నాయి. నిపుణులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. పెద్దలు తాగినట్లు.. అదే మోతాదులో పిల్లలకూ నీరు తాగిపించడం ప్రమాదకరం అని వాళ్లు చెప్తున్నారు. ఈ అంశంపై తాజాగా అమెరికన్ అకాడమీ ఆఫ్ పెడియాట్రిక్ పరిశోధకులు అధ్యయనం చేశారు. పిల్లలకు ఎక్కువ మోతాదులో నీరు తాగించడం వల్ల సోడియం నిష్పత్తి అసమతుల్యమై మత్తు ఎక్కుతుందట. సరైన సమయంలో ఈ స్థితిని పరిశీలించకపోతే ప్రాణానికే ప్రమాదమని వాళ్లు హెచ్చరిస్తున్నారు. ఎదిగే సమయంలో మితిమీరిన నీరు తాగడం వల్ల శరీర బరువు కోల్పోయి బలహీనపడిపోతారట. తల్లిపాలల్లో ఎలాగూ 88 శాతం నీరు ఉంటుంది కాబట్టి ప్రత్యేకంగా నీటి కోసం పిల్లల్ని ఇబ్బంది పెట్టొద్దని సూచిస్తున్నారు.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



సమాజం సమానత్వం కోరుతున్నది!
చదువు అందరి హక్కు.. వేదం అందరి బాధ్యత అని నినదిస్తున్నది.
కానీ.. ఎంతమంది ఈ సమానత్వం దిశగా అడుగులు వేస్తున్నారు?
ప్రసంగాలిచ్చేవారు కొందరైతే.. ప్రారంభించి పలాయనం చిత్తగించేవాళ్లు కొందరు.
ఎవరు వచ్చినా.. రాకపోయినా.. 'నేనున్నాను'
అంటూ ముందుకొచ్చారొక ఆదర్శ మహిళ.
బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి.. దళిత పిల్లలను అక్కున
చేర్చుకుని విద్యా బుద్ధులు నేర్పుతున్న మానవతామూర్తి ఆమె.
ఆపదొచ్చి అమ్మా అని పిలిస్తే అభయమందించి ఆదుకుంటున్న
ఆ సేవామూర్తే విమలమ్మ!

పేదల జీవితాల్లో.. విమల వికాసం!

ధర్మపురిలోని శ్రీ రాజరాజేశ్వర వేద పాఠశాలలో వేదాలు నేర్చుకున్న విమల సంస్కృతంలో బీఏ, బీఈడీ చేశారు. వాళ్లది పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్‌మూర్. భర్త సత్యనారాయణ శర్మ. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పూజారి. వీరికి ముగ్గురు కుమారులు. సత్యనారాయణ శర్మ ఒకప్పుడు అంతర్గాం స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పనిచేసేవాడు. మిల్లు నడిచినన్ని రోజులు కుటుంబం సాఫీగా సాగింది. కొంతకాలానికి మిల్లు మూసేశారు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. తానేదైనా పనిచేయాలని నిర్ణయించుకున్నారు విమల. అది తనకు ఆర్థికంగా దోహదం చేస్తూనే సమాజానికి ఉపయోగపడాలన్నుకున్నారు. చదువు రాని వాళ్లను అక్షరాస్యులుగా తీర్చే కార్యక్రమమైన అనియత విద్యా కేంద్రాల్లో కో-ఆర్డినేటర్‌గా చేరారు. తర్వాత మూర్‌మూర్ అంగన్‌వాడీ కార్యకర్తగా మారారు.

దళిత పిల్లలను చేరదీసి!

మూర్‌మూర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్న విమల దళిత పిల్లలను చేరదీస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దళిత పిల్లల పోషణతో పాటు పెళ్లిళ్లు కూడా చేస్తున్నారు. అంతర్గాం మండలం బ్రహ్మణపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిపల్లి దళిత సమాజిక వర్గానికి చెందిన లక్ష్మయ్య, భూదమ్మ దంపతులు. వారికి ఒక కుమారుడు.. ముగ్గురు కూతుళ్లు. పిల్లలను పోషించలేని స్థితి వాళ్లది. విషయం తెలుసుకున్న విమల వాళ్ల ముగ్గురు ఆడపిల్లలను చేరదీసింది. బ్రహ్మణ కుటుంబానికి చెందిన వ్యక్తి అయుండి ఇలా దళిత పిల్లలను చేరదీయడంతో సమాజం నుంచి ఈసడింపులూ వచ్చాయి. అవేవీ లెక్క చేయకుండా ముగ్గురు పిల్లలకు చదువు చెప్పించింది. వారిలో పెద్దమ్మాయి భాగ్యలక్ష్మీని చదివించడమే కాకుండా పెండ్లి కూడా చేసింది. ఆమె స్థోమతకు తగిన కట్నకానుకలూ ఇచ్చింది. రెండో అమ్మాయి భాగ్యశ్రీ. ఆమెకు జ్ఞాపకశక్తి తక్కువ. ఆ కారణంగా చదువుల్లో ముందుకెళ్లలేకపోయింది. ఇప్పుడామె వయసు 18 ఏండ్లు దాటడంతో పెండ్లి చేయాలనుకుంటున్నది విమల. మూడో అమ్మాయి ధనశ్రీ ప్రస్తుతం గోదావరి ఖనిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నది.

కల్యాణం చేయించి!

ఈ ముగ్గురికే కాదు.. విమల చాలామంది అమ్మాయిల జీవితాల్లో వెలుగులు నింపింది. మూర్‌మూర్‌కు చెందిన దళిత అమ్మాయి రజిత తండ్రి చనిపోయాడు. ఆమెకు ఇద్దరు అన్నదమ్ముండ్లు ఉన్నప్పటికీ వారికి పక్షపాతం రావడంతో పూట గడవటమే భారంగా మారింది. వాళ్ల పరిస్థితిని అర్థం చేసుకున్న ఆ అమ్మాయి పెండ్లి ఖర్చులకు 40 వేల రూపాయల నగదు ఇచ్చింది. మరో యువతి శారదను డిగ్రీ చదివించింది. తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. ఏ దిక్కులేని శారదను విమల చేరదీసింది. అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా పెట్టుకుని తర్వాత రేషన్ డీలర్‌గా ఉపాధి కల్పించింది. ఆర్థికంగా స్థిరపడిన శారద విమల సమక్షంలోనే పెండ్లి చేసుకున్నది. మగ్గడి శిరీషకు పెండ్లయింది. తల్లిదండ్రులు లేరు.. అత్తామామలు లేరు. గర్భిణిగా ఉన్న శిరీషను చేరదీసి కాన్పు నుంచి.. పురుడు పోసేవరకు అన్నీ దగ్గరుండి చూసుకుంది. బిడ్డకు సహస్ర అని పేరు పెట్టింది. నేరడుగొమ్మ పట్టాభిరామ్.. జ్యోతి దంపతుల బిడ్డ అనూష వివాహానికి ఆర్థిక సాయం చేసింది విమల.



అంగన్‌వాడీ సేవకురాలిగా!

తాను పని చేస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్న పిల్లలకు సైతం తనవంతుగా సహాయం చేస్తున్నది విమల. పిల్లలకు ప్రతి యేటా రెండు జతల యూనిఫాంలు సొంత ఖర్చులతో అందజేస్తున్నది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పెడుతున్నది. పేద మహిళలకు సీమంతాలు, పురుడు పోయడం వంటివి చేస్తున్నది. బడుగు.. బలహీన.. పేద ప్రజలకు తన వంతుగా సాయం చేస్తూనే తన వృత్తినీ కొనసాగిస్తున్నది. పంచకావ్యాలు అయిన రఘువంశం, మేఘసందేశం, కూమార సంభవం, స్వర్ణముకి, కర్తవ్యం పట్టించిన విమల చుట్టు పలు గ్రామాల్లో పౌరోహిత్యం సైతం చేస్తుంది. ఎల్లంపల్లి.. మూర్‌మూర్.. కుక్కలగూడర్.. మద్దిరాల.. జయ్యారం... గుడిపేట గ్రామాల్లో పౌరోహిత్యం చేస్తున్నది.



ఊరందరి అమ్మగా విమలమ్మ!

మూర్‌మూర్ గ్రామంలో విమల అనే చెప్తితే ఎవ్వరూ ఇంటి అడ్రస్ చెప్పారు. అమ్మ ఇల్లు ఎక్కడ అంటేనే చెబుతారు. అంగన్‌వాడీ కేంద్రం అంటే సైతం గ్రామంలో చాలామందికి తెలియదు.. అమ్మ బడి అంటేనే వారికి అర్థం అవుతుంది. గ్రామంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ విమలను ఆపాయ్యంగా అమ్మా అని పిలుస్తారు. చుట్టు పక్కల గ్రామాల వారు సైతం అమ్మ అనే పిలుస్తారు. ఆమె పెంచుతున్న దళిత ఆడబిడ్డలు మాత్రం అమ్మమ్మ అని పిలుస్తారు. దళిత అమ్మాయిలను చేరదీసిన విమల కుటుంబసభ్యుల నుంచి సైతం మంచి ప్రోత్సాహం లభించింది. విమల అత్తమామలతో పాటు తల్లిదండ్రులు, గ్రామంలోని బ్రహ్మణుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. విమల కుమారులు సైతం అమ్మ పెంచుతున్న పిల్లలను సొంత చెల్లెల్లుగానే భావిస్తుంటారు. పండుగల సందర్భంగా మూర్‌మూర్‌కు వచ్చిన సమయంలో విమల కుటుంబసభ్యులు అందరూ కలిసి సహపంక్తి భోజనం చేస్తారు.

కష్టాలకు ఎదురీదుతూ!

విమల ఇప్పుడు నలుగురికి సహాయం చేస్తుందంటే వెనుకటి కాలం నుంచి విమల కుటుంబం పెద్దగా ఆర్థికంగా ఉన్న కుటుంబం ఏమీ కాదు.. మాది ఒకప్పుడు కష్టాలకు ఎదురు నిలిచిన కుటుంబమే. అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు మూతపడ్డ తరువాత కుటుంబం గడవడమే కష్టంగా మారింది. ఈనేపథ్యంలో ఎలా బతకడం అని ఆలోచిస్తే ఎక్కడ ఏమీ కనిపించడం లేదు.. అనియత విద్యా కేంద్రం ఏర్పాటు తరువాత రాత్రి బడికి వచ్చే దళితులు మక్క కంకులు, మక్క జొన్నలతో పాటు వారి పొలాల్లో పండినవి తినడానికి ఇచ్చేవారు. వాటిని తిని బతికారు కొన్నిరోజులు. అయినా ఎన్నడూ ధైర్యం చెదిరిపోలేదు.. కష్టాలను అధిగమించినప్పుడే విజయాలను సాధిస్తామనే నమ్మకంతో ముందుకు సాగి.. ఎన్ని కష్టాలు వచ్చిన పిల్లలను చదివించాలని పట్టుదలతో ఉన్నారు. కొడుకులు ఒక వైపు చదువునే కట్టెలకు పోయేటోళ్లు.. కొన్ని సందర్భాల్లో తిండికి లేకపోవడంతో ఇద్దరు పిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పించింది విమలమ్మ. 'నా పెద్ద కొడుకు పదో తరగతి పూర్తి అయిన తరువాత ట్యూషన్లు చెప్పి మెల్లగా కుటుంబాన్ని పైకి తీసుకువచ్చాడు. ఒకవైపు ట్యూషన్లు చేబుతూనే తన చదువు కొనసాగిస్తూ తమ్ముళ్ల చదువుకు సహకరించాడు. ఈరోజు మాకుటుంబం ఇలా ఉంది అంటే నా పెద్దకొడుకు చలువే' అని చెబుతుంది విమలమ్మ. 'మేం కష్టాల్లో ఉన్నప్పుడుఈ దళితులే మా కడుపు నింపారు.. ఇప్పుడు మాకు ఆర్థిక సమస్యలు లేకపోవడంతో ఉన్న దాంట్లో వారికోసం మాకు తోచిన సహాయం అందిస్తున్నాం' అని కూడా చెబుతున్నది.

ఎరుకల అశోక్, పెద్దపల్లి ప్రతినిధి
కొలిపాక మనోహర్‌రెడ్డి అంతర్గాం

అందాల లిజా!



ద ఇండిపెండెంట్ క్రిటిక్స్.. 'ద మోస్ట్ బ్యూటీఫుల్ ఫేసెస్ ఆఫ్ 2017' పేరిట ఒక జాబితా విడుదల చేసింది. అందులో ఫిలిప్పీన్స్‌కి చెందిన యాక్టర్, మోడల్ అయిన లిజా సోబెరానో ఎంపికైంది. ఆమె గురించి మరిన్ని సంగతులు..

1990 నుంచి 'ద ఇండిపెంటెండ్ క్రిటిక్స్' అనే ఓ గ్రూపు ఈ అవార్డులను ఇవ్వడం మొదలుపెట్టింది. ఈ సంవత్సరం 85 వేల మంది సెలెబ్రిటీల జాబితా నుంచి ఫైనల్‌గా 100 మందిని ఎంపిక చేశారు. ఇందులో నుంచి లిజా మొదటి స్థానాన్ని దక్కించుకున్నది. ఈ లిస్ట్‌లో ఐదుగురు భారతీయులు కూడా ఉన్నారు. ప్రియాంక చోప్రా 25 వస్థానం, దీపికా పదుకొనే 37, నర్గీస్ ఫక్రీ 53, అలియా భట్ 73, ఊర్వశి రౌతెలా 89వ స్థానాన్ని దక్కించుకున్నారు. ఇక లిజా 2014లో యాక్టింగ్ మొదలుపెట్టింది. అప్పటి నుంచి ఎక్కువ టీవీ షోలు చేసేది. 19 యేండ్ల ఈ అమ్మడు నాలుగు సంవత్సరాల వయసులోనే 'మోస్ట్ బ్యూటీఫుల్ కిడ్ ఇన్ ద వరల్డ్' టైటిల్‌ని గెలుచుకున్నది. ఈ క్రిటిక్స్ ఇచ్చే లిస్ట్‌లో మూడోసారి ఈ అమ్మడు స్థానం సంపాదించింది. పోయిన ఏడాది రెండు, అంతకుముందు ఏడాది ఆరోస్థానంలో ఉంది. ఈ సంవత్సరం మొదటిసారి ప్రథమ స్థానాన్ని సంపాదించుకున్నది. 1998లో జన్మించిన ఈ అమ్మాయి తండ్రి ఫిలిప్పిన్, తల్లి అమెరికా వాస్తవ్యురాలు. ఈమె పుట్టింది కాలిఫోర్నియాలో. తల్లిదండ్రులు ఆమె చిన్నప్పుడే విడిపోవడంతో తండ్రి దగ్గరే పెరిగింది.

'చింత' ఉండదిక!



- చింతపండు గుజ్జులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శక్తివంతమైనవి. ఇవి అజీర్తికి చెక్ పెడుతాయి.
- చింతపండులో ఫైబర్, మినరల్స్, విటమిన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.
- చింతపండులోని పోషకాలు ఫ్రీ రాడికల్ కణాలను నశింపజేసి, క్యాన్సర్ కణాలతో పోరాడుతాయి.
- చింతపండులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. ఫలితంగా హృద్రోగాలకు దూరంగా ఉండొచ్చు.
- రక్తహీనతతో బాధపడేవారికి చింతపండు మంచి ఔషధం. ఇందులోని ఐరన్ రక్తాన్ని వృద్ధి పరిచి, రక్తహీనతకు చెక్ పెడుతుంది.
- శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ తగ్గించి, మంచి కొవ్వును ఉత్పత్తి చేయడంలో చింతపండు భలేగా పనిచేస్తుంది.
- కిడ్నీ సంబంధిత వ్యాధులను దూరం చేయడంలో కూడా చింతపండు పోరాడుతుంది.
- కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే చింతపండు తరుచూ తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

బిట్స్ కార్నర్



అడుగండి చెబుతా

గాల్ బ్లాడర్‌లో రాళ్లు.. ఎందుకు?

మా అమ్మ వయసు 68 సంవత్సరాలు. గత కొద్దిరోజులుగా కడుపులో నొప్పి, మంట, అజీర్తిగా ఉంటే డాక్టర్‌కు చూపించాము. కొన్ని పరీక్షలు చేసి గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఉన్నాయని చెప్పారు. అసలు ఈ రాళ్లు ఎందుకు ఏర్పడుతాయి? దీనికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలాంటి చికిత్స అవసరమవుతుంది?

గౌరీ దేవి, నిజామాబాద్

మనం రోజూ తీసుకునే ఆహారం జీర్ణం కావడంలో గాల్‌బ్లాడర్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడితే ఇది ప్రాంకియాటైటిస్‌కు కారణం కావచ్చు. గాల్‌బ్లాడర్ నుంచి విడుదలయ్యే పైత్యరసం జీర్ణక్రియకు చాలా అవసరం. గాల్‌బ్లాడర్ పనితీరు నెమ్మదించడం వల్లనే అందులో రాళ్లు ఏర్పడుతాయి. దీనిని కోలిసిస్టైటిస్ అంటారు. అయితే ఇలా రాళ్లు ఏర్పడిన వారిలో చాలామందికి ఎలాంటి సమస్యా ఉండదు. కానీ కొందరిలో మాత్రమే సమస్యలు ఎదురవుతాయి. ఈ రాళ్లను మందులతో కరిగించాలంటే 2,3 సంవత్సరాల సమయం పడుతుంది. సాధారణంగా లాప్రోస్కోపీ ద్వారా గాల్‌బ్లాడర్‌ను తొలగించడం దీనికి సరైన చికిత్స. ఈ సర్జరీని కోలిసిస్టెక్టమీ అంటారు. గాల్ బ్లాడర్‌తో ప్రత్యేక ఉపయోగమేదీ లేదు కాబట్టి దీన్ని తొలగించినా పెద్దగా నష్టం లేదు.

జాగ్రత్తలు:

- కొవ్వు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోకూడదు.
- శరీర బరువును పెరుగకుండా జాగ్రత్త పడాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చెయ్యాలి.
- రోజు తగినన్ని నీళ్లు తాగడం చాలా అవసరం.



డాక్టర్ భవాని రాజు
సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

సిరిముగ్గు

మా చిరునామా:

సిరి ముగ్గు,
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi@ntdaily.news
zindagi.nt@gmail.com



దాసరి శిరీష
కామేశ్వర్‌రావు కాలనీ,
రవీంద్రనగర్, నల్లగొండ



నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[హైదరాబాద్]
మంగళవారం 9 జనవరి 2018



ఇలా పరీక్ష చేసుకోండి..

ఇప్పుడు డయాబెటిస్ చాలా సాధారణమైన అనారోగ్య సమస్య అయిపోయింది. ప్రతి ఇంట్లో కనీసం ఒక డయాబెటిస్ పేషెంట్ ఉండటం మామూలైపోయింది. డయాబెటిస్ ఉన్నవారు మందులు క్రమం తప్పకుండా వేసుకుంటూ, జీవనశైలీ మార్పులు చేసుకోవడం ద్వారా సాధారణ జీవితం గడపడం సాధ్యమే. అయితే తరచుగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిని పరీక్షించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ప్రతి సారీ డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళ్లే అవసరం లేకుండా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తెలిపే డిజిటల్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ఉపయోగించడం చాలా సులువు. అయితే విలువలు కరెక్ట్‌గా రావాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

- ముందుగా చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. అప్పటికే చేతికి అంటి ఉన్న ఏదైనా తినుబండారం లేదా పండ్లరసం వంటిది ఉంటే అది పరీక్షా ఫలితాలను ప్రభావితం చేస్తుంది.
- వేలి మీద గోరుకు దగ్గరగా ఉండే భాగంలో పిన్‌తో గుచ్చి రక్తం తియ్యడం మంచిది. ఎందుకంటే పనులు చేస్తున్నపుడు ఎక్కువగా ఉపయోగించే వేలి భాగం అయితే పెద్దగా నొప్పిగా అనిపించదు.
- పరీక్షకు సరిపడినంత రక్తం రాలేదని వేలిని పిండి రక్తం బయటికి తీసే ప్రయత్నం చెయ్యొద్దు. అలాంటి సందర్భాల్లో గుచ్చడానికి ఉపయోగించే పరికరం మరి కాస్త లోపలికి చేరే విధంగా సరిచేసుకోవాలి.
- టెస్ట్ స్ట్రిప్‌కు ఎదురుగా రక్తం నమూనాను ఉంచాలి. మీటర్ డిస్‌ప్లే మీద ఫలితం కనిపించే వరకు వేచి చూడాలి.
- పరీక్ష చేసుకున్న సమయం, తేదీ, పరీక్షా ఫలితాలు రాసి పెట్టుకుంటే మీరు డాక్టర్‌ను సంప్రదించినపుడు వివరించడానికి అనుకూలంగా ఉంటుంది.

పొగతో డిఎన్ఎకు సెగ



మనకు కనిపించే ప్రతి పది మందిలో దాదాపు ఎనిమిది మంది సిగరెట్లు తాగేవాళ్లే ఉంటూ ఉంటారు. పొగతాగే అలవాటంటూ మొదలైందంటే అది చేసే హాని అంతా ఇంతా కాదు. నివారించగలిగే మరణాలకు ఇది ప్రధాన కారణం. దీర్ఘకాలిక పొగరాయుళ్లలో డిఎన్ఏ కూడా దెబ్బతింటుందని చెప్తున్నాయి కొత్త పరిశోధనలు.

పొగతాగడం మానేసేసరికే అది డిఎన్ఎను దెబ్బతీస్తుంది. పొగ తాగడం వల్ల దెబ్బతిన్న అవయవాలు అది మానేసిన అయిదేళ్లకల్లా మెరుగుపడుతాయి. కాని దెబ్బతిన్న డిఎన్ఏ మాత్రం తిరిగి సాధారణ స్థితికి రాదు. అందుకే పొగ జోలికి వెళ్లకపోవడమే మంచిదంటున్నారు శాస్త్రజ్ఞులు. సిగరెట్ల స్థానంలో ఇ-సిగరెట్లు వచ్చాయి గానీ వీటి ద్వారా పొగకు బదులుగా ఆవిరి వస్తుంది. ఇది కూడా ఆరోగ్యంపై వ్యతిరేక ప్రభావాలను చూపేదే. అందుకని ఈ ఇ-సిగరెట్లు కూడా ఆరోగ్యకరం కాదు.

డిఎన్ఎలో మిథైలేషన్...

సాధారణంగా మనం పుట్టేటప్పుడు ఉన్న జన్యువులే జీవితమంతా ఉంటాయని గతంలో భావించేవాళ్లు. కాని డిఎన్ఎలో మిథైలేషన్ జరిగి అవి మార్పులకు లోనవుతున్నాయి. మిథైలేషన్ వల్ల జన్యువుల ప్రభావంలో మార్పులు ఉంటాయి. ఇవి ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపించవచ్చు. మానవునిలో వచ్చే వ్యాధులను కంట్రోల్ చేసే కొన్ని ప్రక్రియలపై డిఎన్ఏ మిథైలేషన్ ప్రభావం చూపిస్తుంది. తద్వారా వ్యాధులను కంట్రోల్ చేయగలిగే జన్యువులు గతి తప్పవచ్చు. ఫలితంగా కొన్ని రకాల క్యాన్సర్లకు దారి తీయవచ్చు. అయితే డిఎన్ఏ మిథైలేషన్ జన్యువుల పనితీరుపై చూపే ప్రభావంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది.
పొగతాగడం వల్ల డిఎన్ఏ మిథైలేషన్ ప్రభావితం అవుతుంది. మిథైలేషన్‌లో కూడా మార్పులు వస్తాయి. డిఎన్ఎలో కలిగే ఎటువంటి మార్పులైనా హానికరమైన ప్రభావాలకు దారితీసే అవకాశమే ఎక్కువ. అయితే ఈ హాని ఏ రకంగా ఉంటుందో, ఏ మేరకు ఉంటుందో తెలుసుకోవడానికి పరిశోధన ఇంకా కొనసాగాల్సి ఉందంటున్నారు పరిశోధనకు నాయకత్వం వహించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్‌కి చెందిన డాక్టర్ స్టీఫెన్ లండన్.

డిఎన్ఏ మిథైలేషన్ ఏం చేస్తుంది?

పొగతాగడం వల్ల మిథైలేషన్‌లో మరిన్ని మార్పులు జరిగి జన్యు ప్రభావాలను మారుస్తుంది. ఇది కొన్ని రకాల క్యాన్సర్లు, కార్డియో వాస్కులర్ వ్యాధులకు దారితీస్తుంది. జన్యుప్రభావాన్ని నియంత్రించే మిథైలేషన్ ప్రక్రియలో మార్పులు జరగడం వల్ల జన్యువులు మారిపోయి పొగాకు సంబంధిత వ్యాధులకు కారణమవుతున్నాయంటున్నారు ప్రొఫెసర్ స్టీఫెన్ లండన్. అంతేకాదు ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు పొగతాగినా, దానికి ప్రభావితమైనా బరువు తక్కువగా ఉండే పిల్లలు, మెదడు, ఊపిరితిత్తులు ఎదగని, దెబ్బతిన్న పిల్లలు, రకరకాల బర్త్ డిఫెక్ట్స్‌తో పుడతారంటున్నారు.



ఏ నూనెలో ఏముంది?

సమాజపు పోకడలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు రోజులు ఒకప్పటిలా లేవు. ఆహార, విహారాలు మారిపోయాయి. జీవనశైలిలో మన పూర్వీకులకు మనకు పోలికే లేకుండా పోయింది. మార్పు అతి సహజమైన విషయం. ఈ మాట అన్ని అంశాలకూ వర్తిస్తుంది. వంట నూనెలు కూడా ఇందుకు అతీతం కాదు. అయితే ఈ మార్పు ఎలాంటిది ? ఏ నూనె వాడాలి? ఇలాంటి అనుమానాల నివృత్తి...

ఇప్పటి వరకు నూనె పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల శరీరంలో కొవ్వు నిల్వలు పెరిగిపోతాయని అనుకునే వారు. అందుకు అనుగుణంగానే నిపుణులు కూడా అటువంటి ఆహార విధానాలనే ఆరోగ్యకరమైనవిగా సూచించేవారు. ఇప్పటికీ చాలా మంది అదే విషయాన్ని నమ్ముతున్నారు కూడా. కానీ నిజానికి నూనెల ద్వారా శరీరంలోకి చేరే కొవ్వుల జీవక్రియ వెంటనే జరిగిపోతుంది. వాటి ద్వారా ఉత్పన్నమయ్యే శక్తి శరీరంలో కొవ్వుగా నిల్వ ఉండడం జరగదు.

బరువెందుకు పెరుగుతుంది?

ఇప్పటి వరకు బ్రేక్‌ఫాస్ట్‌గా ఉప్మా, ఇడ్లీ, దోశ, పూరి, చపాతి వంటివి తీసుకుంటున్నాం. వీటన్నింటిలో కూడా ముఖ్యమైన పోషక పదార్థాలు కార్బోహైడ్రేట్లు మాత్రమే. లంచ్‌లో కూడా మెయిన్ కోర్స్‌గా అన్నమే తింటాం. ఇది కూడా పూర్తిస్థాయిలో పిండి పదార్థాలే. ఇలా భోంచేసిన ప్రతిసారీ కార్బోహైడ్రేట్లు తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి నిల్వలు కొవ్వు రూపంలో నిల్వ ఉండిపోయి శరీరం బరువు పెరిగిపోతుంది. శరీర బరువు పెరగడానికి కారణం కొవ్వులు కాదు, కార్బోహైడ్రేట్లు. బరువు తగ్గాలనుకునే వారు ప్రొటీన్లు కలిగిన ఆహారం ఎక్కువగా తీసుకుంటూ, కార్బోహైడ్రేట్లు తీసుకోకుండా ఉండడం వల్ల మంచి ఫలితాలను పొంద వచ్చు.

ఎలాంటి కొవ్వులు మంచివి?

ఇప్పటి వరకు ఆహార పదార్థాల తయారీలో పలుచగా ఉండే రిఫైన్డ్ నూనెలనే వాడుతున్నాం. ఇవే ఆరోగ్యానికి మంచివని నమ్ముతూ వచ్చాం. కానీ నిజానికి గది ఉష్ణోగ్రత వద్ద ఘనరూపంలో లభించే సాచురేటెడ్ కొవ్వులే ఆరోగ్యానికి మంచివి. వీటిని మాత్రమే వంటకు ఉపయోగించాలి. అంటే కొబ్బరినూనె, నెయ్యి, వెన్న, చీజ్ వంటివి. చెప్పాలంటే రిఫైన్డ్ నూనెలకంటే పామోలిన్ నూనెను వంటకు ఉపయోగించడం మేలు.



ఎలాంటి నూనె వాడాలి?


వంటకు వాడే నూనె స్మోకింగ్ పాయింట్ ఎక్కువగా ఉండాలి. అంటే నూనె మరిగే ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే నూనెను వంటకు వాడడం మంచిది. ఎందుకంటే మన భారతీయ వంటలన్నీ కూడా నూనెను కాస్త ఎక్కువ వేడి చేసి తయారు చేసేవే కావడం ఇందుకు ఇంకొక కారణం. సాచురేటెడ్ కొవ్వుల స్మోకింగ్ పాయింట్ ఎక్కువగా ఉంటుంది. తక్కువ ఉష్ణోగ్రత వద్ద ఎక్కువగా వేడయ్యే గుణం కలిగిన



ఉషశ్రీ ఆలపాటి
కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

నూనెల్లో నూనె వేడయ్యే కొద్దీ ఆక్సీకరణం చెందుతాయి. అందులోని సుగుణాలన్ని ఆవిరయిపోతాయి. మళ్లీమళ్లీ వేడి చేసిన నూనె అయితే ప్రమాదకరంగా మారుతుంది.

కొబ్బరి నూనె శ్రేష్ఠం



అన్ని నూనెల్లో కెల్లా కొబ్బరి నూనె చాలా శ్రేష్ఠమైంది. కొబ్బరి నూనెను తల్లిపాలతో పోల్చి చెప్పవచ్చు. ఎండుకొబ్బరి నుంచి తీసిన నూనె కంటే కూడా పచ్చికొబ్బరి నుంచి తీసిన నూనె మరింత మంచిది. పచ్చి కొబ్బరి నుంచి తీసిన నూనె లో మీడియం చైన్ ట్రైగ్లిజరాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. దీనిలో ఉండే లోరిక్ఆసిడ్ వల్ల త్వరగా జీర్ణమవుతుంది. శరీర జీవక్రియల రేటు చాలా తగ్గిపోతుంది. దీని స్మోకింగ్ పాయింట్ చాలా ఎక్కువ. డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి ఇది చాలా మంచిది. దీనితో రక్తంలో చక్కెర స్థాయి కూడా తగ్గుతుంది. పచ్చి కొబ్బరి నుంచి తీసిన కొబ్బరి నూనెను వర్జిన్ కోకొనట్ ఆయిల్ అంటారు.

రిఫైన్డ్ నూనెలు...

సన్‌ఫ్లవర్ ఆయిల్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి పలుచని నూనెల్లో మోనో అన్ సాచురేటెడ్ ఫ్యాటీ ఆసిడ్స్ ఉంటాయి. వీటి స్మోకింగ్ పాయింట్ కొబ్బరి నూనె, నెయ్యిలతో పోలిస్తే వీటి స్మోకింగ్ పాయింట్ చాలా తక్కువ. అయితే మోనో అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ ఆసిడ్ల వల్ల చెడు కొలెస్ట్రాల్ అయిన ఎల్‌డీఎల్ తగ్గి, మంచి కొలెస్ట్రాల్ అయిన హెచ్‌డీఎల్‌ను పెరుగుతుంది. అందువల్ల గుండె ఆరోగ్యం బావుంటుంది. రక్తనాళాల్లో పేరుకునే కొవ్వు ని జానికి మనం తీసుకునే కొవ్వుల కంటే కూడా కార్బోహైడ్రేట్స్ వల్ల మాత్రమే అని కొత్త అధ్యయనాలు తెలుపుతున్నాయి. కాబట్టి రిఫైన్ చేసిన పలుచని నూనెలు వాడడం వల్ల కలిగే ప్రత్యేక ప్రయోజనాలేమీ లేనట్టే చెప్పుకోవాలి.

మరి ఆలివ్ ఆయిల్?



నిజానికి ఆలివ్ ఆయిల్‌లో చాలా సుగుణాలున్నాయి. ఇందులో ఒమెగా 3 ఫాటీ ఆసిడ్లు ఎక్కువగా ఉంటాయి. అయితే దీని స్మోకింగ్ పాయింట్ చాలా తకు. కాస్త సూర్యరశ్మి తాకినా చాలు ఆక్సిడేషన్ ప్రక్రియ మొదలవుతుంది. కాబట్టి దీన్ని వంటలో వాడడం అంత శ్రేయస్కరం కాదు. కేవలం సలాడ్ల డ్రెస్సింగ్‌కి మాత్రమే ఆలివ్ నూనెను ఉపయోగించాలి. ఆలివ్ ఆయిల్‌ను మంట మీద ఉంచి వేడి చెయ్యడం వల్ల దానిలో ఉండే అన్ని సుగుణాలు పోతాయి. కాబట్టి పచ్చిగా వాడగలిగితే మాత్రమే ఆలివ్ నూనె వాడాలి.

నెయ్యి కూడా...



కొబ్బరి నూనె తర్వాత నెయ్యిని శ్రేష్ఠమైనదిగా చెప్పకోవచ్చు. ఇందులో షార్ట్ చెయిన్ ఫాటీ ఆసిడ్స్ ఉంటాయి. నెయ్యి స్మో కింగ్ పాయింట్ కూడా చాలా ఎక్కువ. కాబట్టి వంటకు దీన్ని ఉపయోగించడం మంచిది.

బరువు తగ్గాలనుకునే వారు కొవ్వులు తగ్గించాల్సిన అవసరం లేదు. కొన్ని అధ్యయనాల ప్రకారం కొవ్వు తీసుకుంటూనే శరీరంలో కొవ్వు తగ్గించుకోవచ్చునని రుజువైంది. ఈ రుజువుల ఆధారంగా ప్రతి రోజూ తీసుకోవాల్సిన ఆహార వివరాలు

ఉదయం

- బుల్లెట్ ప్రూఫ్ కాఫీ (క్రీం, ఒక స్పూన్ కొబ్బరి నూనెతో)
- బ్రేక్‌ఫాస్ట్ – 2 గుడ్లు ఆమ్లెట్ లేదా ఉడికించిన గుడ్లు కొబ్బరి నూనెతో వేయించినవి
- కొబ్బరి పిండి లేదా బాదాముల పిండితో చేసిన బ్రెడ్ ఉడికించిన కూరగాయలతో
- పెసలు లేదా ఆల్ఫాఆల్ఫా గింజలతో చేసిన కేక్ లేదా క్రీం చీజ్, తాజా క్రీంతో చేసిన కూరగాయల సలాడ్

మధ్యాహ్న భోజనం

- చికెన్ చర్మంతో కూడినది/చేపలు/మటన్/రొయ్యలు కొబ్బరి నూనెలో వండినవి
- ఉడికించిన కూరగాయలు/వండిన కూరగాయలు/పన్నీర్/సోయా గ్రాన్యూల్స్/సోయా నగ్గెట్స్
- క్రీమ్, వెన్నతో చేసిన కూరగాయల సలాడ్

సాయంత్రం

- బాదాముల కుకీస్(బిస్కట్లు) లేదా కొబ్బరి కుకీస్ చక్కెర లేకుండా చేసినవి
- బుల్లెట్ ప్రూఫ్ కాఫీ లేదా గ్రీన్ టీ పాలు, చక్కెర లేకుండా

రాత్రి భోజనం

- చికెన్ చర్మంతో కూడినది/చేపలు/మటన్/రొయ్యలు కొబ్బరి నూనెలో వండినవి
- వండిన కూరగాయలు కొబ్బరితో చేసిన ఫ్లాఫీ ఫ్లాట్ బ్రెడ్
- ఆల్ఫాఆల్ఫా గింజల మొలకలతో లేదా అవిసె గింజల పొడితో చేసిన ప్యాన్ కేక్
- కాలీఫ్లవర్ రైస్ ఏదైనా కూరతో

క్రియాటినిన్ ఎక్కువగా ఉన్నవారు, కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్న వారు ఈ ప్రొటీన్ డైట్‌ని తీసుకోకూడదు.



తిన కూడనివి

- అన్నం, గోధుమలు ఇతర అన్ని రకాల పిండి పదార్థాలు
- అన్ని రకాల పప్పులు (కంది, శనగ, మినుములు, పెసలు, పల్లీ వంటివి)
- అన్ని రకాల పండ్లు
- చక్కెర / తేనె
- ఆలుగడ్డలు, క్యారెటు, బీట్ రూట్, మొక్కజొన్నలు
- పాలు, పెరుగు
- ఓట్స్, బార్లీ, సేమ్యా

తినాల్సినవి

- గుడ్లు, చికెన్ చర్మంతో పాటు, మటన్, చేపలు, లివర్, రొయ్యలు వీటికి ఎలాంటి మసాలాలు చేర్చుకోవచ్చు
- అన్ని రకాల కూరగాయలు (టమాట, ఉల్లి తగ్గించి తీసుకోవాలి.) అన్ని రకాల ఆకుకూరలు
- మజ్జిగ, వెన్న, నెయ్యి, చీజ్, కొబ్బరినూనె
- పాల పదార్థాలు, పన్నీరు, మీగడ
- అవకాడో
- పాలకూర, బ్రకోలీ, కాప్సికమ్ ఆలివ్ ఆయిల్‌తో కలిపిన సలాడ్.

పేషెంట్స్ డైరీ

నేనూ పేషెంటునయ్యా!

తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా కళ్లద్దాల నుంచి విముక్తి చేసే ఆధునిక ఆపరేషన్‌ను పరిచయం చేశారాయన. అంతేకాదు కంటి చికిత్సలకు సంబంధించిన ప్రతీ ఆధునిక చికిత్సను మనకు పరిచయం చేసిన కంటివైద్యుడు ఆయనే. మాక్సివిజన్ ఐ హాస్పిటల్స్ ఫౌండర్‌గా, ఇప్పటి డైరెక్టర్‌గా బాధ్యతలందిస్తున్న ఆయనే డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి. కొన్ని వేల మందికి కంటి ఆపరేషన్లు చేసిన ఆయన కూడా కళ్లద్దాలతో బాధపడ్డారు. వాటి బాధ వదిలించుకునేందుకు పేషెంటుగా కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. అందుకే పేషెంట్ డైరీలో భాగంగా తన చికిత్స గురించి ఇలా చెప్పుకొచ్చారు.





50 ఏళ్ల వయసు రాగానే ప్రతి ఒక్కరికీ కళ్లద్దాలు తప్పనిసరిగా అవసరం అవుతాయి. కనీసం చత్వారం కోసమైనా పెట్టుకోవాల్సి వస్తుంది. ఇంకా చిన్న వయసులోనే కూడా అద్దాలతో కుస్తీ పట్టేవాళ్లూ ఉంటారు. కిందకు వంగి ఏదన్నా పనిచేయాలన్నా, ఈత కొట్టాలన్నా.. ఇలా ప్రతి దానికీ కళ్లద్దాలు అడ్డం వస్తూ ఉంటే చాలా చిరాగ్గా ఉంటుంది. క్రీడలు, నాట్యం లాంటి వృత్తుల్లో ఉన్న వారికైతే కళ్లద్దాలు అతి పెద్ద సమస్య అయి కూచుంటుంది. ఇక అందం గురించి శ్రద్ధ పెట్టేవాళ్లకూ ఇదో జటిల సమస్యే అవుతుంది. వీటి బాధ పోయే మార్గం ఉంటే బావుండని చాలాసార్లు అనుకుంటారు. కొందరు ప్రయత్నిస్తారు. మరికొందరు సర్దుకుపోతారు. ఎన్నో వేల మందికి లేజర్ ఆపరేషన్లు చేసి, కళ్లద్దాల బాధ లేకుండా చేసిన నేనూ అలాగే అనుకున్నాను. కొన్నాళ్లు సర్దుకుపోయాను కూడా. కాని ప్రతిరోజూ మైక్రోస్కోప్ ద్వారా పేషెంట్ల కళ్లను పరిశీలించినప్పుడల్లా తొందరగా ఈ కళ్లద్దాలను వదుల్చుకోవాలి అనిపించేది. ఎందుకంటే ఇలా పేషెంట్ల కళ్లను పరీక్ష చేయడం కోసం రోజుకు 150 సార్లన్నా ఈ కళ్లద్దాలను తీసిపెట్టడం, మళ్లీ పెట్టుకోవడం చేయాల్సి వస్తున్నది. ప్రతిరోజూ గోల్ఫ్ ఆడే అలవాటున్న నాకు అక్కడా ఈ కళ్లజోడు అడ్డమే. ఆడాలంటే అద్దాలు తీసి పక్కన పెట్టాలి. పెట్టుకోకపోతే బంతి ఎక్కడుందో కనబడదు. దూరంలో ఉన్నవి చూడడానికి +2.0, దగ్గరి వాటికి +4.0 పవర్ ఉన్న కళ్లద్దాలను వాడుతున్నాను. నేను ఆపరేషన్ చేసినవాళ్లు కళ్లద్దాల బాధ వదిలించుకుని పడుతున్న సంతోషాన్ని నేనూ అనుభవించాలనుకున్నా.
అనుకోకుండా ఒకరోజు...

సుమారు ఒకటిన్నర నెల క్రితం..

అమెరికన్ యూరోపియన్ కాంగ్రెస్ ఆఫ్ ఆప్తమాలిక్ సర్జరీ (ఎఇసిఒఎస్) సదస్సుకు వెళ్లాను. ఆ సొసైటీ సభ్యుడిగా ఆసియా దేశాలన్నింటిలోనూ నాకు మాత్ర మే ఆ ఆహ్వానం అందింది. సదస్సు మధ్యలో బ్రేక్‌ఫాస్ట్ బ్రేక్ వచ్చింది. కంటి చికిత్సల్లో మొదటిసారి లేసిక్ టెక్నాలజీని పరిచయం చేసిన డాక్టర్ స్టీవ్ స్లేడ్, నేనూ మాట్లాడుకుంటూ తింటున్నాం. ఇద్దరం మంచి స్నేహితులం కూడా. అలా మాటల మధ్యలో ముచ్చట నా కళ్లద్దాల పైకి వెళ్లింది. పుస్తకం చదవాలన్నా, దూరంగా ఉన్నవి చూడాలన్నా కళ్లద్దాలు తప్పనిసరి అని చెప్పానాయనకు. 'దాదాపు లక్ష మందికి పైగా ఆపరేషన్లు చేశావు. నువ్వు కూడా చేయించుకోవచ్చు కదా' అన్నా డు డాక్టర్ స్లేడ్. 'చాలా ఇబ్బందిపడుతున్నాను గాని రైట్ టెక్నాలజీ, రైట్ డాక్టర్ కోసం చూస్తున్నాను' అన్నాను. 'మన హాస్పిటల్‌లోనే రేపు చేసేద్దాం' అన్నారాయన. అంతే మరుసటి రోజు ఆపరేషన్ అయిపోయింది.

తక్కువ రిస్కు

కళ్లద్దాలు తీసేయాలంటే అదేదో అందానికి సంబంధించింది అనుకుంటారు చాలామంది. అయితే కళ్లద్దాలు పెట్టుకున్నవాళ్లకే వాటి బాధ ఏంటో అర్థం అవుతుంది. మానసికమైన బిడియాలు మాత్రమే కాదు కొన్ని వృత్తుల్లో వారికి ఇదో గుదిబండ. క్రీడాకారులు, డ్యాన్సర్లకు చాలా కష్టం. పెళ్లి సంబంధాల విషయంలో కూడా ఇదో అడ్డంకి అవుతుంది. ఈ కళ్లద్దాలు ముక్కు పైన శాశ్వతమైన మచ్చను ఏర్పరుస్తాయి. కళ్లద్దాలు ఉన్నవాళ్లందరూ అవి లేకుండా ఉండాలనే కోరుకుంటారు. చాలామంది పేషెంట్లు ఇంట్రావర్ట్‌గా ఉన్నవాళ్లు కళ్లద్దాల బాధ పోయిన తరువాత ఎక్స్‌ట్రావర్ట్‌గా మారడం చూశాను. అంటే లేసిక్ లేదా లెన్స్ ద్వారా కళ్లద్దాల నుంచి విముక్తి పొందడం వల్ల వాళ్ల వ్యక్తిత్వమే మారిపోయింది. వృత్తిపరంగా గాని, వ్యక్తిగతంగా గాని కళ్లద్దాల వల్ల నాకు ఎదురవుతున్న ఇబ్బందుల్ని సరైన డాక్టర్ దొరకగానే అధిగమించాను. ఇకపోతే ఆపరేషన్ వల్ల రిస్కు...! దుష్ప్రభావాలు లేని ఆపరేషన్ అంటూ ఏదీ ఉండదు. చిన్న కంటి ఆపరేషన్ అయినా సరే మసగ్గా కనిపించడం లాంటి సమస్యలు రావచ్చు. కాని ఇలా రిస్కుల గురించి ఆలోచిస్తూ ఉంటే ప్రతిరోజూ రోడ్డు కూడా దాటలేం. దీని సక్సెస్ రేటు 99.9 శాతం. కేవలం 0.1 శాతం రిస్కు గురించి ఆలోచించి కళ్లద్దాలు లేకుండా స్పష్టంగా చూడగలిగే అవకాశాన్ని వదులుకోవడం సరి కాదు కదా.


ఇక శుక్లం బెంగ లేదు!

కళ్లద్దాలను వదిలించుకోవడం కోసమే నేను ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ ఫేకోటెక్‌మిక్స్ వల్ల నాకు ఇంకో మేలు కూడా జరిగింది. జీవితంలో ఒక వయసు తరువాత ఏదో ఒక దశలో కంటిలో శుక్లం వస్తుంది. కాని నాకు మాత్రం అది వచ్చే అవకాశమే లేదు. ఎందుకంటే నా కంట్లో సహజమైన లెన్సే లేదు. కృత్రిమ లెన్సుకి వయసు పెరగడమూ ఉండదు, శుక్లం రావడమూ ఉండదు. అంతేకాదు.. దృష్టిలోపాలే కాకుండా లెన్సుకు సంబంధించిన ఎటువంటి సమస్యలూ ఇక రావు. అయితే రెటీనాకు సంబంధించిన సమస్యలు వయసురీత్యా వచ్చే వాటికి ఇది పరిష్కారం కాదు. ఈ సమస్యల్ని కూడా శాశ్వతంగా తొలగించడానికి పరిశోధనలు జరుగుతున్నాయి.

– డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి
డైరెక్టర్, మాక్సివిజన్ ఐ హాస్పిటల్
హైదరాబాద్

బాక్టీరియాతో ఆక్సిజన్!

గుండెపోటు వచ్చినప్పుడు బ్లాక్ అయిన రక్తనాళాలను వీలైనంత తొందరగా అడ్డంకి లేకుండా చేయాలి. ఎందుకంటే తగినంత ఆక్సిజన్ అందకపోతే గుండె కణాలు చనిపోతాయి. అడ్డంకులున్న రక్తనాళాల్లో రక్తప్రసరణ వేగవంతం చేయడం ద్వారా గుండె కణాలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. అయితే ఇందుకు మొక్కలు కూడా తోడ్పడగలవంటున్నారు స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన వైద్యశాస్త్ర నిపుణుడు జోసెఫ్ వూ. గుండెపోటు వల్ల గుండె ఫెయిల్ కాకుండా ఉండడానికి ఆక్సిజన్‌ను అందించేందుకు ఆయన ఓ కొత్త పద్ధతిని కనిపెట్టారు.



మొక్కలు సూర్యకాంతిని ఉపయోగించుకుని కార్బన్ డై ఆక్సైడ్‌ను ఆక్సిజన్‌గా మార్చే కిరణజన్య సంయోగ క్రియ ఈ పరిశోధనలో కీలకమైనది. మొక్కల లాగా కిరణజన్య సంయోగ క్రియ జరుపుకొనే బాక్టీరియాను ఆయన ఈ ప్రయోగం కోసం ఉపయోగించారు. గుండె ఫెయిల్ అయ్యే దశలో ఉన్న ఎలుకల్లోకి ఈ బాక్టీరియాను ఎక్కించారు. ఇప్పుడు ఎలుకల పైకి కాంతిని ప్రసరింపజేశారు. ఈ కాంతిని ఉపయోగించుకున్న బాక్టీరియా కిరణజన్య సంయోగ క్రియ ద్వారా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేశాయి. అందువల్ల ఎలుకల్లో ఇంతకు ముందు కన్నా ఆక్సిజన్ స్థాయిలు 25 వంతులు ఎక్కువ అయ్యాయి.
జోసెఫ్ ఎలుకల్లో చేపట్టిన ఈ పరిశోధన ఆక్సిజన్ లోపం వల్ల దెబ్బతినే కణజాలాలను రక్షించడానికి కొత్త ఆశలు కల్పిస్తున్నది. క్లినికల్ పరీక్షల్లో కూడా ఈ పరిశోధన ఆశించిన ఫలితాలను అందిస్తే హార్ట్ ఫెయిల్యూర్ పేషెంట్లకు ఈ పరిశోధన వరంగా మారనున్నది.

నమస్తే తెలంగాణ
శాస్త్ర
హైదరాబాద్
మంగళవారం 9 జనవరి 2018


స్పేస్ సైన్స్

భూమి లాంటి గ్రహాలు!



నక్షత్ర కూటమిలో ఖగోళ శాస్త్రజ్ఞులు కొత్తగా ఏడు గ్రహాలను కనుక్కున్నారు. ఇవి భూమి పరిమాణంలో ఉన్నాయి. ఇవి అతి చల్లగా ఉన్న టిఆర్ఎపిపిఐఎస్‌టి-1 నక్షత్రం చుట్టూ తిరుగుతున్నాయి. ఇది సూర్యునిలా మండేది కాదు. ఇది గురుగ్రహం పరిమాణంలో ఉండి, చల్లగా ఉండే నక్షత్రం. ఇది మన పృథ్వి నుంచి 40కాంతి సంవత్సరాల దూరంలో ఉండే అక్వేరియస్ నక్షత్ర కూటమిలో ఉంది. ఈ నక్షత్రాన్ని బెల్జియంలోని లీగ్ యూనివర్సిటీకి చెందిన ఖగోళ భౌతిక శాస్త్రజ్ఞుడు మైఖేల్ గిబ్బన్ కనుగొన్నాడు. దానికి అనుబంధంగా సాగిన పరిశోధనలు ఇప్పుడు ఈ ఏడు గ్రహాలను కనుక్కున్నాయి. భూమి లాగా ఉన్న ఈ కొత్త గ్రహాల్లో భూమిపై ఉండే వాతావరణమే గనుక ఉండి ఉంటే అక్కడ కూడా జలాశయాలు ఉండే అవకాశం ఉంటుంది. అదే నిజమైతే ఇక అక్కడ కూడా మనం జెండా ఎగురవేయొచ్చన్నమాట.


అక్కడా నీళ్లున్నాయ్!



మన భూమి పైనే కాదు.. మరో గ్రహం పైన కూడా నీళ్లు ఉన్నట్టు కనుక్కున్నారు ఖగోళ శాస్త్రజ్ఞులు. కాకపోతే ఈ గ్రహం మన సౌర కూటమిలోనిది కాదు. డబ్ల్యుఎఎస్‌పి-121బి అనే గ్రహం మనకు 900 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ప్యూపిస్ కూటమిలో ఉంది. ఈ గ్రహం పైన వేడి నీటి అణువులు ఉన్నట్టు ఇటీవలే తెలిసింది. ఇది వేడి గురుగ్రహాలకు సంబంధించిన గ్రహం ఇది. ఇది గురుగ్రహానికి రెండింతలు పెద్దగా ఉంటుంది. అది ఏ నక్షత్రాని చుట్టూ తిరుగుతుందో దానికి దగ్గరగా ఉంటుంది. ఈ గ్రహం ఉపరితలం పైన 4600 డిగ్రీ ఫారన్‌హీట్ వేడి ఉన్నట్టు గమనించారు. కొన్ని లోహాలను మరిగించేంత వేడి ఇది. నాసా హబుల్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా శాస్త్రవేత్తలు ఈ గ్రహం మీద ఉన్న నీటి అణువులను గుర్తించగలిగారు.

ఇది తెలంగాణ ఫార్ములా

పాల తెలుపు.. ట్యూబ్‌లైట్ వెలుగు.. చీకటి పడిన తర్వాత కూడా పట్టపగలే..కానీ, ఒక్కసారి పాడైతే చాలు.. తీసి పక్కన పడేస్తాం.. అదేం పనికి రాదనుకుంటాం.. అలా పడేయడంలో ప్రమాదమూ లేదనుకుంటాం..కానీ, పడేస్తే పర్యావరణానికే ముప్పు.. ఆదమరిస్తే అది ప్రాణాలను హరించే విషపురుగు..మరి ఈ ప్రమాదాన్ని నియంత్రించలేమా? పర్యావరణాన్ని కాపాడలేమా? ఎందుకు చేయలేమంటున్నారీ సైంటిస్టు నరసింహాచారి. పాడైన ట్యూబ్‌లైట్లను మళ్లీ వెలిగేలా కొత్త టెక్నిక్‌ను కనిపెట్టడమే కాదు.. వాటివల్ల పర్యావరణానికి ఎలాంటి హానీ జరుగకుండా చూస్తానంటున్నారు.ఇంతకీ ఆయన చేసిన పరిశోధన విశేషాలేమిటి? ఆ ఫార్ములా ముచ్చట్లేమిటి?ఆ సంగతుల సమాహారమే ఈ వారం శాస్త్ర స్పెషల్.





ఏడో తరగతి చదువుతున్న ఓ పిల్లవాడు.. కరెంటు బిల్లు కట్టేందుకు ఎలక్ట్రిసిటీ ఆఫీసుకు వెళ్లాడు. లైనులో నిలబడి ఉండగా అక్కడ పాడైపోయిన ట్యూబ్‌లైట్లు కుప్పలుతెప్పలుగా పడి ఉండడం గమనించాడు. వాటిని మళ్లీ వెలిగించేలా ఏదైనా ప్రయోగం చేయాలనుకున్నాడు. కానీ పరిస్థితులు అప్పుడు సహకరించలేదు. అలాగని తన ఆలోచనకు స్వస్తి పలుకలేదు. పాడైపోయిన ఆ ట్యూబ్‌లైట్లను వెలిగించేందుకు పరిశోధనలు కొనసాగించాడు. చివరకు అనుకున్నది సాధించాడు. వాటిలో ఇంకా మెర్క్యురీ ఇంకా మిగిలే ఉందని, మిగిలిపోయిన దాన్ని పనికొచ్చేలా చేసి మళ్లీ వెలిగించొచ్చని గుర్తించాడు. ఒక కొత్త ఫార్ములాను కనిపెట్టాడు. అతడే నర్సింహాచారి. ప్రపంచం తెలియని వయసులో పరిశోధన మొదలుపెట్టిన ఆయన ఇప్పుడు కొత్త ఫార్ములాను రూపొందించి ప్రపంచాన్నే తనవైపు తిప్పుకొన్నాడు. నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన నర్సింహాచారి.. అందరిలాంటి సాధారణ మనిషే. ఆయన ఆలోచనలు మాత్రం అసాధారణమైనవి. ప్రత్యేకమైనవి. అవన్నీ ఏదో ఒకవిధంగా సమాజానికి మేలు చేసేవే కావడం విశేషం. అలా పుట్టుకొచ్చినదే.. చారి ఫార్ములా.

చిన్ననాడే పెద్ద ఆలోచన

పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి నర్సింహాచారి ఆలోచనలు పరిశోధనల చుట్టే తిరిగేవి. అందుకే మూడో తరగతిలోనే చిన్న టేప్‌రికార్డర్ ప్రయోగం చేసి సార్లతో శభాష్ అనిపించుకొన్నాడు. అప్పట్నుంచి అనేక జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్స్‌లో పాల్గొంటూ తన ప్రతిభకు సానపెట్టుకొన్నారు. బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ వరకూ చదువుకున్న ఆయన.. పూర్తిగా తన దృష్టంతా పరిశోధనలపై పెట్టారు.

తెలంగాణ ప్రభుత్వం ఆసరా

చారి ఫార్ములాను తెలంగాణ సర్కారూ మెచ్చింది. ఢిల్లీలో తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి ద్వారా ఈ విషయం తెలుసుకొన్న ముఖ్యమంత్రి కేసీఆర్.. చారి ఫార్ములాను అభినందించారు. ఈ డివైస్ తయారీకి అవసరమయ్యేలా సబ్సిడీ ఇచ్చి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఆదిభట్లలో పరిశ్రమ స్థాపనకు స్థలాన్ని ఇచ్చే విషయం కూడా పరిశీలిస్తున్నది ప్రభుత్వం.

మెర్క్యురీ తినేస్తున్నాం!

పాడైపోయిన ట్యూబ్‌లైట్లను ఎక్కడపడితే అక్కడ పారేస్తుంటారు. అలా పారేయడం చాలా ప్రమాదకరం. అందులో ఉండే పాదరసం (మెర్క్యురీ) ఒక్కసారిగా ఆ పరిసరాల్లో వ్యాపించి.. వాతావరణాన్ని కలుషితం చేయడమే కాదు, మనుషుల్లో క్యాన్సర్ రావడానికి కారణమవుతుంది. పొరపాటున ఒక చోట ట్యూబ్‌లైట్ పగిలిపోతే.. ఆ పరిసరాల్లోకి 45 నిమిషాల వరకు ఎవరూ వెళ్లకూడదు. కానీ ఆ విషయంలో ఎవరికీ సరైన అవగాహన లేకపోవడం వల్ల.. పట్టించుకోవడం లేదంటున్నారు చారి.

మళ్లీ వెలుగుతాయి

నిజానికి ఇప్పుడు పాడైపోయాయనుకొని పడేస్తున్న ట్యూబ్‌లైట్లలో ఉండే రసాయనాలు వందశాతం వినియోగించబడవు. అందులో సగం అలాగే ఉంటాయి. ఆ మిగిలిపోయిన రసాయనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చేసి కాలిపోయిన బల్బును ప్రకాశవంతంగా వెలిగేలా చేసేందుకు చారి రూపొందించిన డివైస్ ఉపయోగపడుతుంది. మరికొన్నేళ్ల పాటు అందులోని కెమికల్స్ పూర్తిస్థాయిలో ఉపయోగింపబడిన తర్వాత.. వాటిని ఎక్కడ డంప్ చేసినా ఎలాంటి ప్రమాసుకోవడానికి గదమూ ఉండదు.

ఆలోచన అద్భుతం..



పాడైపోయిన బల్బులను మళ్లీ వెలిగించవచ్చంటూ నర్సింహాచారి చెప్పిన కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. అది పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే ఆయనకు ఆర్థికంగానూ, వృత్తిపరంగానూ నావంతు సహకారం అందిస్తున్నా.

–రాజశేఖర్, ఇంజినీర్

అందరికీ మంచిదే..

ఈ డివైస్ వల్ల సరిపడినంత విద్యుత్ వినియోగం జరిగి.. ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లపై ఒత్తిడి తగ్గి పేలిపోవడం, కాలిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. అంతే కాదు ఈ ట్యూబ్‌లైట్లలోని రసాయనాలు పూర్తిస్థాయిలో ఖర్చయ్యి.. పర్యావరణానికి ఎలాంటి హానీ జరుగదు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం ఆమోదిస్తే.. మున్సిపాలిటీలు,, గ్రామాల్లో ఎంతో మందికి ఉపాధిని అందించేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు కొన్ని కోట్ల రూపాయలు మిగులుతాయి.

– నర్సింహాచారి, సైంటిస్టు

1 ట్యూబ్‌లైట్..
3 ఎకరాలు

ఒక పాడైపోయిన ట్యూబ్‌లైట్‌లో ఐదు మిల్లీ గ్రాముల మెర్క్యురీ ఉండిపోతుంది. ఒక వేళ ఈ ట్యూబ్‌లైట్‌ను పంటపొలాల్లో పగులగొడితే.. 2 నుంచి 3 ఎకరాల భూమి విషతుల్యమవుతుంది. అందులో పండిన పంటలు కూడా మెర్క్యురీమయం అవుతాయి. వాటిని తినే జీవరాశులకు అంతుచిక్కని రోగాలొస్తాయి. నీటి వనరులనూ కలుషితం చేస్తుందీ మెర్క్యురీ. ఒక ట్యూబ్‌లైట్ 22వేల 685 లీటర్ల నీటిని కలుషితం చేస్తుందట. అందుకే అమెరికాలో ఈ ట్యూబ్‌లైట్‌ను ఎక్కడపడితే అక్కడ పగులగొడితే ఏడేళ్లవరకు జైలు శిక్ష పడుతుంది. మనదగ్గర అలాంటి నిబంధనలు లేవు..

ప్రపంచంలో ఇదొక్కటే ఫార్ములా

చారి రూపొందించిన ఈ కొత్త ఫార్ములా.. అంతర్జాతీయ గుర్తింపును పొందింది. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలు పాల్గొన్న అంతర్జాతీయ వేదికపై.. నర్సింహాచారి రూపొందించిన ఫార్ములాకే పట్టాభిషేకం జరిగింది. దీనికి.. అభ్యంతరాలు లేవనెత్తిన మిగతా అభ్యర్థులతో.. ' ట్యూబ్‌లైట్‌ల వల్ల జరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు నర్సింహాచారి రూపొందించిన ఫార్ములానే వరల్డ్‌లో ది బెస్ట్. అందుకే అతని ఫార్ములానే ఎంపిక చేస్తున్నాం' అన్నారు అక్కడి న్యాయనిర్ణేతలు. అది మన తెలంగాణ శాస్త్రవేత్తకు దక్కిన గొప్ప గౌరవంగా చెప్పవచ్చు.

మోడీ మెచ్చిన 'ఫార్ములా'

నర్సింహాచారి రూపొందించిన ఈ ఫార్ములా.. ప్రధాని నరేంద్ర మోడీకి కూడా నచ్చింది. ఈ ఫార్ములా గురించి తెలుసుకొన్న ప్రధాని.. చారిని ప్రత్యేకంగా అభినందించారు. మోదీని కలిసి ఈ ప్రాజెక్ట్ గురించి వివరంగా తెలియజేశారు చారి. అంతే కాదు తన ప్రాజెక్టు వివరాలను తెలిపేందుకు ఎన్నో కాలేజీలు, యూనివర్సిటీల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వివిధ సంస్థల నుంచి అవార్డులు కూడా అందుకున్నారాయన. బీబీసీలో చారి ఫార్ములాపై ప్రత్యేక కథనం ప్రసారం కావడం విశేషం. ఈ పరిశోధనలో జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డీ) కూడా భాగస్వామిగా ఉన్నది.

ఎల్ఈడీతో పోలిస్తే ఎంతే మేలు

ఎల్ఈడీ అంటే లైట్ ఎమిటింగ్ డయోడ్. దీనిలో ఫిలమెంట్ ఉండదు. దీనితో విద్యుత్ వినియోగం నియంత్రణలో ఉండొచ్చు. కానీ దీనిలో ఉండే లెడ్, ఆర్సెనిక్‌లు మెర్క్యురీ కంటే ప్రమాదకరం. అందుకే కళ్లకు ఏమాత్రం హానిచేయని ట్యూబ్‌లైట్‌ను పూరిస్థాయిలో వినియోగించేలా చేసే ఈ డివైస్ ఎంతో ప్రత్యేకమైనది. అందుకే ప్రపంచానికే మంచి చేసే ఈ ఫార్ములా.. తెలంగాణ ఫార్ములా అంటున్నారు చారి.

...✍ సంతోష్ కుమార్ ప్యాట

📷 విద్యాసాగర్

హెల్త్ సైన్స్

త్రీడీ ప్రింటెడ్ ఇంప్లాంట్స్

మానవ శరీరంలో వెన్నెముక ముఖ్యమైన భాగం. శరీరభాగాలన్నింటికీ అదే సపోర్టు అనుకోవచ్చు. అలాంటి వెన్నుపూస సంబంధిత వైకల్యాలతో చాలామంది ఇబ్బందిపడుతున్నారు. అలాంటి వారికి ఉపశమనం కల్పించేలా ఒక కొత్త టెక్నాలజీ వచ్చేసింది. అదేమిటంటే..

త్రీడీ ప్రింటెడ్ ఇంప్లాంట్స్. వెన్నెముక వైకల్యంతో బాధపడేవారికి ఈ టెక్నికల్ చికిత్స చాలా ఉపయోగకరం అవుతున్నది. టైటానియంతో తయారయ్యే ఈ త్రీడీ ప్రింటెడ్ ఇంప్లాంట్స్ వెన్నుభాగంలో సులభంగా ఒదిగిపోతున్నాయి. వీటి ఉపరితలాలు కఠినంగా ఉండి, చిన్న చిన్న రంధ్రాలతో కూడిన (పోరస్) నిర్మాణాలు కలిగి ఉండి, శరీరంలో తొందరగా ఇమిడిపోయేలా చేస్తున్నాయి. ఈ త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ఇంప్లాంట్‌తో పాటు ఎముక ఎదుగులకు ఉపయోగపడుతుందని, వీటిని తయారు చేస్తున్న కేటూఎమ్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ త్రీడీ ప్రింటెట్ ఇంప్లాంట్స్‌కు ఇప్పటికే ఎఫ్‌డీఏ అనుమతులు కూడా లభించాయి. ఎక్కడైతే వెన్నుపూస భాగాలు తొలగించబడ్డాయో, అక్కడ ఈ ఇంప్లాంట్స్ నిలకడగా పనిచేసి స్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకుంటాయి. అంతేకాదు, ఈ ఇంప్లాంట్స్‌తో దీర్ఘకాలికంగా ఉన్న జాయింట్ల సమస్యను కూడా అధిగమించవచ్చంటున్నారు పరిశోధకులు. వెన్నుసంబంధిత వైకల్యంతో బాధపడుతున్నవారు.. ఈ త్రీడీ ప్రింటెంట్ ఇంప్లాంట్స్‌కు థ్యాంక్స్ చెప్పుకోవాల్సిందే.



గుడ్డుతో ఐక్యూ బిడ్డ!



గర్భవతులు రోజుకు 9 కోడిగుడ్లు తినగలిగితే ఐక్యు ఎక్కువగా ఉండే పిల్లలు పుట్టే అవకాశం ఉందని ఇటీవలి అధ్యయనాలు సూచిస్తున్నాయి. కోడిగుడ్లలో ఉండే కోలిన్ పిల్లలలో సమాచారాన్ని ప్రాసెస్ చేసే సామర్థ్యం, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. సాధారణం కన్నా రెండింతలు ఎక్కువ కోలిన్ గర్భిణులకు అవసరం అవుతుంది. ఒక గుడ్డులో 115 మి.గ్రా. కోలిన్ ఉంటుంది. 930 మి.గ్రా. కోలిన్ తప్పనిసరిగా తీసుకోవాలి. రోజుకి 9 కోడిగుడ్లు తింటే కొలెస్ట్రాల్ ఎక్కువగా వచ్చే అవకాశమూ ఉంటుంది. సాధారణ ఆరోగ్యం కలవారు రోజుకి 480 మి.గ్రా. కోలిన్ తీసుకోవాలి. గర్భిణులు దీనికి రెట్టింపు తీసుకుంటే ఐక్యు ఎక్కువగా ఉండే పిల్లలు పుట్టే అవకాశముంటుందని చెప్తున్నారు అధ్యయనకారులు. కోడిగుడ్డులోనే కాకుండా రెడ్‌మీట్, చేపలు, చికెన్, లెగ్యూమ్స్, నట్స్‌లో కూడా కోలిన్ ఉంటుంది కాబట్టి వీటి ద్వారా కూడా కోలిన్‌ను పొందవచ్చని సూచిస్తున్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌కు బెస్ట్ చికిత్సలు



మనం అనుకుంటున్నట్టుగా బ్రెస్ట్ క్యాన్సర్‌కు ప్రాథమిక చికిత్స సర్జరీనే. కానీ ఇదివరకు బ్రెస్ట్ క్యాన్సర్ అంటే రొమ్ములను పూర్తిగా తొలగించాల్సి ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు.

రొమ్ము తొలగించకుండానే చిన్న చిన్న కణితులను తీసెయ్యవచ్చు. పెద్ద కణితులను కూడా 2.3 సార్లు కీమోథెరపీ ద్వారా సైజు తగ్గించి ఆ తర్వాత ఆపరేషన్ ద్వారా పూర్తిగా తీసేయవచ్చు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ తర్వాత రొమ్ముల ఆకృతి మారకుండా ఉండేందుకు వివిధ రకాల చికిత్సల గురించి ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

ఆంకోప్లాస్టిక్ బ్రెస్ట్ సర్జరీ

ఆంకోప్లాస్టిక్ సర్జరీ అనేది ఆధునిక ప్లాస్టిక్ సర్జరీ, సర్జికల్ ఆంకాలజీ చికిత్సల కలయిక. దీని వల్ల బ్రెస్ట్ క్యాన్సర్‌కు చికిత్స చేయడంతో పాటు బ్రెస్ట్ పూర్వపు ఆకారాన్ని కాపాడుకోవచ్చు.

బ్రెస్ట్ రీకన్‌స్ట్రక్షన్

బ్రెస్ట్ క్యాన్సర్ సర్జరీ వల్ల కలిగ అసహజ ఆకారాన్ని సరిచేసేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది

బ్రెస్ట్ ఇంప్రూవ్‌మెంట్

బాడీ జెట్ టెక్నిక్ అనేది అన్నింటికంటే సురక్షితమైన, అత్యాధునికమైన పద్ధతి. దీని వల్ల శాశ్వత ప్రాతిపదిపై బ్రెస్ట్ సైజ్‌ను పెంచవచ్చు. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి ఎప్పుడైనా బ్రెస్ట్ సైజ్ మరింతగా పెంచుకోవచ్చు. ఇందుకోసం వివిధ రకాలైన ఇంప్లాంట్స్ అందుబాటులో ఉంటాయి.

బ్రెస్ట్ లిఫ్ట్

ఈ ప్రక్రియను చనుమొనల చుట్టూ ఉండే ఎర్రని భాగంలో చిన్న ఇన్‌సిషన్ ద్వారా నిర్వహిస్తారు. కొన్ని సందర్భాలలో రొమ్ముల పరిమాణం తగ్గించడానికి కూడా ఉపయోగిస్తారు.

క్యాన్సర్ తిరిగి రాకుండా..

సర్జరీ తర్వాత మిగిలిపోయిన మైక్రోస్కోపిక్ క్యాన్సర్ కణాలను పూర్తిగా తొలగించడానికి కీమోథెరపీ చేయడం జరుగుతుంది. దీని వల్ల క్యాన్సర్ మరల వచ్చే అవకాశాలను తగ్గించవచ్చు. అధునాత కీమోథెరపీ అణువలు చాలా సురక్షితమనవి. దీని వల్ల కలిగే దుష్ప్రభావాలు తాత్కాలికమైనవి.

- ఒకవేళ క్యాన్సర్ తిరిగి వచ్చే ఆస్కారాలు ఏమైనా ఉన్నా వాటిని తగ్గితంచవచ్చు. అధునాతన కీమోథెరపీ మందులు చాలా సురక్షితమైనవి. వీటితో దుష్ప్రభావాలు తాత్కాలికమైనవి.
- ఒకవేళ క్యాన్సర్ కణాలు హెచ్ఈఆర్ –2 అనే ప్రొటీన్‌కు పాజిటివ్‌గా ఉంటే, అటువంటి రోగులకు వారానికి ఒకసారి లేదా 3 వారాలకు ఒకసారి మోనోక్లోనల్ యాంటి బాడీ థెరపీని నిర్వహిస్తారు. ఈ థెరపీ స్టేజ్ –4 క్యాన్సర్‌లో కూడా ఉపయోగించవచ్చు. అయితే ఇది కొంచెం ఖర్చుతో కూడుకున్నది.
- కొన్ని సందర్భాలలో హార్మోన్ థెరపీని సుమారుగా 5 సంవత్సరాల వరకు ఇవ్వాల్సి రావచ్చు.
- వీఎంఏటీ (వాల్యూమెట్రిక్ మాడ్యూలేటెడ్ ఆర్క్‌థెరపీ)క్యాన్సర్ చికిత్సలో అత్యాధునికమైన విధానం. ఇది రేడియేషన్ డోసును గణనీయంగా తగ్గిస్తుంది. దీని చికిత్సా సమయం చాలా తక్కువ (2 నిమిషాల కంటే తక్కువ).

పెట్ సీటీ

అధునాతనమైన పెట్‌సీటీ స్కాన్ వల్ల రొమ్ములలో 2 మల్లీమీటర్ల కంటే చిన్న కణితులను కూడా గుర్తించవచ్చు.

డిజిటల్ మమ్మోగ్రఫీ

డిజిటల్ మమ్మోగ్రఫీ అనేది కంప్యూటర్‌కి అనుసంధానించబడిన ఆధునిక ఎక్స్‌రే మిషన్. దీని వల్ల రేడియేషన్ డోసు 50 శాతం వరకు తగ్గుతుంది. ఒకనిమిషం కంటే తక్కువ సమయంలోనే ఇమేజ్‌లను అందజేస్తుంది.



డాక్టర్ సీహెచ్. మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
9848011421

గుండెను రక్షించే స్మార్ట్‌ఫోన్



గుండెను రక్షించే స్మార్ట్ ఫోన్ ఏంటి? అనుకుంటున్నారా! ఆ వివరాలు తెలియాలంటే.. ఇది చదువండి.

అధునాతనమైన ఒక వాచ్‌ని చేతికి ధరించడం బాగానే ఉంటుంది. అదే వాచ్‌ని గుండెమీద పెట్టుకొంటే అది ఇంకా అదుర్స్ అనిపిస్తుంది. అదే ఈ కొత్త టెక్నాలజీతో తయారైన ఎలక్ట్రానిక్ డివైస్. గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు.. దీన్ని ఛాతీపై అమర్చుకొంటే గుండె పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అదెలాగంటే, స్మార్ట్‌వాచ్‌లా ఉండే ఈ డివైస్ స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానమై ఉంటుంది. ఎప్పటికప్పుడు గుండె పనితీరును సమీక్షిస్తూ, నెలవారీ రిపోర్టులను డైరెక్టుగా డాక్టరుకు పంపిస్తుంది. ఎఫ్‌డీఏ క్లియరెన్స్ కోసం ఎదురుచూస్తున్న ఈ యాపిల్ వాచ్.. త్వరలోనే మార్కెట్‌లోకి రాబోతున్నది. ఈ యాపిల్ వాచ్ బ్యాండ్ మీద ఒక ఫింగర్‌తో టచ్ చేయడం ద్వారా.. మెడికల్ గ్రేడ్ ఎలక్ట్రోకార్డియోగ్రామ్స్‌ను తెలుసుకోవచ్చు. తద్వారా గుండె పనితీరును తెలుసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అవసరమైన వైద్యసేవలనూ పొందవచ్చు. ఒక్కోసారి రోగి రక్తంలో పొటాషియం స్థాయి ఒక్కసారిగా పడిపోయి.. హఠాన్మరణం సంభవించవచ్చు. అలాంటి పరిస్థితుల్లో ఈ టెక్నాలజీ బాగా ఉపయోగపడుతుందంటున్నారు పరిశోధకులు. ఇప్పుడర్థమైందా గుండెను స్మార్ట్‌ఫోన్‌తో ఎలా మానిటరింగ్ చేయొచ్చో.

సుడోకు

డైలీ సుడోకు 94 సమాధానం

7	9	4	2	3	8	1	6	5
5	3	1	7	6	4	9	2	8
2	8	6	5	1	9	7	4	3
3	7	8	4	2	1	5	9	6
1	4	9	8	5	6	2	3	7
6	2	5	3	9	7	8	1	4
8	1	2	6	4	5	3	7	9
4	5	3	9	7	2	6	8	1
9	6	7	1	8	3	4	5	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -95

	5	1			8	3		
3		6				9	2	1
				4	9		1	
	9	4	8		1	2	5	
	7		5	6				
5	3	7				1		9
		2	9			5	7	

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
మంగళవారం 9 జనవరి 2018

భాగమతి అడ్డా!

‘ఎవ్వడు పడితే వాడు రావడానికి, ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమన్నా పశువుల దొడ్డా? భాగమతి అడ్డా? లెక్కలు తేలాలి. ఒక్కడ్ని పోనివ్వను’ అంటూ ప్రళయకాళిలా విరుచుకు పడుతూ అనుష్క చెబుతున్న శక్తివంతమైన సంభాషణలు తాజా ‘భాగమతి’ చిత్ర టీజర్‌లో ప్రేక్షకుల్ని రొమాంచితుల్ని చేస్తున్నాయి. అనుష్క టైటిల్ రోల్‌ని పోషిస్తున్న ఈ చిత్రానికి అశోక్ దర్శకుడు. వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. విడుదలైన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. అనుష్కను నవ్యపంథాలో ఆవిష్కరించే చిత్రమిది. ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం’ అన్నారు. వ్యవస్థను సంస్కరించాలనుకున్న ఓ మహిళకు అసాంఘిక శక్తుల నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? వాటన్నంటిని అధిగమించి ఎలా విజయం సాధించింది? అన్నదే చిత్ర ఇతివృత్తమని దర్శకుడు చెప్పారు. ఉన్ని ముకుందన్, జయరాం, ఆశాశరత్, మురళీశర్మ, ధన్‌రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖ రామన్, దేవ దర్శిని, తలైవాసల్ విజయ్, అజయ్ ఘోష్, మధునందన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మథి, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అశోక్.


అనుష్క

నువ్వే నా ప్రేమిక


తమన్నా, కల్యాణ్‌రామ్

‘మీరా ఓ రేడియో జాకీ. ప్రేమ కథలన్నా, ప్రేమను గురించి మాట్లాడటమన్నా ఆమెకు చాలా ఇష్టం. మీరాకు ఓ ప్రేమకథ ఉంది. వరుణ్ అనే యువకుణ్ణి ఆమె ప్రాణంగా ప్రేమిస్తుంటుంది. ఆ జంట కథేమిటో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే’ అంటున్నారు కల్యాణ్‌రామ్. ఆయన కథానాయకుడిగా కూల్‌బ్రీజ్ పతాకంపై ఓ సినిమా తెరకెక్కుతున్నది. జయేంద్ర దర్శకుడు. కిరణ్ ముప్పవరపు, విజయ్ వట్టికూటి నిర్మిస్తున్నారు. మహేష్ కోనేరు సమర్పకుడు. ఈ చిత్రానికి ‘నా నువ్వే’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సోమవారం చిత్రబృందం టైటిల్ టీజర్‌ను విడుదల చేసింది. గత చిత్రాలకు పూర్తిభిన్నంగా క్లాస్‌లుక్‌తో కల్యాణ్‌రామ్ ఈ టీజర్‌లో కనిపిస్తున్నారు. స్టైలిష్‌గా, సహజత్వాన్ని ప్రతిబింబిస్తూ అతడి పాత్ర సాగుతున్నది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ‘రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. కల్యాణ్‌రామ్, తమన్నా కెమిస్ట్రీ, పీసీ శ్రీరామ్ ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి’అని తెలిపారు. చిత్ర సమర్పకుడు మహేష్‌కోనేరు మాట్లాడుతూ ‘ప్రేమ, యాక్షన్, వినోదం అంశాలతో ముడిపడిన కథ ఇది. ఈ నెలాఖరుతో చిత్రీకరణ పూర్తవుతుంది. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం’ అని చెప్పారు. తనికెళ్లభరణి, పోసాని కృష్ణమురళి, వెన్నెల కిషోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శరత్, సినిమాటోగ్రఫీ: పీసీ శ్రీరామ్, ఎడిటింగ్: టి.ఎస్. సురేష్.

నాని చిత్రలహరి



1990 దశకంలో దూరదర్శన్‌లో ప్రసారమయ్యే చిత్రగీతాల కార్యక్రమం చిత్రలహరి గొప్ప ప్రాచుర్యాన్ని సంపాదించుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ పేరుతో నాని కథానాయకుడిగా ఓ సినిమా రూపొందనున్నట్లు తెలిసింది. సెకండ్‌హ్యాండ్, నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ చిత్రాలతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు కిషోర్ తిరుమల. తన తదుపరి చిత్రాన్ని ఆయన హీరో నానితో చేయబోతున్నట్లు తెలిసింది. సున్నితమైన ప్రేమకథగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి ‘చిత్రలహరి’ అనే పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

నిఖిల్ కు జోడీగా..


కేథరీన్

తెలుగు, తమిళ భాషల్లో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో కెరీర్‌ను ప్రారంభించింది కేథరీన్. అవి అంతగా కలిసి రాకపోవడంతో ఆపై గ్లామర్ బాట పట్టింది. సరైనోడు, నేనే రాజు నేనే మంత్రి, గౌతమ్‌నందాతో పాటు పలు తెలుగు చిత్రాల్లో తన అందచందాలతో ఆకట్టుకున్న ఆమె సక్సెస్‌ఫుల్ హీరోయిన్ల జాబితాలో చేరిపోయింది. గత ఏడాది విడుదలైన ‘జయజానకి నాయక’ చిత్రంలో తొలిసారి ప్రత్యేకగీతంలో కనిపించి అలరించింది. కొత్త ఏడాదిలో కథల ఎంపికలో వైవిధ్యంగా అడుగులు వేస్తున్న కేథరీన్ తాజాగా ఓ తమిళ రీమేక్‌లో నటించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రెండేళ్ల క్రితం తమిళంలో విడుదలైన ‘కనిథన్’ చిత్రం మంచి వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయడానికి చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం నిఖిల్ కథానాయకుడిగా నిర్మాత ఠాగూర్‌మధు ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయబోతున్నట్లు తెలిసింది. అతడికి జోడీగా కేథరీన్‌ను చిత్రవర్గాలు ఎంపికచేసినట్లు సమాచారం. తమిళ మాతృకలో కేథరీన్ నటించడంతో తెలుగులో కూడా ఆమెనే తీసుకున్నట్లు సమాచారం. నకిలీ విద్యా ధృవీకరణ పత్రాలు తయారుచేసే ఓ ముఠా గుట్టురట్టు చేసే పాత్రికేయుడి కథ ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రానికి సంతోష్ దర్శకత్వం వహించనున్నారు.

రెండు మనసుల కథ


గోపి, ప్రకాశ్, తరుణ్, రమేష్

‘హృద్యమైన ప్రేమకథా చిత్రమిది. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం’ అని అన్నారు తరుణ్. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ‘ఇది నా లవ్‌స్టోరీ’. రమేష్-గోపీ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్.వి. ప్రకాష్ నిర్మాత. ఓవియా కథానాయిక. హీరో తరుణ్ పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదలచేశారు. తరుణ్ మాట్లాడుతూ ‘రెగ్యులర్ ప్రేమకథలకు భిన్నంగా ఉండే చిత్రమిది. మూడు భిన్న పార్శ్వాల్లో నా పాత్ర సాగుతుంది’ అని తెలిపారు. ‘ప్రతి మనసును స్పృశించే అందమైన ప్రేమకథా చిత్రమిది. అభిరామ్, శృతి అనే జంట ప్రేమపయనంలో ఎదురైన సంఘటనల సమాహారమే ఈ చిత్ర ఇతివృత్తం’ అని దర్శకద్వయం రమేష్-గోపీ పేర్కొన్నారు. అభిమానుల సమక్షంలో తరుణ్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ విజయ్, ప్రేమ్‌గోపి, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణభవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌గా అశోక్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌గా అశోక్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, సహాయక కమిషనర్ రామ్మోహన్, తెలంగాణ భవన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో రాణించాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు.

బంపర్లు ఉన్నాయా.. బహుపరాక్!

వాహనాలకు అక్రమ బంపర్ల ఏర్పాటుపై కఠినచర్యలు ■ బంపర్ల వల్ల పాదచారులకు ప్రమాదాలు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి ■ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇక నుంచి వాహనాలకు ఇష్టారాజ్యంగా క్రాష్‌గార్డ్స్ (బంపర్లు) పెట్టుకోవడానికి వీల్లేదు. అక్రమంగా, ఫ్యాషన్ కోసం బంపర్లను ఏర్పాటు చేసుకోవడాన్ని నిషేధిస్తూ కేంద్రం ఇటీవల ఒక సర్క్యులర్ జారీచేసింది. భారీ బంపర్ల ఏర్పాటు వల్ల ప్రమాదం జరిగినప్పుడు ముఖ్యంగా పాదచారులకు, వాహనాలలో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలవుతాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని భారీ బంపర్ల ఏర్పాటుపై రాష్ట్రాలు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అక్రమంగా అత్యంత భారీగా బంపర్లను ఏర్పాటు చేసుకోవడం మోటార్ వాహనాల చట్టం 1988లోని 52వ సెక్షన్ ఉల్లంఘన కిందకు వస్తుందని, అదే చట్టంలోని 190, 191 సెక్షన్ల ప్రకారం శిక్షార్హులవుతారని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ డైరెక్టర్ ప్రియాంక్ భారతి ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఆదేశాల మేరకు క్రాష్ గార్డులను తొలగించేందుకు వాహనదారులకు ముందస్తు హెచ్చరికల నోటీసులు జారీ చేయడం, వాటిపై చైతన్య కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నామని రాష్ట్ర రవాణాశాఖ జాయింట్ కమిషనర్ రమేశ్ తెలిపారు. తరువాత స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వాటిని తొలగిస్తామని వివరించారు.

ఆస్ట్రేలియాకు భారత పర్యాటకుల తాకిడి

- 2017లో దాదాపు 3 లక్షల మంది సందర్శన
- రూ.7,200 కోట్లు ఖర్చు చేశారని వెల్లడించిన ఆస్ట్రేలియా పర్యాటక శాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆస్ట్రేలియాలో పర్యటించే భారతీయుల సంఖ్య 2016తో పోల్చితే 2017లో 15 శాతం పెరిగిందని ఆస్ట్రేలియా పర్యాటకశాఖ వెల్లడించింది. 2017 అక్టోబర్ నాటికి దాదాపు 2.94 లక్షల మంది భారత సందర్శకులు తమ దేశంలో పర్యటించారని తెలిపింది. 2020 నాటికల్లా ప్రతి ఏడాది మూడులక్షల మంది భారతీయులు పర్యటించాలన్న లక్ష్యాన్ని మూడేండ్ల ముందే చేరుకున్నామని పేర్కొన్నది. భారత్ పర్యాటకులు 2017లోనే సుమారు రూ.7,200 కోట్లు తమ దేశంలో ఖర్చుచేశారని వెల్లడించింది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ఇమ్మిగ్రేషన్ అధికారి తానియా గిల్లాక్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లోనే అర్హులకు పర్యాటక వీసాలను మంజూరుచేశామని, 24 గంటలపాటు వీసా దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, ఎలక్ట్రానిక్ విధానంలో చెల్లింపులను అనుమతిస్తున్నామని తెలిపారు. ఆస్ట్రేలియాలో పర్యటించేందుకు భారతీయులను ప్రోత్సహించడానికి 'దేర్ ఈజ్ నథింగ్ లైక్ ఆస్ట్రేలియా' పేరిట ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు.



సోమవారం ముంబైలో మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును కలిసి మేడారం జాతరకు ఆహ్వానిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే టీ రాజేశ్వరరావు తదితరులు



సోమవారం జైళ్లశాఖ డీజీ కార్యాలయంలో జైళ్లశాఖ వార్షిక నివేదికను విడుదల చేస్తున్న డీజీ వీకే సింగ్

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే సంస్కరణలు

- తెలంగాణ జైళ్లపై బీపీఆర్డీ అధ్యయనం
- వార్షిక నివేదిక విడుదల చేసిన రాష్ట్ర జైళ్లశాఖ డీజీ వీకే సింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో జైళ్లలో చేపడుతున్న సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, వీటిని దేశవ్యాప్తంగా అమలుచేసేందుకు వీలుగా ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ పోలీసు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్డీ) అధ్యయనం చేస్తున్నదని జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ తెలిపారు. జైళ్లశాఖ 2017లో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి వార్షిక నివేదికను సోమవారం హైదరాబాద్‌లోని జైళ్లశాఖ డీజీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో విడుదల చేశారు. జైళ్లలో అవినీతిని తగ్గించేందుకు తీసుకున్న నిర్ణయాలు ఫలితాలిచ్చాయని,అవినీతిపై 2015లో 11 ఫిర్యాదులు రాగా, 2016లో 4, 2017లో రెండు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయన్నారు. అవినీతికి పాల్పడినవారిపై శాఖాపరంగా కఠినచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్షమాభిక్ష అంశంపై ప్రభుత్వం ఇటీవలే ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిందని, గతంలో అమలైన విధివిధానాలను చర్చించినట్టు తెలిపారు. జైళ్లలో ఖైదీలలో మార్పులు తీసుకువచ్చేందుకు చేపడుతున్న సంస్కరణలతో రెండోసారి నేరంచేసి తిరిగి జైలుకు వచ్చేవారి సంఖ్య గణనీయంగా తగ్గిందని వీకే సింగ్ వివరించారు. 2016లో రాష్ట్రంలోని జైళ్లలో 6,259 మంది ఖైదీలు ఉండగా, 2017లో ఆ సంఖ్య 5,474కు తగ్గిందన్నారు. ఖైదీలలో మానసిక ప్రవర్తన తీసుకువచ్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2014లో 16,403 మంది ఖైదీలకు విద్యనందించగా, 2017లో 32,514 మందికి సర్వశిక్ష అభియాన్ ద్వారా విద్యనందించినట్టు తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహంతో జైళ్లశాఖ పరిధిలోఉన్న పరిశ్రమలు, పెట్రోల్‌బంక్‌ల ద్వారా మంచి ఆదాయం వస్తున్నదన్నారు. 2014లో రూ.3.07 కోట్ల ఆదాయం ఉండగా, 2017లో రూ. 15కోట్లకు చేరిందన్నారు. 2018లో రూ. 30కోట్ల లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. త్వరలో పెట్రోల్ బంక్‌ల సంఖ్యను వందకు పెంచుతామని డీజీ వీకే సింగ్ చెప్పారు. జైళ్లలో ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. పోలీసు, జీహెచ్ఎంసీ సహాయంతో హైదరాబాద్‌లో భిక్షాటన చేస్తున్న 1,818 మందిని చేరదీసి, చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లలో ప్రత్యేకంగా నిర్మించిన ఆనందాశ్రమంలో ఆశ్రయం కల్పించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా జైళ్లశాఖ 2018 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. సమావేశంలో ఐజీ ఏ నరసింహ, డీఐజీ సైదయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు డిగ్రీ కాలేజీల ప్రక్షాళన

- కొత్త కాలేజీలు, కొత్త కోర్సులకు అనుమతి లేదు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దుర్వినియోగం చేయొద్దు
- యాజమాన్యాలకు, తల్లితండ్రులకు సూచన
- టీఎస్ క్వాలిటీ ఇంప్లిమెంట్ ప్రోగ్రాంకు శ్రీకారం
- ఉన్నత విద్యామండలి పాలకమండలి భేటీలో నిర్ణయాలు



సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అవసరానికి మించి ఏర్పాటైన ప్రైవేటు డిగ్రీ కళాశాలను ప్రక్షాళన చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. కాలేజీలు ఎక్కువగా ఉండటం వల్ల సరైన ప్రమాణాలు పాటించలేకపోవడంతోపాటు నాణ్యమైన విద్యను అందించలేక పోతున్నాయని పాలకమండలి నిర్ధారణకు వచ్చింది. కాలేజీలు అవసరానికి మించి ఉండటం వల్ల నిర్వహణ వ్యయం వృథా అవుతుందే తప్ప ఎవరికీ, ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని.. ఒకే మండలంలో ఒకటికి మించి కొనసాగుతున్న నాసికరమైన కాలేజీలు ఒక దానిలో ఒకటి విలీనం అవుతే బాగుంటుందని పాలకమండలి సభ్యులు అభిప్రాయపడ్డారు. విలీనంవల్ల నాణ్యమైన విద్య అందడంతోపాటు నిర్వహణ వ్యయం తగ్గుదల, సమర్థులైన బోధకులు అందుబాటులోకి వస్తారని అంచనాకు వచ్చారు. సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి(ఈసీ) సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పలు కీలక అంశాలపై చర్చించారు. గత మూడు విద్యాసంవత్సరాల నుంచి కొత్తగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు అనుమతి ఇవ్వడం లేదని, ఈసారి కూడా కాలేజీలు, అదనపు కోర్సులకు అనుమతించే ప్రసక్తే లేదని పాపిరెడ్డి స్పష్టంచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వెయ్యికి పైగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో 450 నుంచి 500 కాలేజీ వరకు నాణ్యంగా కొనసాగుతున్నాయని, మిగిలిన ప్రైవేటు డిగ్రీ కాలేజీల పరిస్థితి బాగా లేదని తెలిపారు. మంచిగా నడిచే కాలేజీల్లో ఇతర కాలేజీలను విలీనం చేసే అంశంపై యాజమాన్యాల సంఘం ప్రతినిధులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. నాసిరకం డిగ్రీ కాలేజీల ప్రక్షాళనకు సంక్రాంతి తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని వివరించారు. ఇంటర్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్య పెద్దగా పెరుగడం లేదని తెలిపారు. అన్నిరకాల డిగ్రీ కాలేజీల్లో కలిపి 4.10 లక్షలకు పైగా సీట్లు ఉండగా.. 1.80 లక్షలకు పైగా సీట్లు మిగులుతున్నాయని వెల్లడించారు. డిగ్రీ సీట్లు మిగిలే అవకాశం లేకుండా మండలం, జిల్లా, యూనివర్సిటీల వారీగా లెక్కలను సేకరిస్తున్నామని చెప్పారు. ఉన్నత విద్యాభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (టీఎస్-క్యూఐపీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పాలకమండలి సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించామని వివరించారు. దీనిద్వారా బోధనలో ఆధునిక పరిజ్ఞానంపై ఎప్పటికప్పుడు మెళకువలు నేర్పించడంతోపాటు అవసరమైన శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. ఉత్తమ అధ్యాపకుల అవార్డులు, యూనివర్సిటీల్లో ఇంక్యూబేషన్ కేంద్రాల ఏర్పాటు, అధ్యాపక పోస్టుల భర్తీ, ఉన్నత విద్యామండలిలో చైర్మన్, వైస్ చైర్మన్, సెక్రటరీ పోస్టుల భర్తీ, ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై పాలకమండలి సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

ఐఏఎస్‌ల పదోన్నతులపై వివరణ ఇవ్వండి..!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు క్యాట్ నోటీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర సివిల్ సర్వీసు అధికారుల నుంచి ఐఏఎస్ పదోన్నతులకు సంబంధించి వివరణ ఇవ్వాలని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర సివిల్ సర్వీస్ అంటే సరిగా నిర్వచించకుండా.. కేవలం డిప్యూటీ కలెక్టర్లనే ఐఏఎస్ పదోన్నతులకు పరిగణించడంపై గ్రూప్-1 క్యాడర్‌కు చెందిన రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి పద్మజారాణి క్యాట్‌లో పిటిషన్ వేశారు. సోమవారం వాదనలు విన్న జస్టిస్ కాంతారావు, మిన్నీ మాథ్యూలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ.. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ.. తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (టాస్) ఏర్పాటు కోసం కమిటీని నియమించిన ప్రభుత్వం.. టాస్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వివరించారు. తెలంగాణ సివిల్ సర్వీస్ అంటే నిర్వచించకుండా పాత పద్ధతిలో రెవెన్యూ వారికే ఐఏఎస్ పదోన్నతులను కట్టబెట్టడం, రాష్ట్ర సర్వీస్ అంటే రెవెన్యూ సర్వీస్ మాత్రమే అన్నట్టుగా ఎటువంటి ఉత్తర్వులు లేకుండా.. నిబంధనలను పట్టించుకోకుండా.. కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతులు చేపట్టడం సహా న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు యూపీఎస్సీ, డీవోపీటీలకు నోటీసులు జారీచేసింది.



సాంకేతిక విద్యాశాఖకు బదిలీపై వెళ్తున్న నవీన్ మిట్టల్‌ను సన్మానిస్తున్న సమాచారశాఖ అధికారులు, సిబ్బంది

అందరి సహకారంతోనే కమిషనర్‌గా రాణించా..

కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్‌గా విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనను సమాచారశాఖ అధికారులు, సిబ్బంది మాసబ్‌ట్యాంక్‌లోని సమాచారభవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ.. సమాచారశాఖ సిబ్బంది సంపూర్ణ సహకారం వల్లనే తను కమిషనర్‌గా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లగలిగానన్నారు. ఈ శాఖ ఇతర అన్ని శాఖలతో సంబంధం కలిగిఉండడంతో ఎంతో కీలకమైందని చెప్పారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినపుడు ఇక్కడి అధికారులు, సిబ్బంది ఏపీ సమాచారశాఖతో పోల్చి, తమకు సౌకర్యాల కొరత ఉందని ఫిర్యాదు చేసేవారని, అయితే పరిస్థితి తారుమారైందన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చడంతో సిబ్బంది పనితీరు మెరుగుపడిందని చెప్పారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సిబ్బంది సహకారంతో గత నవంబర్‌లో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించగలిగామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రామ్మోహన్‌రావు, సమాచారశాఖ అదనపు సంచాలకులు కే నాగయ్య, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కిషోర్ బాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన కులాల ఆర్థిక ప్రగతికి చర్యలు

ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వెనుకబడిన కులాల ఆర్థిక ప్రగతికి సర్కారు చర్యలు చేపట్టిందని తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం సంక్షేమభవన్ ప్రాంగణంలో గంగిరెద్దు కులస్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతులకు చెందిన కులాలవారు ఆర్థికంగా, సామాజికంగా బలపడేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నదని, అన్ని కులవృత్తులకు గౌరవం పెంచేలా ప్రోత్సాహక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గంగిరెద్దుల ఆట బిక్షం కోసం కాదని, అదివారి కుల వృత్తి అన్న విషయాన్ని అందరూ గుర్తించాలని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించినట్టు తెలిపారు. గంగిరెద్దుల ప్రదర్శనతో పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురయ్యాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం అండతో ప్రస్తుతం ఆ సమస్యలు లేవని, ప్రభుత్వానికి రుణపడి ఉంటామని కుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ సీఈవో అలోక్‌కుమార్, కార్పొరేటర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని అధికారం నుంచి తప్పిస్తాం

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతీయ జనతాపార్టీని అధికారం నుంచి తప్పించడమే తమ కర్తవ్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. హిందుత్వ శక్తుల దాడులపై పోరాటాలు చేయడం చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. విజయవాడలో జరుగుతున్న జాతీయ సమితి సమావేశాల్లో సోమవారం ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడాలనుకొనే రాజకీయ, రాజకీయేతర శక్తులతో కలిసి విశాల ఐక్యవేదికను ఏర్పాటుచేయాలని.. అందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.

రైతుకు నగదు పంపిణీ ఎలా?

మొదటిపేజీ తరువాయి...

ప్రాథమికంగా అంచనా వేసింది. మే 15 నాటికి రూ.4000 కోట్ల నగదును పెట్టుబడి సాయం కింద రైతులకు నేరుగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైనప్పటికీ.. ఇంత మొత్తంలో నగదు బ్యాంకుల వద్ద ప్రస్తుతం అందుబాటులో ఉంటుందా.. లేదా? అనే అంశం సమావేశంలో పరిశీలనలోకి వచ్చింది. దీనిపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం.

అవినీతిపై ఉక్కుపాదం

నగదు పంపిణీ సమయంలో ఎలాంటి అవినీతికి అస్కారం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కూడా మంత్రివర్గ ఉపసంఘం తీవ్రంగా ఆలోచిస్తున్నది. పెట్టుబడి పంపిణీ సమయంలో అక్రమాలకు పాల్పడే వీఏవోలను సస్పెండ్ చేసేలా విధివిధానాలను సిద్ధం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.42 కోట్ల ఎకరాలకు పెట్టుబడి వ్యయం అందించనున్న నేపథ్యంలో ప్రతి వీఏవో చేతుల మీదుగా సుమారు రూ.2 కోట్ల వరకు రైతులకు అందించనున్నారు. కఠినంగా వ్యవహరించకపోతే పథకం పక్కదారి పట్టే ప్రమాదం ఉన్నదని మంత్రులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేయనున్న వ్యవసాయ పెట్టుబడి సాయం పథకానికి అవసరమైన నగదును సరఫరా చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించినట్లు సమాచారం.

గ్రామాలు, మండలస్థాయి మేళాల్లో నగదు చెల్లింపు

రైతులకు ఇచ్చే నగదు లేదా చెక్కులను గ్రామాలు, మండలాల స్థాయిలో మేళాలు, సమావేశాలు నిర్వహించి రైతులకు ప్రత్యక్షంగా అందచేయాలని మంత్రివర్గ ఉపసంఘంలో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ప్రతిపాదించినట్టు తెలిసింది. ఈటల ప్రతిపాదనను మిగతా మంత్రులు ఆమోదించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టుబడిసాయం కింద ఇచ్చే చెక్కులను బ్యాంకులు పాత బకాయిల కింద జమ చేసుకోకుండా రైతులకు ఇష్టం వచ్చిన బ్యాంకుల్లో చెల్లుబాటు చేసుకునే వీలు కల్పించాలని బ్యాంకర్లను ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఈ సాయాన్ని మొబైల్ వాలెట్ ద్వారా అందించేందుకు గల మార్గాలను పరిశీలించాలని మంత్రి కేటీఆర్ సూచించినట్టు సమాచారం.

బ్యాంకర్ల తీరుపై మంత్రుల అసంతృప్తి

రైతుల పట్ల బ్యాంకులు వ్యవహరిస్తున్న తీరుపై మంత్రివర్గ ఉపసంఘం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వాణిజ్య కోణంలో బ్యాంకులు ఆలోచించడం వల్ల పేదలకు అభివృద్ధి ఫలాలు అందడం లేదని, ఈ పద్ధతి సమంజసం కాదని మంత్రి హరీశ్‌రావు, ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బ్యాంకుల తీరుతో ప్రభుత్వ లక్ష్యం దెబ్బతింటుందని, ప్రభుత్వ పథకాలు అనుకున్న సమయంలో పూర్తి కాలేకపోతున్నాయని, దీనివల్ల బ్యాంకుల పట్ల ప్రజల్లో, సమాజంలో నమ్మకం తగ్గుతుందని మంత్రులు అభిప్రాయపడినట్లు సమాచారం.

దేశమంతా తెలంగాణ వైపు చూస్తున్నది

దేశమంతా తెలంగాణ వైపు చూస్తున్నదని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మొదటి సమావేశంలో అందరి అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 10న మరోసారి సమావేశం అవుతామని చెప్పారు. అందరి అభిప్రాయాలను, సలహాలను పరిగణనలోకి తీసుకొని అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి పోచారం వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, టీ హరీశ్‌రావు, కల్వకుంట్ల తారకరామారావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారులు రాజీవ్‌శర్మ, వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి, ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం జగన్‌మోహన్, తెలంగాణ వ్యవసాయ సహకార కార్పొరేషన్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రతినిధులు , తపాలాశాఖ సీజీఎం, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



సోమవారం సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కేటీఆర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్, హరీశ్‌రావు, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

లక్షా 80 వేల కోట్ల బడ్జెట్!

మొదటిపేజీ తరువాయి...

వస్తున్న ఆదాయంతోపాటు స్టేట్ జీఎస్టీ ద్వారా వచ్చిన ఆదాయం అంతా కలిపి 19 శాతం వృద్ధిరేటు ఉన్నట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. పెరిగిన రాష్ట్ర వృద్ధిరేటును పరిశీలించిన అధికారులు 2018-19 వార్షిక బడ్జెట్ దాదాపుగా రూ.1.80 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలిసింది. బడ్జెట్ ప్రతిపాదనలు మొదట ఈనెల 9వ తేదీవరకు ఆన్‌లైన్‌లో పంపించాలని ఆర్థికశాఖ అన్నిశాఖలను ఆదేశించింది. కానీ ఈ సమావేశంలో కార్యదర్శులు చేసిన విజ్ఞప్తి మేరకు ఈనెల 17వ తేదీ వరకు పొడిగించారు. 17వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితుల్లో ఆయాశాఖలు తమ ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో పంపించాలని ఈ సమావేశంలో అన్ని శాఖల కార్యదర్శులను సీఎస్ ఆదేశించారు. శాఖలవారీగా వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని ఆర్థికశాఖ కార్యదర్శి రామకృష్ణారావు సీఎస్‌కు తెలిపినట్టు సమాచారం. ఆర్థికశాఖ రూపొందించిన ప్రతిపాదనలను సీఎస్ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు అందించనున్నారు. అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలు పరిశీలించిన తరువాత సీఎం కేసీఆర్ బడ్జెట్ కసరత్తుపై సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. దీంతో రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే నిధులు ఎన్ని? ఏయే పథకాల ద్వారా ఎంత రాబోతున్నది? పన్నుల వాటా ఎంత? అనేవి కెలిసిపోతాయి. అలాగే జీఎస్టీ ద్వారా రాష్ట్రం నుంచి కేంద్రానికి ఎంత వెళ్తున్నది? రాష్ట్రానికి ఎంత వస్తుంది? అన్న విషయంలో కూడా స్పష్టత వస్తుందని ఆర్థికశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1వ తేదీ తరువాతనే రాష్ట్ర బడ్జెట్ పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోవడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు.

ఉద్యోగుల సంపూర్ణ వివరాలివ్వాలి

కార్యదర్శుల సమావేశంలో ఆర్థికశాఖ అన్నిశాఖల నుంచి మూడురకాల సమాచారాన్ని ప్రత్యేకంగా ఇవ్వాలని అడిగింది. ఆర్థికశాఖ వివిధ శాఖల నుంచి సేకరించిన ఉద్యోగుల సమాచారాన్ని సీజీజీ పోర్టల్‌లో ఉంచామని, వాటిని సరిచూసుకొని ఏమైనా తేడాలుంటే తెలుపాలన్నారు. వివిధ ఇంజినీరింగ్ శాఖల్లో వర్క్‌చార్జ్‌డ్, డెయిలీవేజ్, ఫుల్‌టైం, కాంటింజెంట్, అంగన్‌వాడీలు, హోంగార్డులు, వీఆర్‌ఏల వివరాలు తెలుపాలన్నారు. అలాగే ఉద్యోగుల పదవీ విరమణ, జాయినింగ్ తేదీలతో పాటు అన్నిరకాల వివరాలు ఇవ్వాలని కోరింది. కారుణ్య, బ్యాక్‌లాగ్ పోస్టులు తదితర నియామకాల వివరాలన్నీ ఇవ్వాలని, ఖాళీల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. అలాగే యూనివర్సిటీలు, ఇతర సంస్థలలో జరిగిన నియామకాలు, ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. యూనివర్సిటీలు, కార్పొరేషన్లు, డైరెక్టరేట్లు తదితర సంస్థలు, కార్యాలయాలకు చెందిన బ్యాంకు అకౌంట్ వివరాలు పూర్తిగా ఇవ్వాలని తెలిపింది. చాలా సంస్థలు ప్రభుత్వం ఇచ్చిన అకౌంట్లు కాకుండా ఇతర అకౌంట్లు కూడా నిర్వహిస్తున్నారని, ఇలా చేయడం అక్రమాలకు పాల్పడడమే అవుతుందని ఆర్థికశాఖ హెచ్చరించింది.

రాష్ట్రాల పురోగతిని బట్టి కేంద్ర ఇన్సెంటివ్

రాష్ట్రాల పురోగతిపై ఆధారపడి కేంద్రం ఇన్సెంటివ్ గ్రాంట్స్ ఇవ్వనున్నదని, దీనికోసం కేంద్రం కొన్ని అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ తెలిపారు. 15వ ఆర్థికసంఘం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి అత్యధిక నిధులు పొందేలా అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన వివరాలను ఆర్థికశాఖకు సమర్పించాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక సంఘానికి సమర్పించాల్సిన మెమొరాండంలో పొందుపర్చాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిశాఖ ఖచ్చితమైన సమాచారంతో నివేదిక ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థలకు గ్రాంట్లు, టాక్స్ రీవాల్యూయేషన్ వివరాలు జిల్లాలవారీగా అభివృద్ధి, వివిధ అంశాలలో సాధించిన ప్రగతి, స్ట్రాటజీ డెవలప్‌మెంట్ గోల్స్, ఆదాయవ్యయాలు, పన్నులవసూలు తదితర అంశాలపై ఏవిధంగా నివేదికలు ఉండాలో తెలియజేశారు.



సోమవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

గణతంత్ర వేడుకలపై సమీక్ష

సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సంబంధిత అధికారులతో సోమవారం సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకొని, పనుల పర్యవేక్షణతో పాటు, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా సీఎస్ అధికారులకు సూచించారు. ఈ వేడుకలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. వేడుకలకు అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయడంతోపాటు, ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని పోలీసుశాఖను ఆదేశించారు. పరేడ్‌గ్రౌండ్స్‌లో పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని, గన్‌పార్క్, క్లాక్‌టవర్, ఫతేమైదాన్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించాలని జీహెచ్ఎంసీకి సూచించారు. ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో బారికేడ్ల ఏర్పాటుతోపాటు రాజ్‌భవన్, సెక్రటేరియట్, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్ సహా ఇతర చారిత్రక ప్రాధాన్యం ఉన్న భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు. విద్యుత్ శాఖ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా, మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా మంచినీటి సరఫరా, సమాచారశాఖ ద్వారా మీడియాకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ నిధుల సత్వర వ్యయం

ఎస్సీ, ఎస్టీ నిధుల వ్యయాన్ని వేగవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డితోపాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, రాజేశ్వర్‌తివారి, చిత్రారామచంద్రన్, ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, అధర్‌సిన్హా, రజత్‌కుమార్, శాలినీమిశ్రా, సోమేశ్ కుమార్, శశాంక్‌గోయల్, రాజీవ్‌త్రివేది, వికాస్‌రాజ్, జయేష్‌రంజన్, కార్యదర్శులు బీ వెంకటేశం, పార్థసారథి, దానకిషోర్, సందీప్ సుల్తానియా, శివశంకర్, జగదీశ్వర్, బెనహర్ మహేష్‌దత్ ఎక్కా, సవ్యసాచి ఘోష్, ఆర్వీ చంద్రవదన్, కమిషనర్ నీతూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీలో గవర్నర్‌కు వైద్య పరీక్షలు

గాంధీ దవాఖాన: సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో గవర్నర్ నరసింహన్ సోమవారం చెవికి సంబంధించిన చికిత్స పొందారు. దవాఖానలోని ఈఎన్టీ ఓపీ విభాగానికి చేరుకున్న గవర్నర్‌ను ఈఎన్టీ హెచ్‌వోడీ డాక్టర్ హన్మంతరావు పూర్తిగా పరిశీలించారు. చెవిలో డస్టు ఏర్పడటంతో లిక్విడ్‌తో శుభ్రం చేశారు. అనంతరం గవర్నర్ దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేసిన 65 పడకల ఐసీయూను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణ చాలా బాగున్నదని మెచ్చుకున్నారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నా చక్కటి వైద్యం అందిస్తున్నారని, ఇలాగే కొనసాగించాలని డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహ్మారావుకు సూచించారు.

100 కోట్లతో ఎంఎన్‌జే భవనాలు

- కార్పొరేట్‌ను తలదన్నేలా ఏడంతస్తులుగా నిర్మాణం
- మహిళలకోసం ప్రత్యేక బ్లాక్.. పరిశోధనా కేంద్రం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అత్యాధునిక చికిత్స అందించేందుకు కొత్తగా క్యాన్సర్ పరిశోధనా కేంద్రంతో పాటు మహిళా రోగుల కోసం ప్రత్యేక భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన పక్కనే ఉన్న మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌లో కొత్త భవన సముదాయాన్ని నిర్మించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన ఇప్పటికే కార్పొరేట్‌కు ధీటుగా వైద్యసేవలు అందిస్తున్నది. దీనిని అదనంగా దాదాపు 4.2 ఎకరాల విస్తీర్ణంలో ఏడంతస్తుల్లో కార్పొరేట్ హంగులతో నిర్మించనున్నారు. రెండు బ్లాకులుగా నిర్మించనున్న ఈ భవనాల్లో ఎయిమ్స్ తరహాలో అత్యాధునిక వైద్యపరికరాలు, మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.100 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

పరిశోధన, మూలకణాల మార్పిడి కేంద్రాలు

నూతన భవనాలను రెండు బ్లాక్‌లుగా నిర్మిస్తుండగా.. 'బ్లాక్-ఏ'లో జన్యు పరిశోధనా కేంద్రం, బోన్‌మ్యారో, స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంట్(మూలకణాల మార్పిడి), పీడియాట్రిక్ ఆంకాలజీ, రోబోటిక్ సర్జరీ, పాలియేటివ్ కేర్ తదితర విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. 'బ్లాక్-బీ'ని పూర్తిగా మహిళా రోగుల కోసం కేటాయించనున్నారు. మహిళలకు సంబంధించిన అన్నిరకాల క్యాన్సర్ పరీక్షలు, చికిత్సను ఈ బ్లాక్‌లోనే అందించనున్నారు. పాత భవనాన్ని, కొత్త భవనాలను కలుపుతూ వంతెన ఏర్పాటు చేయనున్నారు.



నూతన భవన సముదాయం నమూనా చిత్రం

ఆసియాలోనే నంబర్‌వన్‌గా నిలిచేలా..

ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానను ఆసియాలోనే నంబర్‌వన్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే కార్పొరేట్ తరహాలో 'ట్రూభీమ్' వంటి యంత్రాలతో రేడియేషన్ థెరపీ అందిస్తున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పడకల సామర్థ్యాన్ని 250 పకడల నుంచి 450కి పెంచారు. దవాఖానలో సరైన వసతులు, వైద్యపరికరాలు రోగులు ఇబ్బంది పడుతుండటాన్ని గుర్తించి సీఎం కేసీఆర్, వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేశారు. దీంతో రోగులు కార్పొరేట్‌కు బదులు ఎంఎన్‌జేవైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో ఓపీ 300 వరకు ఉండగా ఇప్పుడు 500 దాటుతున్నది. దవాఖానలో చికిత్స పొందుతున్నవారి సంఖ్య 600 వరకు ఉన్నది. **- డాక్టర్ జయలత, డైరెక్టర్, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన**

గ్రేటర్‌లో ఎల్‌ఈడీ వెలుగులు

- పార్కులు, ప్రార్థనాస్థలాలు మినహా అంతటా పూర్తి
- 15 రోజుల్లో అంతా సిద్ధం.. ప్రారంభానికి ఏర్పాట్లు
- పూర్తిగా ఎల్ ఈడీ లైట్లు ఏర్పాటుచేసిన నగరం మనదే



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు ప్రాజెక్టు కొన్ని పార్కులు, ప్రార్థనాస్థలాలు, చిన్నాచితకా గల్లీలు మినహా నగరమంతా పూర్తయింది. ముఖ్యంగా ప్రధాన మార్గాలు, వాటి అనుబంధ మార్గాలన్నీ ఎల్‌ఈడీ లైట్లతో వెలిగిపోతున్నాయి. మరో 15 రోజుల్లో మిగిలిన చోట్ల కూడా లైట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగిస్తున్నారు. అత్యంత ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని 4.53 లక్షల సంప్రదాయ లైట్లస్థానంలో ఎల్‌ఈడీ లైట్లను అమర్చే ప్రక్రియను జీహెచ్‌ఎంసీ అధికారులు గత ఏడాది జూలైలో చేపట్టారు. డిసెంబర్‌లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, అనుకున్నవిధంగా ప్రధాన మార్గాలన్నింటిలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. కేంద్ర విద్యుత్‌శాఖ అనుబంధ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్‌ఎల్) ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును చేపట్టగా, డిసెంబర్ చివరివరకు 3,86,163 లైట్లను ఏర్పాటుచేశారు. పార్కులు, ప్రార్థనాస్థలాలు, చిన్నాచితకా గల్లీలు తదితర ప్రాంతాలు మాత్రమే మిగిలి ఉన్నట్టు అధికారులు తెలిపారు.

ఏటా రూ.150 కోట్లు ఆదా

ప్రస్తుతం వీధిలైట్ల నిర్వహణకు ఏటా రూ.252.89 కోట్లు ఖర్చవుతుండగా ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటుతో ఈ ఖర్చు విద్యుత్ చార్జీల రూపంలో రూ. 105.38 కోట్లకు తగ్గిపోతుందని, ఇతర ఖర్చులేవీ ఉండవని అధికారులు చెప్తున్నారు. ఏటా 58.33 శాతం విద్యుత్ వినియోగం తగ్గనున్నది. జీహెచ్‌ఎంసీపై ఎటువంటి భారం లేకుండా మిగులు విద్యుత్ ద్వారా అయ్యే ఆదాతోనే ఈఈఎస్‌ఎల్‌కు వాయిదాల రూపంలో సొమ్ము చెల్లించనున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 18, 35, 70, 110, 190 వాట్స్ సామర్థ్యంగల లైట్లు అమర్చుతున్నట్టు అధికారులు వెల్లడించారు. ఎల్‌ఈడీతో ఏటా 16,587 టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదల తగ్గుతుందన్నారు. దేశంలోని ప్రధాన నగరాల్లో ఇంత పెద్ద ఎత్తున ఎల్‌ఈడీ ప్రాజెక్టును చేపట్టిన మొదటి కార్పొరేషన్‌గా జీహెచ్‌ఎంసీ చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యధికంగా రెండు లక్షల ఎల్‌ఈడీ లైట్లను అమర్చగా, విశాఖపట్నంలో లక్ష ఎల్‌ఈడీ లైట్లను అమర్చారు. ఈ రెండు కార్పొరేషన్లలో ఎల్‌ఈడీ ఏర్పాటుకు ఏడాది పట్టగా, హైదరాబాద్‌లో మాత్రం ఆరు నెలల్లో దాదాపు పూర్తిచేశారు.

అత్యాధునిక కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థ

ఈ ఎల్‌ఈడీ లైట్ల ప్రాజెక్టును సమర్థవంతంగా నిర్వహించేందుకు సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టం(సీసీఎంఎస్)ను జీహెచ్‌ఎంసీ ప్రవేశపెట్టింది. దీనివల్ల లైట్లు సక్రమంగా వెలుగుతున్నాయా, లేదా అనేది మానిటరింగ్ కేంద్రం నుంచే తెలుసుకొనే వీలుంటుంది. 4.53 లక్షల లైట్లను 24,862 సీసీఎంఎస్ యూనిట్లకు అనుసంధానం చేస్తారు. దీనివల్ల లైట్లు సకాలంలో వెలుగడం, ఆరిపోవడంవల్ల సుమారు 50 శాతం విద్యుత్ ఆదా అవుతుందని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రాజెక్టులో 24,862 స్విచ్‌లను ఏర్పాటుచేస్తున్నారు. ఆటోటైమర్ల ఆప్షన్‌తో కూడిన ఈ కంట్రోల్ స్విచ్‌లు ఫొటో సెన్స్ ఆధారంగా చీకటిపడగానే ఆటోమేటిక్‌గా వెలుగుతాయని అధికారులు వివరిస్తున్నారు. ఎవరైనా అక్రమంగా లైట్లను వేయాలనుకున్నా, ఆర్పాలనుకున్నా మానిటరింగ్ కేంద్రానికి, సంబంధిత ఇంజినీర్‌కు వెంటనే మొబైల్ అలర్ట్ ద్వారా సమాచారం అందుతుంది. కంట్రోల్ స్విచ్ బోర్డు తలుపు తెరిచినా తెలిసిపోతుంది. లైట్లు వెలుగుతున్నాయా, లేదా అనేది కమాండ్ కంట్రోల్ ద్వారా నేరుగా చూసి సమీక్షించే అవకాశాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులతోపాటు అక్కడి స్థానికులు కూడా వెబ్‌సైట్ ద్వారా చూసేందుకు ప్రత్యేక లింక్‌ను అందించనున్నట్టు అధికారులు చెప్పారు. ఈ లైట్ల వినియోగంలో అక్రమాలు జరుగకుండా ఆస్ట్రోనాటికల్ క్లాక్ విధానాన్ని కూడా సీసీఎంఎస్‌కు సమకూర్చుతున్నట్టు తెలిపారు. పార్కులు, శ్మశానవాటికాల్లో రాత్రి పొద్దుపోయాక లైట్లు ఆరిపోయేలా ప్రత్యేక సమయాన్ని నిర్ధారించినట్టు చెప్పారు.

మన బార్లు భద్రమేనా?

- ముంబై, బెంగళూరు అగ్నిప్రమాదాలతో సర్వత్రా ఆందోళన
- బార్లు, పబ్బుల్లో భద్రతపై స్పష్టత కరువు
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్న ఆబ్కారీ అధికారులు
- స్వీయ రక్షణ చర్యలు అవసరమంటున్న అగ్నిమాపక శాఖ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

డిసెంబర్ 28వ తేదీ.. ముంబైలోని ఓ పబ్బులో జన్మదిన వేడుకలు జరుగుతుండగా అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఊపిరాడక 14 మంది మృతిచెందారు. 16 మంది గాయపడ్డారు. పబ్బు నిర్మాణంలో వెదురు కర్రలను ఎక్కువగా వాడటం, కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని తేలింది.

జనవరి 8వ తేదీ.. బెంగళూరులోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. బార్‌లో పనిచేసే ఐదుగురు కార్మికులు ఆహుతయ్యారు. వారంతా గాఢ నిద్రలో ఉండటంతో తప్పించుకోలేకపోయారు.

పది రోజుల వ్యవధిలోనే జరిగిన ఈ రెండు ప్రమాదాలు ప్రజల్లో భయాందోళన రేకెత్తించాయి. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్బుల భద్రతపై మద్యం ప్రియులు, అక్కడ పనిచేసే సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 936 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా, హైదరాబాద్‌లో 246 ఉన్నాయి. ఇందులో 14 స్టార్ హోటళ్లు, 7 మైక్రోబేవరేజస్ ఉన్నాయి. నగరంలో స్థలాభావం కారణంగా పలుచోట్ల ఇరుకైన కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లోనే పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లను నిర్వహిస్తున్నారు. వీటన్నింటిలో అగ్నిప్రమాద నివారణ ప్రమాణాలు ఎన్నిచోట్ల పాటిస్తున్నారనేదానిపై అటు ఆబ్కారీశాఖ నుంచి గానీ ఇటు అగ్నిమాపకశాఖ నుంచి గానీ స్పష్టత లేకపోవడం గమనార్హం. తాము బార్ అండ్ రెస్టారెంట్లకు, పబ్బులకు ఎటువంటి అనుమతులు, ఎన్‌వోసీలు జారీ చేయమని అగ్నిమాపకశాఖ అధికారులు చెప్తున్నారు. భవన నిర్మాణ సమయంలో ప్రమాణాలు పాటించారో లేదో మాత్రమే చూస్తామని పేర్కొంటున్నారు. ఆబ్కారీశాఖ అధికారులు సైతం బార్‌లైసెన్స్‌ల జారీలో అగ్నిమాపక ప్రమాణాలకు సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవని స్పష్టం చేస్తున్నారు. అయినా నిబంధనలు పాటించేలా చూస్తున్నామని వివరిస్తున్నారు. దీంతో నిబంధనలు పాటించనివారిపై ఎవరు చర్యలు తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రత్యేకంగా అనుమతులు ఉండవు

బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్బులకు ప్రత్యేకంగా అగ్నిమాపకశాఖ ఎలాంటి అనుమతులు, ఎన్‌వోసీలు జారీ చేయదు. 15 మీటర్లు, అంతకంటే ఎత్తయిన భవన సముదాయాలకు మాత్రమే మా శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా భవన నిర్మాణదారులు అగ్నిమాపక నివారణ ప్రమాణాలను కచ్చితంగా పాటించారో లేదో పరిశీలించి అనుమతులు జారీ చేస్తాం. బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్బులు, క్లబ్బులకు మా నుంచి ప్రత్యేక అనుమతులు అవసరం లేదు. కాకపోతే స్వీయ రక్షణ చర్యలు అవసరం. గ్రేటర్‌లో ఇప్పటి వరకు పబ్బుల్లో అగ్నిప్రమాదాలు జరిగిన దాఖలాలు లేవు. **- పాపయ్య, ఆర్‌ఎఫ్‌వో**

ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం

ఆబ్కారీ చట్టం ప్రకారం బార్‌లైసెన్స్ జారీలో అగ్నిమాపక ప్రమాణాలకు సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవు. అయినా నగరంలోని బార్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్బులు, క్లబ్బులు, హోటళ్లలో అగ్నిమాపక నివారణ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రమాణాలు పాటించే వారికే కొత్తగా అనుమతులు జారీ చేస్తున్నాం. ఇప్పటికే కొనసాగుతున్న బార్ల నిర్వాహకులు కూడా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి బార్ అండ్ రెస్టారెంట్‌లో వాటి సామర్థ్యం ఆధారంగా కిచెన్‌లో ఒకటి, లిక్కర్ స్టోర్‌లో ఒకటి, హాల్‌లో ఒకటి, సేల్ కౌంటర్‌లో ఒకటి చొప్పున మంటలను ఆర్పే సిలిండర్లు, ఇతర రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కార్బన్‌డై ఆక్సైడ్ సిలిండర్లు ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో పౌడర్ సిలిండర్లను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నాం. వీటితో మంటలను త్వరగా అదుపుచేయవచ్చు. వారం రోజుల్లో నగరంలోని అన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో సిలిండర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. **- వివేకానందరెడ్డి, హైదరాబాద్ జిల్లా ఆబ్కారీ డీసీ**



నాలాగా తప్పు చేయకండి

- అందరితోపాటే కౌన్సెలింగ్‌కు హాజరయ్యా: యాంకర్ ప్రదీప్

బేగంబజార్: డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి మద్యం తాగి వాహనం నడిపి పోలీసులకు చిక్కిన యాంకర్ ప్రదీప్ సోమవారం తండ్రి పాండురంగతో కలిసి గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. సాధారణంగా డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ప్రతిఒక్కరికీ ఇచ్చే విధంగానే యాంకర్ ప్రదీప్‌కు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు. అంతకు ముందు ప్రదీప్ విలేకరులతో మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడుపడం తప్పు అని సూచించారు. తాను తప్పు చేశానని, తనలాగా మరెవ్వరూ తప్పు చేయకూడదని చెప్పారు. సోమవారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తనకు వచ్చిన మెసేజ్ ప్రకారం తండ్రితో కలిసి వచ్చానని, ఎలాంటి నిబంధనలను బ్రేక్ చేయలేదన్నారు. మద్యం తాగి వాహనం నడుపకూడదనే విషయంపై ఇకమీదట తాను ప్రచారం చేస్తానన్నారు. కౌన్సెలింగ్ అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ ద్వారా కోర్టుకు హాజరుకావాల్సి ఉంటుంది.

రుషబ్ మహేంద్ర @ 14

- ట్రాఫిక్ పెనాల్టీ పాయింట్ల పరిమితి దాటిన మొదటి వ్యక్తి
- షోకాజ్ నోటీస్ జారీ.. లైసెన్స్ ఏడాది సస్పెండ్ చేసే అవకాశం



హైదరాబాద్ సిటీబ్యూరో/మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారికి పెనాల్టీ పాయింట్లు విధించే వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత మొదటి సారి ఓ వ్యక్తి 12 పాయింట్ల పరిమితిని దాటాడు. దీంతో అతడి లైసెన్స్ సస్పెన్షన్‌కు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని మౌలాలికి చెందిన రుషబ్ మహేంద్ర హేనియా గత ఆరునెలల్లో 13 సార్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టుబడ్డాడు. గత ఏడాది ఆగస్టు 18న హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ మొదటి సారి పట్టుబడగా ఇప్పటివరకు మొత్తం 12సార్లు అదే నేరం చేస్తూ దొరికిపోయాడు. దీంతో అతడి లైసెన్స్‌పై ఒక్కొక్కటి చొప్పున 12 పెనాల్టీ పాయింట్లు చేరాయి. తాజాగా ఈ నెల 6వ తేదీన సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ దొరుకడంతో మరో రెండు పాయింట్లు జత అయ్యాయి. దీంతో ఏకంగా 14 పాయింట్లకు చేరింది. గత ఆగస్టు 1వ తేదీ నుంచి మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం పెనాల్టీ పాయింట్లు 12 దాటితే లైసెన్స్‌పై వేటు వేస్తారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు రుషబ్ లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేయాలని ఆర్టీఏ అధికారులకు సిఫారసు చేయగా, మేడ్చల్ జిల్లా ఆర్టీవో పుప్పాల శ్రీనివాస్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. రుషబ్ లైసెన్స్ ఏడాది పాటు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో వైపు ఆరు పెనాల్టీ పాయింట్లు పడిన లైసెన్సుదారులను ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్‌కు పంపిస్తుండటంతో సత్ఫలితాలు వస్తున్నాయి. నిబంధనలు పాటించేవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పెనాల్టీ పాయింట్లు పడని లైసెన్సుల నంబర్ల నుంచి లక్కీ డ్రా తీసి విజేతలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలనే ప్రతిపాదన సైతం ఉన్నది.

ఇప్పటివరకు పెనాల్టీ పడిన లైసెన్సుల సంఖ్య

పాయింట్లు	నమోదైన కేసులు
1	2,52,833
2	39,939
3	8,610
4	2,787
5	998
6	150
7	43
8	15
9	2
10	1

మత్తుకు బానిసై.. దొంగలుగా మారి

- జల్సాల కోసం చదువు మధ్యలో వదిలేసిన బీటెక్ విద్యార్థులు
- చైన్‌స్నాచర్లుగా మారి హైదరాబాద్‌లో హల్‌చల్
- నలుగురి అరెస్ట్.. వీడిన 18 కేసుల మిస్టరీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గంజాయి మత్తు, జల్సాలకు బానిసైన నలుగురు విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలేశారు.. నిత్యం మత్తులో ఉండేందుకు డబ్బు అవసరం కావడంతో గొలుసు దొంగల అవతారం ఎత్తారు. పోలీసులకు దొరుకకుండా ఏకంగా 18 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. చివరికి సీసీ కెమెరాల్లో చిక్కడంతో రాచకొండ పోలీసులు దర్యాప్తు జరిపి సోమవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి 54 తులాల బంగారు ఆభరణాలు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన చవన్ సూరజ్, కొమ్ము పవన్‌కుమార్, హైదరాబాద్ పూల్‌బాగ్‌కు చెందిన మహ్మద్ ఓవైస్, ఖమ్మం ఖానాపురానికి చెందిన మామిడి రోహిత్ కుమార్ స్నేహితులు. వీరిలో మహ్మద్ ఓవైస్ పాలిటెక్నిక్ చదువుతుండగా, మిగతా ముగ్గురు బీటెక్ విద్యార్థులు. గంజాయి మత్తు, జల్సాలకు అలవాటుపడి చదువును మధ్యలోనే వదిలేశారు. గంజాయి కొనేందుకు డబ్బు అవసరం కావడంతో చైన్ స్నాచింగ్‌లకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం కుటుంబ సభ్యుల బైక్‌లతోపాటు దోస్తుల వాహనాలను వినియోగించారు. ముందుగా వీరు సొంత గ్రామాల నుంచి హైదరాబాద్ వచ్చి ఎల్బీనగర్ ప్రాంతంలోని స్నేహితుల రూమ్‌లకు వచ్చేవారు. పరీక్షలకు సిద్ధమతున్నామని నమ్మించి కొన్నాళ్లు తిష్ట వేసేవారు. సాయంత్రం సమయాల్లో గంజాయి తీసుకొని మత్తులో తేలేవారు. రాత్రి 11 గంటలు లేదా తెల్లవారుజాము 5 గంటల సమయంలో అత్యవసర పని ఉందంటూ స్నేహితుల బైక్‌లను తీసుకొని నిర్మానుష్య ప్రాంతాల్లో తిరిగేవారు. ఆ సమయంలో మహిళలు ఒంటరిగా కనిపిస్తే మెడలోని గొలుసులను తెంపుకొని పారిపోయేవారు. ఆ తర్వాత బైక్‌లను స్నేహితులకు తిరిగి ఇచ్చేసి సొంత ప్రాంతాలకు వెళ్లిపోయేవారు.

రూ.10 వేలకే రెండు తులాల బంగారం

ఈ నలుగురు గత ఆరు నెలలుగా చైతన్యపురి, ఎల్బీనగర్, సరూర్‌నగర్, మీర్‌పేట్, వనస్థలిపురం ప్రాంతాల్లో 18 గొలుసు దొంగతనాలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. సొంత ఊర్లకు వెళ్లిన కొన్నాళ్ల తర్వాత తెంపుకొని వచ్చిన గొలుసులను తెలిసిన వారికి అమ్మేస్తారు. కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేదని, అత్యవసరంగా డబ్బు కావాలని అడుగుతారు. రెండు తులాల గొలుసు ఉన్నదని రూ.10వేలు ఇస్తే చాలని చెప్పి తీసుకుంటారు. ఆ డబ్బుతో గంజాయి కొని మత్తులో తేలిపోతుంటారు.

బైక్ నంబర్‌తో..

ఇటీవల ఎల్బీనగర్ ప్రాంతంలో జరిగిన వరుసత దొంగతనాలపై కొన్నాళ్లపాటు పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరుకలేదు. వరుసగా నేరాలు జరుగుతుండటంతో సవాల్‌గా తీసుకొని సీసీ కెమెరాలను పరిశీలించగా ఎల్బీనగర్ ప్రాంతంలోని ఓ సీసీ కెమెరాలో స్నాచర్‌ల బైక్ ఫొటో దొరికింది. బండి నంబర్ మసకగా కనిపించడంతో టెక్నాలజీతో స్పష్టంగా వచ్చేలా చేశారు. ఆ నంబర్ ఆధారంగా విచారణ జరుపగా 18 ఘటనల గుట్టు వీడింది. ఇన్ని చైన్‌స్నాచింగ్‌ల గుట్టు ఒకేసారి వీడటం ఇదే మొదటిసారని సీపీ మహేశ్ భగవత్ తెలిపారు. ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి నిందితులకు త్వరగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులు ఆత్మగౌరవంతో బతుకాలి

ఏఈవోల సమస్యలను పరిష్కరిస్తాం: వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి



వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పోచారం, బెవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు

తెలుగుయూనివర్సిటీ: రైతులు సంతోషంగా, ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతికే రోజులు రావాలని ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ ప్రాంగణంలోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో వ్యవసాయ విస్తరణాధికారుల కేంద్ర సంఘం రూపొందించిన డైరీ, క్యాలండర్‌ను సోమవారం మంత్రి పోచా రం శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిగా వ్యవసాయ విస్తరణ అధికారులు వ్యవహరిస్తూ వ్యవసాయరంగం అంటే అప్పులు, ఆత్మహత్యలు కాదని ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఏఈవోల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో బెవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రాజేందర్, కోశాధికారి రేచల్, నగర అధ్యక్షుడు ప్రతాప్, వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి ఏ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్డీపీ లిక్కర్‌తో ఆదాయానికి గండి

- రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.20 కోట్ల నష్టం
- అక్రమ విదేశీ మద్యంపై ఎక్సైజ్‌శాఖ కొరడా
- ఆరునెలల్లో రూ.10 కోట్ల విలువైన మద్యం పట్టివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్రమ మద్యం వల్ల రాష్ట్ర ఖజానాకు భారీగా గండిపడుతున్నది. ఇటీవల నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్డీపీ) విదేశీ మద్యం భారీగా పట్టుపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఆదాయానికి భారీగా నష్టం ఏర్పడినట్టు అర్థమవుతున్నది. ఎన్డీపీ విదేశీ మద్యం విక్రయాల వల్ల డ్యూటీ చెల్లించిన విదేశీ మద్యం విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. తద్వారా ఆదాయం అక్రమార్కులకు చేరుతున్నది. ఏటా రూ.20 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఆరునెలల్లో రూ.10 కోట్ల విలువైన అక్రమ విదేశీ మద్యాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు వేర్వేరుగా పట్టుకున్నాయి. మరోవైపు ఏడాది కాలంగా అక్రమ మార్గాల ద్వారా విదేశీ మద్యం సరఫరాను అధికారులు నియంత్రించడం వల్ల రాష్ట్ర ఆదాయం నెలకు రూ.70 లక్షల వరకు పెరిగింది. ఎనిమిది నెలల కిందట శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విదేశీ మద్యం అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేసిన దాడుల నేపథ్యంలో ఈ ఆదాయం మరింత పెరిగినట్టు తెలిసింది. విమానాశ్రయంలో ఉన్న డ్యూటీ పెయిడ్ ఫ్రీ షాప్ (అవుట్‌లెట్) ద్వారా విదేశాలకు వెళ్లివచ్చే ప్రయాణికులకు విదేశీ మద్యాన్ని ఒక్కొక్కరికి రెండు బాటిళ్ల చొప్పున విక్రయిస్తారు. ఇక్కడ దొరికే విదేశీ మద్యానికి పన్ను ఉండదు కాబట్టి 60 శాతం తక్కువకు మద్యం దొరుకుతుంది. అప్పట్లో విదేశీ మద్యం విక్రయాల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్టు వచ్చిన సమాచారం మేరకు రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక దాడులు చేసింది. పలువురు సెంట్రల్ కస్టమ్స్ అధికారులపై, షాపు ఉద్యోగులపై కేసులు నమోదు చేసింది. అప్పటి నుంచి అక్రమంగా విదేశీ మద్యం బయటి రావడం నిలిచిపోయింది.

గత ఏడాది 2,600 విదేశీ బాటిళ్లు స్వాధీనం..

గత ఏడాది విదేశీ మద్యం భారీ మొత్తంలో పట్టుబడింది. కేవలం ఆరునెలల్లోనే సుమారు రూ.10 కోట్ల విలువైన 2,600 విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్, పోలీస్‌శాఖలు వేర్వేరుగా చేస్తున్న దాడుల్లో విదేశీ మద్యంతోపాటు మాదకద్రవ్యాలు కూడా పట్టుపడుతున్నాయి. అయితే పట్టుపడుతున్న మద్యం 50 శాతం మాత్రమే ఉంటుందని, మిగతా 50 శాతం అమ్మకాలు కొనసాగుతున్నాయని అధికారులు భావిస్తున్నారు.



మమతకు బ్యాగ్‌ను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, ఆటో డ్రైవర్ అజీజ్

ఆటో డ్రైవర్ నిజాయితీ

- ప్రయాణికురాలికి మరిచిపోయిన బ్యాగు అందజేత

చార్మినార్: ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును తిరిగి అప్పగించి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నారు. హుస్సేనిఆలం ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం. పాతబస్తీలోని ఉప్పుగూడకు చెందిన మమత (30) శనివారం ఉప్పుగూడ నుంచి షేరింగ్ ఆటోలో చార్మినార్‌కు వెళ్లింది. బ్యాగును ఆటోలోనే మరిచిపోయి దిగిపోయింది. బ్యాగులో రూ.30 వేలతోపాటు బంగారు ఆభరణాలు ఉండటంతో మమత హుస్సేనిఆలం పోలీసుకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు బాధితురాలు ప్రయాణించిన ఆటోను గుర్తించారు. అప్పటికే ఆటో డ్రైవర్ అజీజ్ మర్చిపోయిన బ్యాగ్ కోసం ఎవరైనా వస్తారేమోనని ఎదురుచూస్తున్నారు. ఇంతలో పోలీసులు విచారించడంతో అజీజ్ బ్యాగ్‌ను అందజేశారు. బ్యాగ్‌లో నగదుతోపాటు బంగారు ఆభరణాలు ఉండటంతో మమత సంతోషం వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ నిజాయితీని గుర్తించి ప్రయాణికురాలు పారితోషికం అందించారు.

అదానీ ఆస్తులు హైజంప్

2017లో 125 శాతం ఎగబాకిన సంపద



న్యూఢిల్లీ, జనవరి 8: సంపద పెరుగడంలో భారత కుబేరుడైన ముకేశ్ అంబానీ కంటే గౌతమ్ అదానీ ముందున్నారు. గతేడాదికిగాను గౌతమ్ అదానీ సంపద ఏకంగా 125 శాతం పెరుగగా, అదే ముకేశ్ అంబానీ ఆస్తి మాత్రం 70 శాతానికి పరిమితమైందని బ్లూంబర్గ్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. 2017 సంవత్సరం మొదట్లో 463 కోట్ల డాలర్లుగా ఉన్న గౌతమ్ ఆస్తి.. డిసెంబర్ చివరినాటికి 1,040 కోట్ల డాలర్లకు చేరుకున్నది. దేశవ్యాప్తంగా ఆయన ఏర్పాటు చేసిన రేవుల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కలిసొచ్చిందని పేర్కొంది. అలాగే డీ-మార్ట్ అధినేత రాధాకిశన్ దామాని సంపద కూడా 80 శాతం ఎగబాకి 696 కోట్ల డాలర్లుగా నమోదైంది. మార్చి చివరి నాటికి ఆయన సంపద 388 కోట్ల డాలర్లుగా ఉన్నది. స్టాక్ మార్కెట్లో లిస్టైన నాటి నుంచి డీ-మార్ట్ షేరు ధర 102 శాతం లాభపడింది. ప్రస్తుతం రూ.1,235 వద్ద కొనసాగుతున్నది. అయితే ముకేశ్ ఆస్తి అంతక్రితం ఏడాదితో పోలిస్తే 77.53 శాతం పెరిగి 4,030 కోట్ల డాలర్లుగా నమోదైంది. దీంతో ఆయన ప్రపంచ సంపన్న వర్గాల్లో 20వ స్థానంలో కొనసాగుతున్నారు. అలాగే కుమార మంగళం బిర్లా (50.41 శాతం), అజీం ప్రేమ్‌జీ (46.72 శాతం), ఉదయ్ కొటక్ (44.87 శాతం), విక్రమ్ లాల్ (44.03 శాతం), లక్ష్మీ మిట్టల్ (36.11 శాతం) చొప్పున పెరిగాయి. పల్లోంజి మిస్త్రీ (27.01 శాతం), సైరస్ పూనావాలా (16.50 శాతం), శివ్ నాడార్ (15.83 శాతం) ఆస్తులూ పెరిగాయి. అంతర్జాతీయంగా ప్రపంచ శ్రీమంతుడు జెఫ్ బెజోస్ ఆస్తి 52 శాతం వృద్ధి చెంది 9,900 కోట్ల డాలర్లకు చేరింది. అమెజాన్‌లో అత్యధిక వాటా కలిగిన బెజోస్ ఆస్తి అంతకుముందు ఏడాది 6,500 కోట్ల డాలర్లుగా ఉన్నది. రెండు, మూడు స్థానాల్లో బిల్‌గేట్స్, వారెన్ బఫెట్ కొనసాగుతున్నారు.

2017లో పెరిగిన వ్యక్తిగత సంపద

పేరు	సంపద (కోట్ల డాలర్లు)	వృద్ధి (శాతంలో)
గౌతమ్ అదానీ	1,040	125
రాధాకిశన్ దామాని	696	80
ముకేశ్ అంబానీ	4,030	77.53

బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు ల్యాప్‌టాప్‌లు

అందించే యోచనలో ఎయిర్ ఇండియా



న్యూఢిల్లీ, జనవరి 8: ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. అంతర్జాతీయ ప్రయాణికులను ఆకట్టుకోవడంలో భాగంగా బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు ల్యాప్‌టాప్‌ల సదుపాయం కల్పించే యోచనలో సంస్థ ఉన్నది. గ్లోబల్ రూట్లలో సగానికి సగం సీట్లు ఖాళీగా దర్శనమిస్తుండటంతో ప్రీమియం ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కంపెనీ సీఎండీ ప్రదీప్ సింగ్ తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అంతర్జాతీయ సర్వీసులు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని, దీంతో ప్రత్యామ్నాయాలను వెతుకాల్సిన గత్యంతరం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులకు అందిస్తున్న వీడియో స్క్రీన్లు పనిచేయకపోవడం వల్లనే ల్యాప్‌టాప్‌లు అందించాలనుకుంటున్నామన్న ఆయన దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

ఆఫర్లే..ఆఫర్లు



ప్రత్యేక రాయితీలు ప్రకటించిన ఇండిగో, విస్తారా

ముంబై, జనవరి 8: పలు విమానయాన సంస్థలు ఆఫర్లను తెరపైకి తీసుకొచ్చాయి. నూతన సంవత్సరం సందర్భంగా దేశంలో చౌక విమానయాన సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్ ఎంపిక చేసిన రూట్లలో ప్రారంభ టిక్కెట్ ధరను రూ.899గా నిర్ణయించింది. సోమవారం ప్రారంభమైన ఈ ఆఫర్ బుధవారం ముగియనున్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15లోగా ప్రయాణించాల్సి ఉంటుందని తెలిపింది. కంపెనీ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు ఢిల్లీ-చండీగఢ్‌ల మధ్య విమాన టిక్కెట్టు రూ.899గాను, ఢిల్లీ-జైపూర్‌ల మధ్య రూ.999, ఢిల్లీ-అమృత్‌సర్‌ల మధ్య రూ.1,099గా ఉన్నది. దీంతోపాటు మూడో వార్షికోత్సవం జరుపుకుంటున్న విస్తారా కూడా ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఆఫర్ కింద రూ.1,099కే విమాన టిక్కెట్టు అందిస్తున్నట్లు పేర్కొంది. ఎకానమి టిక్కెట్టు ధరను రూ.2,599గా, ప్రీమియం ఎకానమి రూ.7,499గా నిర్ణయించింది. వీటిపై ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 18లోగా ఎప్పుడైనా ప్రయాణించవచ్చును.

మధ్యతరగతి వర్గాలే గురి

ఎన్నికల వేళ సామాన్య ప్రజలపైనే కేంద్రం దృష్టి

రాబోయే బడ్జెట్‌లో పన్ను మినహాయింపులతో ఆకట్టుకునే అవకాశం



న్యూఢిల్లీ, జనవరి 8: వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనుండటంతో ఈసారి బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజల మనస్సును గెలుచుకునే రీతిలో పద్దు కూర్పు ఉండనుందనే అంచనాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను వచ్చే నెల పార్లమెంట్‌లో కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా, ఇది మిడిల్ క్లాస్ బడ్జెటే నన్న అభిప్రాయాలున్నాయి. సామాన్యులకు ఆర్థికపరమైన బలాన్ని చేకూర్చేలా పన్నుల్లో మినహాయింపులిచ్చే అవకాశాలుండగా, తమ కష్టార్జితంపై మరింతగా ప్రతిఫలాలు పొందేలా నిర్ణయాలు, ఇంటి ఖర్చులను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు చెబుతున్నాయి. పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలుపై సామాన్యుల్లో ఉన్న వ్యతిరేకతను పోగొట్టేలా మరిన్ని వస్తువులను జీఎస్టీలోని గరిష్ఠ శ్లాబు నుంచి కనిష్ఠ శ్లాబుల్లోకి తీసుకొచ్చే వీలుందని కూడా సదరు వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే 200లకుపైగా వస్తువులను 28 శాతం పన్ను నుంచి తక్కువ పన్ను రేట్లలోకి మార్చిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం 5,000 మదుపరులను బాధిస్తున్నా.. 5 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నదని ప్రభుత్వ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇకపోతే మ్యూచువల్ ఫండ్లు, స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపై పెద్ద ఎత్తున ప్రతిఫలాలు అందుతుండటంతో అంతకంటే తక్కువ లాభాలనిస్తున్న బ్యాంక్ డిపాజిట్లకు దూరమవుతున్న డిపాజిటర్లను ఆకర్షించేలా అధిక వడ్డీరేట్లను ప్రకటించే వీలుందని ఆర్థిక శాఖ వర్గాలు అంటున్నాయి. నిజానికి కొన్ని సంస్కరణలు ప్రజానీకాన్ని, ముఖ్యంగా మధ్యతరగతి ప్ర జలను తీవ్రంగా ప్రభావితం చేయడంతో, వాటి లక్ష్యాలను మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం సవరించుకుంటున్నది. నకిలీ కరెన్సీ, నల్లధనం నిర్మూలన కోసం పాత రూ. 500, 1,000 నోట్లను 2016 నవంబర్‌లో రద్దు చేసిన మోదీ సర్కారు.. వాటి స్థానంలో కొత్త రూ.500, 2,000 కరెన్సీని అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. అయితే నగదు కొరత ఏర్పడటంతో డిజిటల్ లావాదేవీల పల్లవిని ఎత్తుకోగా, అదికూడా విఫలం కావడంతో మళ్లీ చలామణిలోకి నోట్ల ప్రవాహాన్ని పెంచింది. అలాగే ఖజానాపై రాయితీల భారాన్ని తగ్గించుకునేలా వంటగ్యాస్ ధరలను దశలవారీగా పెంచాలని నిర్ణయించినప్పటికీ, ఇప్పుడు ఆ విషయంలో వెనుకకు తగ్గింది. జీఎస్టీలోనూ ఆయా వస్తువులపై పన్నుల రేట్లను తగ్గిస్తూ వస్తున్నది. దీనంతటికీ కారణం 2019 ఎన్నికలు దగ్గర పడుతుండటమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కొత్త పన్నులకు ఆస్కారం?

మధ్యతరగతి వర్గాలపై పన్నుల భారం తగ్గించే దిశగా అడుగులేస్తున్న కేంద్రం.. ఈసారి కొన్ని కొత్త పన్ను ప్రతిపాదనలనూ చేసే వీలుంది. ఇందులోభాగంగానే స్టాక్ మార్కెట్ లావాదేవీలపై దీర్ఘకాలిక పెట్టుబడుల లాభాల పన్నును మళ్లీ పరిచయం చేయాలనుకుంటున్నది. జీఎస్టీ వసూళ్లు నెలనెలా తగ్గిపోతుండటంతో ఖజానాకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిధులను తరలించేందుకున్న అన్ని మార్గాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం రూ.2.50 లక్షల వరకున్న వార్షిక ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచితే సర్కారీ ఆదాయం మరింత తగ్గనుందని, ఈ క్రమంలోనే సంపన్న వర్గాలు, లగ్జరీ ఉత్పత్తులపై పన్ను పెంపు, కార్పొరేట్ ట్యాక్స్ వడ్డింపులుండవచ్చని పేర్కొంటున్నాయి. అయితే ఆర్థిక మంత్రి జైట్లీతో సమగ్ర చర్చల అనంతరం ప్రధాని మోదీ పన్నులపై నిర్ణయాలు తీసుకోనున్నారని వెల్లడించాయి.

కార్పొరేట్ విద్య, వైద్యం అందరికీ అందాలి

ప్రస్తుతం మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం నుంచి ఆశిస్తున్న ప్రయోజనాలు ప్రధానంగా రెండేనని, అవి పిల్లల చదువు, తమ ఆరోగ్య ఖర్చులేనని నిపుణులు పేర్కొంటున్నారు. విద్య, వైద్యం దగ్గర ఖర్చుకు వెనుకాడలేకపోతుండటాన్ని కార్పొరేట్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, దీనివల్ల నేడు ప్రైవేట్ స్కూళ్లలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి ప్రారంభ స్థాయి విద్యను కూడా మధ్యతరగతి వర్గాలు పొందలేకపోతున్నాయని అంటున్నారు. పిల్లల వయసు పెరిగినకొద్దీ, చదువులు భారమైపోతుండటంపై బెంగ పెట్టుకుంటున్నారని చెబుతున్నారు. మరోవైపు కార్పొరేట్ వైద్యం కూడా అందని ద్రాక్షగానే మారిందని, కాబట్టి ఈ రెండింటి వ్యయాన్ని తగ్గించగలిగితే మధ్యతరగతి వర్గాలకు ఇంతకంటే కావాల్సిందేమీ ఉండదని మెజారిటీ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ లాభాలకు వీలున్నది?

- ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంపు
- మరింతగా ఆరోగ్య బీమా ప్రయోజనాలు
- ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెట్టుబడులపై ప్రోత్సాహకాలు
- ప్రామాణిక పన్ను దాఖలులో ఊరట
- ఇంకా తగ్గనున్న జీఎస్టీ భారం
- పొదుపు సంబంధిత పథకాలపై ఎక్కువ ప్రతిఫలం

కాల్‌డ్రాప్స్‌పై ఆందోళన

రేపు టెల్కోలతో డీవోటీ భేటీ



న్యూఢిల్లీ, జనవరి 8: దేశవ్యాప్తంగా పతాకస్థాయికి చేరుకున్న కాల్‌డ్రాప్స్‌పై టెలికం శాఖ తీవ్ర ఆందోళనను వ్యక్తంచేసింది. ఈ పరిస్థితులను సమీక్షించడానికి టెలికం నియంత్రణ మండలి ట్రాయ్‌తో కలిసి బుధవారం టెలికం సంస్థలతో ప్రత్యేకంగా డీవోటీ ఉన్నతాధికారులు సమావేశమవబోతున్నారు. టెలికం కార్యదర్శి అరుణ సుందరరాజన్ నేతృత్వంలో జరుగనున్న ఈ సమావేశానికి పలు టెలికం సంస్థల సీఈవోలు హాజరవనున్నారు. ఈ సమావేశంలో కాల్ డ్రాప్స్‌ను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలు, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేదానిపై ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి గతేడాది అక్టోబర్‌లో ట్రాయ్ ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. కాల్‌డ్రాప్‌పై కేంద్రం ఆందోళనను వ్యక్తంచేసిన నేపథ్యంలో ఆపరేటర్లు మెరుగైన సేవలు అందించడానికి తమవంతు కృషి చేయాలని సుందరరాజన్ ఈ సందర్భంగా సూచించారు. కాల్ నాణ్యత ప్రమాణాలు భారీగా పడిపోయాయని, దీంతో ఫిర్యాదులు ఇచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆమె పేర్కొన్నారు. గడిచిన రెండేండ్ల కాలంలో నాణ్యత ప్రమాణాలకు టెల్కోలు తిలోదకాలు ఇచ్చాయని.. 2016లో ఒక్కో కాల్‌డ్రాప్‌పై రూపాయి చొప్పున జరిమానా విధించాలని ట్రాయ్ సూచించినప్పటికీ.. ఈ కేసు సుప్రీంకోర్టులో నడుస్తుండటంతో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నామని ఆమె వాపోయారు. నాణ్యమైన సేవలు అందించేదానిపై టెలికం మంత్రిత్వ శాఖ సీరియస్‌గా దృష్టి సారించిందని, అలాగే దేశవ్యాప్తంగా మొబైల్ టవర్ల సంఖ్యను మరింత పెంచుకోవాలని టెల్కోలకు సూచించినట్లు ఆమె పేర్కొన్నారు. ట్రాయ్ సూచించిన మార్గదర్శకాలకు లోబడి టెలికం సర్కిల్‌లో కాల్‌డ్రాప్స్‌పై గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ నూతన మార్గదర్శకాలు అక్టోబర్ 1 నుంచి లేదా డిసెంబర్ త్రైమాసికంలో అమలులోకి తేవాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు ఆమె సమాధానంగా చెప్పారు.

గడువుకంటే ముందే భారత్ నెట్ రెండో విడుత: దేశవ్యాప్తంగా 1.5 లక్షల గ్రామ పంచాయితీలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భారత్ నెట్ రెండో విడుత గడువుకంటే ముందే ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తికాగలదని టెలికం మంత్రి మనోజ్ సిన్హా వెల్లడించారు. తొలి విడుతలో భాగంగా లక్ష గ్రామ పంచాయితీలకు అత్యంత వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం రెండో విడుత మార్చి 2019 నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

రికార్డుల మోత మోగించాయ్

సరికొత్త శిఖరాలకు సెన్సెక్స్, నిఫ్టీ.. మదుపరుల కొనుగోళ్ల జోరుతో ఆల్‌టైమ్ హైకి సూచీలు



ముంబై, జనవరి 8: దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డుల మోత మోగింది. రాబోయే త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ప్రకటించే కేంద్ర బడ్జెట్‌పై ఆశావాహ దృక్పథంతో మదుపరులు పెట్టుబడులతో కదం తొక్కారు. ఈ క్రమంలోనే సోమవారం అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీలు సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ 198.94 పాయింట్లు ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 34,352.79 వద్దకు చేరగా, నిఫ్టీ 64.75 పాయింట్లు పుంజుకుని తొలిసారిగా 10,600 మార్కుకు ఎగువన 10,623.60 వద్ద నిలిచింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీల గత రికార్డులు 34,153.85 పాయింట్లు, 10,558.85 పాయింట్లు కనుమరుగైపోయాయి. ఇంట్రా-డేలోనూ సెన్సెక్స్ 34,385.67 పాయింట్లు, నిఫ్టీ 10,631.20 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేశాయి. దేశ, విదేశీ మదుపరుల నుంచి ఐటీ, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, మెటల్ రంగాల షేర్లకు లభించిన భారీ కొనుగోళ్ల మద్దతే సూచీలను చారిత్రక స్థాయిలకు తీసుకెళ్లాయని మార్కెట్ వర్గాలు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి. టెలికం షేర్లు నష్టపోయినా.. రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, చమురు, గ్యాస్, టెక్నాలజీ, ఇన్‌ఫ్రా రంగాల షేర్లు మదుపరులను ఆకట్టుకోవడం పెద్దగా కలిసొచ్చిందంటున్నాయి. ఇక ఆసియా, ఐరోపా మార్కెట్లూ లాభాల్లోనే కదలాడటం భారతీయ స్టాక్ మార్కెట్లలో సెంటిమెంట్‌ను మరింత బలపరిచిందన్న అభిప్రాయాలు నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి.

రూ.1.12 లక్షల కోట్లు ఎగిసింది

స్టాక్ మార్కెట్లు రికార్డుస్థాయి లాభాలను అందుకోవడంతో ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.1.12 లక్షల కోట్లు ఎగబాకింది. బీఎస్‌ఈలోని సంస్థల మార్కెట్ విలువ రూ.1,12,421.02 కోట్లు ఎగిసి రూ.1,54,89,491 కోట్లను చేరింది. కోల్ ఇండియా, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా, లార్సెన్ అండ్ టూబ్రో తదితర 21 షేర్ల విలువ పెద్ద ఎత్తున పెరిగింది. ఐటీ షేర్ల విలువ 1.40 శాతం, క్యాపిటల్ గూడ్స్ షేర్ల సూచీ 1.22 శాతం మేర పరుగెత్తింది.

గణనీయంగా పెరుగనున్న ఎస్‌ఎంఈలు

వచ్చే రెండేండ్లలో దేశీయ స్టాక్ మార్కెట్లలోని చిన్న, మధ్యతరహా సంస్థల (ఎస్‌ఎంఈ) సంఖ్య గణనీయంగా పెరుగనున్నది. ప్రస్తుతం దాదాపు 350గా ఉన్న ఎస్‌ఎంఈలు.. వెయ్యికి చేరుతాయని ప్రముఖ మర్చెంట్ బ్యాంకర్ గిన్నీస్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ అంచనా వేసింది. వ్యాపార విస్తరణలో భాగంగా చాలా కంపెనీలు నిధుల కోసం స్టాక్ మార్కెట్లలోకి ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా రానున్నాయని పేర్కొన్నది. 2016లో 66 సంస్థలు ఐపీవోల ద్వారా రూ.540 కోట్లను సమీకరించాయని, 2017లో 132 కంపెనీలు రూ.1,785 కోట్లను సేకరించాయని వివరించింది. ఈ క్రమంలోనే ఈ రెండేండ్లలో ఎస్‌ఎంఈల రాక మరింత విస్తృతం కానున్నదని తెలిపింది.

12 వేల కోట్ల సేకరణలో ఎస్‌బీఐ

న్యూఢిల్లీ, జనవరి 8: బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) భారీ స్థాయిలో నిధులను సేకరించడానికి సిద్ధమైంది. అంతర్జాతీయంగా వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి అవసరమైన నిధుల్లో విదేశీ బాండ్లను జారీ చేయడం ద్వారా 200 కోట్ల డాలర్లను సేకరించాలనుకుంటున్నది. మన కరెన్సీలో రూ.12,600 కోట్లు. బ్యాంకుకు చెందిన సెంట్రల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశమై.. ఈ ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఒకేసారి లేదా విడుతలవారీగా నిధులను సేకరించేదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో డాలర్ లేదా ఇతర కరెన్సీ రూపంలో పబ్లిక్ ఆఫర్ లేదా ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా వీటిని సమీకరించనున్నది. బాసెల్-3 నిబంధనలను అమలు చేయడానికి అవసరమయ్యే నిధుల్లో మసాల బాండ్లను విక్రయించడం ద్వారా రూ.8 వేల కోట్ల నిధుల సేకరణకు బోర్డు గత నెలలో అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. మార్చి 2019 నుంచి బాసెల్-3 నిబంధనలను అమలు చేయాలని బ్యాంక్ భావిస్తున్నది.

నిధుల సమీకరణలో జేబీ

హైదరాబాద్, జనవరి 8: రాష్ర్టానికి చెందిన బ్లాక్‌చైన్ టెక్నాలజీ సేవల సంస్థ జేబీ డాటా త్వరలో మరిన్ని నిధులను సేకరించాలనుకుంటున్నది. 2015లో రూ.10 కోట్లను సేకరించిన సంస్థ.. వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో అంతకంటే ఎక్కువగా సమీకరించాలనుకుంటున్నట్లు కంపెనీ ఫౌండర్, సీఈవో బాబు మునగాల తెలిపారు. వినియోగదారులకు నూతన సేవలు అందించడానికిగాను సోమవారం ఆయన ఈ చైయిన్ టెక్నాలజీ సేవలను ఆరంభించారు.

ఎన్‌ఎండీసీలో వాటా విక్రయం నేడు

న్యూఢిల్లీ, జనవరి 8: ఖనిజ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామి సంస్థ ఎన్‌ఎండీసీలో కేంద్ర ప్రభుత్వం 1.5 శాతం వాటాను మంగళవారం నుంచి రెండు రోజులపాటు విక్రయించనున్నది. ఒక్కో షేరు ధరను రూ.153.50గా నిర్ణయించింది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) రూట్‌లో జరుగనున్న ఈ షేర్ల విక్రయం తొలి రోజు సంస్థాగత పెట్టుబడిదారుల కోసం, బుధవారం రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కేటాయించనున్నది. 1.5 శాతానికి సమానమైన షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించడం ద్వారా రూ.750 కోట్ల మేర ఆదాయం రావచ్చునని కేంద్రం భావిస్తున్నది. సోమవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి నమోదైన రూ.161.85తో పోలిస్తే ఐదు శాతం వరకు రాయితీ ఇస్తున్నది.

రాష్ర్టాలకు ప్రోత్సాహకాలు

ఎగుమతుల బలోపేతానికి కేంద్రం ఆలోచన

న్యూఢిల్లీ, జనవరి 8: ఎగుమతుల బలోపేతానికి రాష్ర్టాలకు ప్రోత్సాహకాలను ప్రకటించాలని యోచిస్తున్నది కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ. వృద్ధిరేటు పతనమవుతున్న నేపథ్యంలో దాన్ని పరుగులు పెట్టించాలంటే రాష్ర్టాల భాగస్వామ్యంతో ఎగుమతులను పెంచుకోవడం చాలా అవసరమని భావిస్తున్న కేంద్రం.. అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలను ఇవ్వాలని అనుకుంటున్నది. వాణిజ్య అభివృద్ధి, ప్రగతి మండలి సమావేశంలో ఈ అంశంపై రాష్ర్టాల అభిప్రాయాలనూ కోరినట్లు సోమవారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు. 'ఎగుమతులు పెరుగడానికి రాష్ర్టాలకు ప్రోత్సాహకాలను అందించాలనే మా ఆలోచనను ఆయా ప్రభుత్వాల ముందుంచాం. దీనిపై వారి అభిప్రాయాలను తెలుపాలని కోరాం' అని అన్నారు. కాగా, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రిఫండ్‌కు సంబంధించి ఎగుమతిదారుల ఆందోళనపై విలేఖరులు ప్రశ్నించగా, ఈ సమస్య పరిష్కారానికి 'ఈ-వాలెట్' వ్యవస్థను తీసుకువచ్చేందుకు శ్రమిస్తున్నామని తెలిపారు. ఇదిలావుంటే జీఎస్టీ విధానంలో విద్యుత్ పన్నులకు మినహాయింపునివ్వాలని, పోటీని తట్టుకోవడానికి రవాణా రాయితీలను కల్పించాలని మండలికి ఎగుమతిదారుల సంఘం (ఎఫ్ఐఈవో) అధ్యక్షుడు గణేశ్ కుమార్ గుప్తా సూచించారు. ఈ ఏప్రిల్-నవంబర్‌లో దేశ ఎగుమతులు 12.01 శాతం వృద్ధితో 196.48 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

ఆపిల్ ప్రతిపాదన కోసం చూస్తున్నాం: భారత్‌లో తయారీ కేంద్రం ఏర్పాటుపై అమెరికా టెక్నాలజీ దిగ్గజం ఆపిల్ ప్రతిపాదన కోసం ఎదురుచూస్తున్నామని సురేశ్ ప్రభు తెలిపారు. ఆపిల్ నుంచి ప్రతిపాదనేదైనా వస్తే.. దాన్ని పరిశీలించి తగు నిర్ణయం ప్రకటిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులతో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఉత్పాదక కేంద్రంపై ప్రతిపాదన చేయాలని కోరినట్లు చెప్పారు.

బీఎస్‌ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 351.1(346.55)19555
Ace Software Expo27.55(29.0)4285
Aditya Ispat 7.7(7.6)5085
Aditya Spin 8.56(8.31)800
Agro Tech Foods 742.5(747.95)2257
Aishwarya Telcom 11.1(9.25)298000
Alphageo 936.8(931.9)4285
Alufluoride 143.4(140.7)12949
Amara Raja 865.55(862.3)36795
Andhra Bank 58.55(58.65)120109
Andhra Cem 15.26(14.54)349428
Andhra Petroch 67.45(64.25)534720
Andhra Sugars 582.9(551.25)20992
Anjani Portl 261.65(266.05)5324
Astra Micro 120.35(121.3)68432
Aurobindo 677.95(671.1)142658
Avantel 547.8(530.0)14092
Avanti Feeds 2678.7(2694.1)11811
Avon Organics 17.52(17.1)108322
B N Rathi Secur52.05(53.0)10969
B2b Software 15.48(16.03)1829
Balaji Amines 752.8(660.45)170062
Bambino Agro 327.55(321.5)8668
Baron Infotech 0.32(0.32)3999
Bartronics Ind16.68(16.71)130036
Bgr Energy Sys141.6(140.1)18505

Bhagiradha Chem 362.3(357.85)2437
Bhagyaind 50.85(50.7)6803
Bhagyanagar W. 29.4(30.0)10224
Bnr Udyog 28.85(30.2)262
Brilliant Secur14.13(13.46)72270
Cambridge Tech Ent 88.0(86.3)1475
Canaan Credi 15.0(15.55)500
Cat Tech 1.26(1.24)30571
Ccl Products 303.9(302.75)20729
Celestial Labs 21.7(21.5)44134
Cil Securities 38.15(39.45)2283
Coastal Trawlers 82.25(78.35)2
Color Chips 48.0(49.3)18253
Combat Drugs 22.07(21.02)420
Coromandel Fert 578.35(568.0)16131
Country Club 18.15(19.05)189719
Cubex Tubings 29.15(28.8)9778
Cybermate Inf. 3.56(3.62)141279
Danlaw Tech. 88.85(84.65)108747
Deccan Cem645.65(644.45)5029
Denisons Hyd 1187.05(1245.7)209
Dhan Roto Sp 42.2(44.4)2818
Diamond Power Infra22.55(21.1)279891
Divi's Lab 1114.15(1105.15)33796
Divyashakti Gr 117.0(111.45)2935
Dolphin Med 2.0(2.0)1693

Dr Reddy`s 2465.8(2467.35)46145
Emed.com Technologies 7.0(7.2)10
Empee Sugars 5.33(5.4)25348
Everest Org 153.6(149.1)9356
Facor Alloys 4.09(4.28)748620
Fenoplast 68.45(65.2)1
Firstobj 15.3(15.35)5664
Fortune Info 118.0(123.55)12699
Four Soft 93.0(91.5)3686
Fourth Gen Info 1.71(1.7)300
Frontier Info. 1.96(1.87)775
Gati 141.45(138.85)432034
Gayatri 12.14(11.93)193222
Gayatri Proj 213.55(214.95)38262
Gennex 6.16(6.1)462239
Gmr Infra 22.0(21.25)5308357
Godavari Drugs 42.95(43.4)5416
Goldinfra 229.95(209.05)230603
Goldstone Tech 14.8(14.1)6808
Granules Ind 140.15(139.35)191865
Gss America Info36.35(32.85)334881
Gulf Oil Corp 600.25(587.75)2322
Gvk Pwr 21.1(20.1)1355419
Hbl Power 73.45(73.5)158421
Heritage Food 836.6(830.95)2697
Hifco Marwel 38.95(37.2)50

Hind Fluro 12.76(12.16)700
Hyderabad Ind 1603.65(1608.05)2793
I V R Cons 6.45(6.19)489142
I.c.s.a. 5.22(4.98)132929
Incap 122.55(128.95)14445
Infotech Ent 582.05(576.4)5329
Intensive Air Sys0.38(0.4)10000
Invinex Lab 92.8(91.0)182
Ivrcl Infrastruc 6.45(6.19)489142
K C P 156.65(157.95)60563
Kabsons Ind 9.03(8.86)450
Kakatiya Cem409.05(413.25)16382
Kallam Spin Mills 25.4(26.15)38486
Kaveri Seed 538.45(538.85)104997
Kernex Mic. 47.05(46.0)31960
Khaitan Elect 13.2(13.89)1200
Knr Constru 315.15(313.3)21405
Krebsbio 162.75(157.0)5277

Lanco Ind 402.85(401.3)40220
Lanco Infratech 1.78(1.7)1901903
Livewell Home Fin 83.65(86.2)8995
Lokesh Mach 78.15(78.7)80349
Lotus Chocolate 22.05(21.0)3112
Madhucon Proj38.45(36.85)267118
Maytas Infra 54.2(55.5)16444
Mhril 372.7(359.15)19352
Mic Electronics 9.41(9.38)149640
Moldtek 75.8(76.65)6951
Moschip Semi 44.15(42.2)347151
Msr India Ltd 36.95(35.2)18875
N C L Ind 269.8(278.0)23145
Nagarjuna Agri 67.1(63.9)205155
Nagarjuna Agri Tech 7.51(7.9)2019
Nagarjuna Con 134.3(131.9)465067
Natco Pharma 1003.4(998.9)25856
National Min 161.85(158.5)906553

Nbventure 173.15(172.8)271905
Neha Int10.28(10.56)89362
Neha Int 10.28(10.56)89362
Neocure Thera 4.05(4.09)15270
Nettlinx 89.2(88.55)74018
Neuland Lab 851.7(845.4)5367
Niharinf 14.01(13.6)1750
Nile 923.75(927.95)4544
Oil Country 61.45(62.25)25156
P.m. Telelinnks 2.72(2.86)2015
Padmalaya Tel 5.89(5.8)19051
Pankaj Polymers 23.05(24.1)4474
Panyam Cem 66.55(65.6)68962
Pennar Ind 76.3(76.7)483366
Pflinfotc 9.71(9.25)5343
Pharmaids Pharma 2.66(2.54)1000
Phyto Chem 73.75(73.75)10143
Pitti Lamin 103.1(103.75)23141

Pokarna 258.2(247.6)58943
Prajay Eng 18.46(17.59)154555
Premier Expl 511.6(446.9)76319
Prism Cement 135.7(135.4)156315
Rain 461.35(421.2)1235974
Raj Packaging 38.75(39.0)11149
Rajvir Industries 42.4(40.4)50
Ram Informatics 39.7(38.3)7069
Ras Finance 28.2(26.9)626
Regency Ceramic 8.5(8.93)5365
Restile Ceramics 10.3(10.4)16378
Roopa Industries 13.63(13.05)1806
Rubra Medicaments 6.0(6.0)8500
Sagar Cem1108.25(1095.8)15066
Sai Wires India 2.33(2.37)4000
Samkrg Pistons 350.9(354.1)5567
Sampre Nutritions 88.95(87.6)17209
Sanghi Ind 140.5(138.75)63729
Sanjeevni Ind28.6(27.25)113623
Sark Sys 68.4(71.0)62345
Sathavahana Ispat 37.7(37.25)41316
Saven TechLtd 24.95(24.0)5888
Sks Microfin1049.65(1034.35)33671
Sms Pharma107.6(100.2)115040
Softpro Sys 6.07(5.79)3590
Southern Mg & Chem35.8(34.1)800

Southern Online Bio 3.89(3.52)92515
Sowbhagya Exports 1.64(1.57)10
Sr Ray Alkalies 86.4(82.45)1028116
Sree Rayalaseema 236.3(227.15)12429
Srinivasa Shipp 98.55(92.5)173493
Starchik Sp 25.5(25.0)1073
Steel Exchange 42.15(43.95)205410
Sujana 0.97(0.93)37536
Sujana Towers 5.6(5.37)36299
Sujanametal 1.69(1.69)89657
Surana Telecom 6.75(6.43)73699
Suryaamba 73.65(75.05)1760
Suryachakra Power 1.56(1.49)35824
Suryalak Cott 103.7(107.5)21837
Suryalata Spin 170.75(165.8)6764
Suryavanshi Spin 9.31(8.91)4299
Suvarna Cem 179.85(180.0)8399
Suven 218.15(215.1)77053
Taj Gvk 186.9(181.35)59963
Tanla Solutions 40.25(41.2)128227
Tci 1040.0(1043.15)28
Tci Fin 32.25(29.8)249278
Transcorp Int53.85(56.65)13548
Transgene Biotek 2.41(2.44)19909
Transport Co 297.85(294.55)7925
Trendy Knitwear 0.22(0.21)50399

Tyche 146.5(142.7)20961
Unisocks 3.2(3.33)17600
Ushakiran Finance 4.75(5.0)200
Usher 8.69(8.75)19207
V & K Softech 4.75(4.99)1100
V B C Ferro 47.05(45.05)2824
V S T Ind 3157.55(3177.55)925
Vamshi Rubber 54.0(52.35)373
Viceroy Hotels 21.35(20.4)322198
Vijay Growth Fin 15.0(15.0)110
Vijay Textiles 43.7(44.8)15474
Vimta Labs 170.95(173.25)7273
Virat Crane 47.95(47.4)16015
Virnichiq 146.2(139.25)359140
Visaka Ind 770.05(755.7)83877
Vista Pharma 47.95(45.7)171965
Vivmed Labs 108.25(105.95)442632
Vivo Bio Tech 49.7(50.0)14314
Vjil Consulting 18.05(19.0)4830
Vmf Softech 107.5(102.4)21164
Vsfproj 8.0(8.16)141
Waterbase 380.1(386.35)200770
Xl Energy Ltd 3.82(3.81)44763
Ybrant Digital 6.68(5.99)3203425
Yenkey Drug 4.13(4.09)275
Zen Tech Ltd 151.45(153.6)46473
Zenotech 49.0(51.25)26837

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	29.0	8.3
నిర్మల్	29.0	8.3
మంచిర్యాల	29.0	8.3
కుమ్రంభీం ఆసిఫాబాద్	29.0	8.3
జగిత్యాల	29.5	10.0
వికారాబాద్	28.6	10.5
ఖమ్మం	30.0	12.0
కరీంనగర్	34.2	12.8
పెద్దపల్లి	29.2	13.0
వరంగల్ రూరల్	31.0	13.0
యాదాద్రి భువనగిరి	27.0	14.0
సూర్యాపేట	28.0	14.0
జయశంకర్ భూపాలపల్లి	29.0	14.0
రాజన్న సిరిసిల్ల	29.0	14.0
జనగామ	30.0	14.0
మెదక్	30.3	14.2
సంగారెడ్డి	30.3	14.2
సిద్దిపేట	30.3	14.2
వనపర్తి	30.0	14.3
నిజామాబాద్	29.8	14.8
కామారెడ్డి	29.8	14.8
హైదరాబాద్	28.0	15.0
రంగారెడ్డి	28.0	15.0
మేడ్చల్	28.0	15.0
మహబూబాబాద్	29.0	15.0
నాగర్‌కర్నూల్	29.0	15.0
జోగుళాంబ గద్వాల	30.0	15.0
వరంగల్ అర్బన్	28.5	15.5
నల్లగొండ	28.2	15.6
మహబూబ్‌నగర్	30.2	15.7
భద్రాద్రి కొత్తగూడెం	30.0	16.0

పెరిగిన ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్‌లో 8.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఆదిలాబాద్ అర్బన్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగడంతో చలి తీవ్రత కొంత తగ్గింది. వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవటంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగటి ఎండ తీవ్రత అధికంగానే ఉంటున్నది. కాగా ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం 8.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పదిరోజుల క్రితం జిల్లాలో రికార్డు స్థాయిలో మూడు డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే. ఏజెన్సీ అటవీ ప్రాంతాల గ్రామాల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగానే ఉంటున్నది. సాయంత్రం ఆరు నుంచి చలిగాలులు వీస్తున్నాయి.



మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

అవనిపై హరివిల్లు

'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంతోపాటు వికారాబాద్ జిల్లా పరిగిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. విజేతలకు మహబూబాబాద్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పరిగిలో జిల్లా అటవీ అధికారి శ్రీలక్ష్మి, పల్లవి విద్యాసంస్థల చైర్మన్ కొప్పుల మహేశ్‌రెడ్డిలు బహుమతి ప్రదానం చేశారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని సత్యగ్యాన్ స్కూలు వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మల్కాజ్‌గిరి ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

సకల జనుల సంక్షేమమే సర్కార్ ధ్యేయం



తాండూరులో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహేందర్‌రెడ్డిలను గొర్రె పిల్లలతో సత్కరిస్తున్న గొల్ల కురుమలు. చిత్రంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, నమస్తే తెలంగాణ: సకల జనుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలకు చెందిన గొల్ల, కురుమలకు రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి సబ్సిడీ గొర్రెలను అందించారు. అనంతరం తలసాని విలేకరులతో మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న 702 వివిధ ఉద్యోగాలను సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేందుకు నిర్ణయించినట్టు చెప్పారు. ఇందులో ఇప్పటికే 160 పోస్టులను భర్తీ చేశామన్నారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ చైర్మన్ రాజయ్య యాదవ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరలో ఉచిత వైఫై సేవలు



వరంగల్, నమస్తేతెలంగాణ: మేడారం జాతరలో ఉచిత వైఫై సేవలు అందించనున్నట్టు మహబూబాబాద్ ఎంపీ సీతారాం నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఉచితంగా వైఫై సేవలు అందించబోతున్నామన్నారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఉచిత వైఫై సేవల కోసం రూ.20 లక్షలను మంజూరు చేశారని చెప్పారు. ఇందుకోసం దేశంలోనే మొదటిసారిగా 20 హాట్‌స్పాట్‌లను 100 ఎంబీపీఎస్ స్పీడ్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి రోజు ఒక్కరికి 500ఎంబీ వైఫై సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. రోజూ 3,45,600 మందికి సేవలందుతాయని చెప్పారు. రూ.4 కోట్లతో పాలంపేట నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి, బండ్‌పై రుద్రమదేవి విగ్రహంతో పాటు తెలంగాణ వైతాళికుల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.



కేంద్ర ప్రభుత్వ అధికారులకు మ్యాప్ ద్వారా వివరిస్తున్న ప్రాజెక్టు సీఈ వెంకటేశ్వర్లు

కన్నెపల్లిలో కేంద్ర అధికారుల అధ్యయనం

మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ల సందర్శన

కాళేశ్వరం/మహదేవపూర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సాగునీటి బరాజ్‌లను కేంద్ర అధికారుల బృందం పరిశీలించింది. ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర జల వనరుల శాఖ పూర్తి స్థాయి అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం అధికారుల బృందం కాళేశ్వరానికి చేరుకుంది. ఈమేరకు కేంద్ర జల వనరుల శాఖ (సీడబ్ల్యూసీ) చీఫ్ ఇంజినీర్ సీకేఎల్ దాస్, హైడ్రాలజీ డైరెక్టర్ ఎన్ఎన్ రాజు, ఇరిగేషన్ డైరెక్టర్ రాజీవ్ కుమార్, సీఏ డైరెక్టర్ ఎన్.ముఖర్జీ తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ముందుగా కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. పనుల ప్రగతిని పరిశీలించారు. ప్రాజెక్టు అధికారులు మ్యాప్ ద్వారా పంప్‌హౌస్ సామర్థ్యం, దాని ప్రయోజనాలను వివరించారు. అక్కడ నుంచి మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లకు చేరుకుని పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలో టీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

గులాబీ పార్టీలోకి భారీగా వలసలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి రోజురోజుకూ వలసలు పెరుగుతున్నాయి. సోమవారం కూడా పెద్ద ఎత్తున టీఆర్ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్ మండలం భీంసరిలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన వందమంది యువకులు టీఆర్ఎస్‌లో చేరారు. వీరికి అటవీ శాఖ మంత్రి జోగు రామన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నడిపల్లి తండాకు చెందిన టీడీపీ, కాంగ్రెస్ కార్యకర్తలు సుమారు 100 మంది నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన సూర్యవంశి ఆరెకటికె సంఘ కుల పెద్దలు, సంఘ సభ్యులు, యూత్ సభ్యులు దాదాపు వందమంది ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలం కన్మనూర్‌లో టీడీపీ, కాంగ్రెస్ నుంచి 25 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి సమక్షంలో, నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెల్మినేడు యాదవ సంఘం ఆధ్వర్యంలో 30 మంది నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన పలువురు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలో 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభించి వ్యాయామం చేస్తున్న మంత్రి ఈటల. చిత్రంలో మంత్రి కేటీఆర్, ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గంగుల కమలాకర్



సిరిసిల్ల మండలం పెద్దూరులో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, ఈటల. చిత్రంలో ఎంపీ వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు తదితరులు

ఆత్మగౌరవ ప్రతీకగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు

- గత పాలనలో డబ్బులివ్వందే ఇందిరమ్మ ఇండ్ల పని కాలేదు..
- స్వరాష్ట్రంలో పైసాలేకుండా విల్లాల్లాంటి భవనాలు
- ఇంటింటికీ తాగునీరు, చేనుకు సాగు నీరే సర్కారు లక్ష్యం: ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రి ఈటలతో కలిసి అభివృద్ధి పనులకు భూమిపూజ

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకే డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తున్నాం.. గత ప్రభుత్వాల పాలనలో పైసలివ్వందే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకపోయేవి.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పైసా ఖర్చులేకుండా విల్లాలను తలపించేలా రెండు పడక గదుల ఇండ్లు కట్టిస్తున్నాం' అని మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 24గంటల కరెంటు ఇవ్వడం చరిత్రాత్మకమని, ఇది సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం 3.57 గంటలకు కరీంనగర్ నుంచి హెలీక్యాప్టర్ ద్వారా సిరిసిల్లకు చేరుకొన్నారు. అక్కడినుంచి కారులో సిరిసిల్ల మండలం పెద్దూరుకు వెళ్లి డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో అంబేద్కర్ భవనం, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ, అంబేద్కర్ చౌరస్తాలోని ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సంఘ భవనాన్ని ప్రారంభించారు. సమైక్య పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం పేదలు ప్రజాప్రతినిధులు, కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగారని, పైసలు ఇవ్వందే పని కాలేదని మంత్రి కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు సంపన్నులు నివసించే విల్లాల మాదిరిగా డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించిందన్నారు. ఈ ఇండ్ల మంజూరులో అర్హులందరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామన్నారు. వ్యవసాయాన్ని పండుగలా చేయాలన్నది సీఎం సంకల్పమని, అందుకే దేశంలో ఏ ప్రభుత్వం అమలుచేయని విధంగా ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడి ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నత్తనడక సాగిన ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తున్నామని, వాటన్నింటిని త్వరితగతిన పూర్తిచేసి ఇంటింటికీ తాగు నీరు, ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ వస్తే కరెంటు లేక చీకటి రాజ్యం అవుతుందంటూ హేళన చేసిన సమైక్య పాలకుల కండ్లు తెరిపించేలా రెప్పపాటు కోతల్లేకుండా ఉచితంగా కరెంటు ఇసున్నామని, అందుకు గర్వంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో రైతుల కండ్లల్లో సంతోషం కనిపిస్తుందన్నారు. ఇంటింటికీ తాగు నీరందించే మిషన్ భగీరథ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు నాడు రోడ్డు కూడా దిక్కులేని పరిస్థితని.. నేడు ప్రతి పల్లెకు తళతళ మెరిసే రోడ్లు వేశామన్నారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ వస్తేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుతాయని కేసీఆర్ పదేపదే అంటుండేవారని గుర్తుచేశారు. సాధించుకున్న తెలంగాణకు బంగారు బాటలు వేయాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ ముందుకు వెళుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, వేములవాడ, మానకొండూర్ ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, రసమయి బాలకిషన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్య, కలెక్టర్ కృష్ణభాస్కర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

25 వేల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యం

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం/కోడేరు:

ఘణపురం బ్రాంచ్ కెనాల్ ద్వారా 25వేల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకున్నదని ప్రణాళికా సం ఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎంజీకేఎల్ఐ ప్రధాన కాల్వ నుంచి గణపసముద్రం చెరువుకు నీటిని తరలించేందుకు రూ. 109 కోట్లతో చేపట్టిన కాల్వ పనులు పూర్తికావటంతో సోమవారం నీటిని విడుదల చేసి సభలో మాట్లాడారు. ఖిల్లాఘణపురం, పెద్దమందడి, అడ్డాకుల మండలాలకు ఎంజీకేఎల్ఐ నీటిని తరలించేలా పనులను చేపట్టామన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కేవలం 11 నెలల్లో పూర్తి చేయించామన్నారు. ఈ కాల్వ కోసం 490 ఎకరాల భూ సేకరణ సర్వే పనులు పూర్తి స్థాయిలో జరిగిందని, జీవో 123 ప్రకారం రైతులకు నష్టపరిహారం అందిస్తున్నామని, ఇందుకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. 11 నెలల్లోనే గణపసముద్రానికి సాగునీరు తెచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేన్నారు.

రికార్డు స్థాయిలో 'పాలమూరు' పనులు

సీఎం కేసీఆర్ చొరువతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ఆసియాలోనే ఇంత పెద్ద ప్రాజెక్టు ఎక్కడా లేదని సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం తీగలపల్లి శివారులో కొనసాగుతున్న ఏదల(వీరాంజనేయ)రిజర్వాయర్ పనుల వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 31 వరకు ఏదుల రిజర్వాయర్‌కు సంబంధించి కట్ట నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారన్నారు.



వనపర్తి జిల్లా ఘణపురం బ్రాంచి కెనాల్ వద్ద నీటిని విడుదల చేసి పూజలు చేస్తున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

తెల్లారిన బతుకులు

- గద్వాల వద్ద బోల్తా పడిన బొలేరో.. ఐదుగురు కూలీల దుర్మరణం
- ముగ్గురి పరిస్థితి విషమం.. 17 మందికి స్వల్ప గాయాలు
- మృతులంతా పత్తి మిల్లులో దినసరి కూలీలు

ధరూర్/గద్వాలక్రైం: తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకున్నది. కూలీలను తరలిస్తున్న బొలేరో వాహనం బోల్తా పడటంతో ఐదుగురు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మరో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. 17మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు జిల్లా కేంద్రంలోని సీడ్ ఆర్గనైజర్లకు చెందిన పత్తి మిల్లుల్లో దినసరి కూలీలు పని చేస్తున్నారు. యజమానులతో ఒప్పందాలు కుదుర్చుకొని షిఫ్టుల ప్రకారం విధులు న్విర్తిస్తున్నారు. ఆదివారం రాత్రి షిఫ్ట్‌లో ఉన్న ధరూరు మండలం చిన్నపాడు, ఎమ్ములోంపల్లి గ్రామాలకు చెందిన 36మంది కూలీలు పనులు ముగించుకొని, సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో స్వగ్రామాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్కడే కూలీగా పని చేస్తూ, బొలేరో వాహనాన్ని నడిపే డ్రైవర్ రాముడు వద్దకు చేరుకున్నారు. అతని వాహనంలో అందరూ ఎక్కి స్వగ్రామాలకు బయల్దేరారు. గద్వాల నుంచి బయల్దేరిన వాహనం మార్గమధ్యలో గద్వాల మండలం గోనుపాడు శివారులో ఉన్న పారుచర్ల స్టేజీ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో చిన్నపాడుకు చెందిన లోహితాచారి (45), గీతమ్మ (30), వెంకటన్న(37), కోట్ల వెంకటన్న(60), ఎమ్ములోంపల్లికి చెందిన అరుణమ్మ (23) తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అంజనమ్మ, నర్సమ్మ, నరేశ్, రమేశ్, శంకరమ్మ, గోవిందు, ఊశన్న, బాలు, తిమ్మప్పలకు తీవ్ర గాయాలు కాగా, కర్నూలు దవాఖానకు తరలించారు. వీరిలో నరేశ్, రమేశ్ పరిస్థితి విషమంగా ఉంది. నర్సమ్మను హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. మరో 17 మందికి స్వల్ప గాయాలు కాగా, గద్వాల దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్పీ విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



గద్వాల మండలం పారుచర్ల స్టేజీ వద్ద అదుపు తప్పి బోల్తా పడిన బొలేరో వాహనం

ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమా..?

బొలేరో వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ రాముడు పత్తి మిల్లులో కూలీగా కూడా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి నైట్ షిఫ్టులో రాముడు పని చేసినట్టు స్థానిక కూలీలు చెప్పారు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు మిల్లులో పని ముగియడంతో ఐదుగంటల ప్రాంతంలో కూలీలను ఎక్కించుకొని చిన్నపాడుకు బయలుదేరారు. వాహనంలో అతనితో కలుపుకొని 37 మంది ఉన్నారు. అప్పటికే పని చేసి బాగా అలసిపోయిన రాముడు నిద్ర మత్తులో వాహనం తొలడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల బంధువులు సంఘటనా స్థలం వద్ద ఆందోళనకు దిగారు. జిన్నింగ్ మిల్లుల యజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎస్పీ, డీఎస్పీతో వాగ్వాదానికి దిగారు. ఎస్పీ విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ డ్రైవర్ అజాగ్రతతోపాటు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం వల్లే ప్రమాదం సంభవించిందని ఎస్పీ తెలిపారు. జిన్నింగ్ మిల్లుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

భర్త గొంతుకోసి చంపిన భార్య

- రాజన్న ఆలయ గుడి చెరువు సమీపంలో దారుణం



బాలయ్య (ఫైల్), నిందితురాలు నర్సవ్వ

వేములవాడ, నమస్తే తెలంగాణ: కలిసి ఏడడుగులు నడిచిన భార్యే భర్త గొంతు కోసి హతమార్చింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం ఘనపూర్‌కు చెందిన బండి నర్సవ్వ-బాలయ్య(40) దంపతులు. పదేండ్లుగా బాలయ్య ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్తొస్తున్నాడు. 20రోజుల క్రితం బాలయ్య స్వగ్రామానికి తిరిగొచ్చాడు. ఆదివారం సాయంత్రం వారు రాజన్న దర్శనానికి వేములవాడకు చేరుకున్నారు. దర్శనానంతరం అద్దె గదులు దొరక్కపోవడంతో ఆలయ గుడిచెరువు సమీపంలోని పార్కింగ్ స్థలంలో బస చేశారు. అర్ధరాత్రి దంపతులు గొడువపడ్డారు. ఆగ్రహం ఊగిపోయిన నర్సవ్వ తన వద్ద ఉన్న కత్తితో అప్పటికే మద్యం సేవించి ఉన్న భర్త గొంతు కోసి చంపినట్టు తెలుస్తున్నది. అక్కడే ఉన్న భక్తులు కొందరు బాలయ్య అరుపులు విని పోలీసులకు సమాచారం అందించారు. వేములవాడ డీఎస్పీ అవధాని చంద్రశేఖర్, సీఐ వెంకటస్వామి అక్కడికి చేరుకోగా అప్పటికే బాలయ్య మృతిచెందాడు. నర్సవ్వకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండటంతో ఇటీవల గొడువలు జరిగినట్టు సమాచారం. ఆదివారం రాత్రి జరిగిన గొడువలో నర్సవ్వ చేతికి కూడా గాయాలైనట్టుగా తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తలకిందులు చేసి విద్యార్థులను చితకబాది..

ఎస్టీ హాస్టల్‌లో వసతిగృహ అధికారి నిర్వాకం



విద్యార్థులను తలకిందులుగా నిల్చోబెట్టి కొడుతున్న టీచర్

జహీరాబాద్, నమస్తే తెలంగాణ: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఎస్టీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులను తలకిందులు చేసి వసతి గృహ అధికారి చితకబాదిన ఘటన జిల్లాలో కలకలం సృష్టించింది, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న పరమేశ్, లక్ష్మణ్‌లు ఎస్టీ హాస్టల్‌లో ఉంటున్నారు. వీరు గొడువ పడటంతో ఈనెల 5వ తేదీ సాయంత్రం వసతి గృహ అధికారి వారిని గోడకు తలకిందులుగా నిలబెట్టి పైపుతో చితకబాదారు. ఈ విషయం సోషల్‌మీడియా వైరల్ కావడంతో జిల్లా అధికారులు వెంటనే స్పందించారు. ఆర్డీవో అబ్దుల్ హమీద్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మణ్యమ్మ, డీఎస్పీ నల్లమల రవి, ఎస్సై ప్రభాకర్‌రావు, ఎంవో బస్వరాజ్ సోమవారం హాస్టల్‌కు వెళ్లి విచారణ జరిపారు. బాధిత విద్యార్థులతోనూ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు.

కీచక టీచర్ అకృత్యాలకు విద్యార్థి బలి

హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య

రఘునాథపాలెం: ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులకు ఖమ్మంలో తొమ్మిదోతరగతి విద్యార్థి బలయ్యాడు. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. ఏన్కూరు మండలం కేసుపల్లికి చెందిన జ్యోతి ప్రశాంత్(16) ఖమ్మం శివారులోని గోపాలపురంలోగల ప్రైవేట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతూ అదే పాఠశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నాడు. ఫిజికల్ సైన్స్ తరగతులు బోధించే పర్వత రమేశ్ హాస్టల్‌కు వార్డెన్‌గా పని చేస్తున్నాడు. రమేశ్ రాత్రి వేళల్లో హాస్టల్ విద్యార్థులతో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. గదిలో ఒక్కడినే పడుకుంటే భయమేస్తుందని చెప్పి ఓ రోజు జ్యోతి ప్రశాంత్‌ను తీసుకెళ్లాడు. గాఢనిద్రలో ఉన్న ప్రశాంత్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. శనివారం మరో విద్యార్థి పట్ల అగౌరవంగా ప్రవర్తించాడు. వార్డెన్ తీరుపై సోమవారం ఆందోళనకు దిగిన విద్యార్థులను కరస్పాండెంట్ రాంప్రసాద్ వచ్చి టీసీలు ఇచ్చి పంపిస్తానని హెచ్చరించారు. ఈ ఘటనతో మనస్తాపం చెందిన ప్రశాంత్ మధ్యాహ్నం తోటి విద్యార్థులు భోజనానికి వెళ్లినప్పుడు హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొన్నాడు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
మంగళవారం 9 జనవరి 2018

కివీస్ పర్యటనకు శ్రీజేష్

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌లో త్వరలో జరుగబోయే నాలుగు దేశాల టోర్నీ కోసం సోమవారం 20 మందితో భారత హాకీ జట్టును ప్రకటించారు. దాదాపు ఎనిమిది నెలల తర్వాత గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ జట్టుకు ఎంపికయ్యాడు. మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్‌సింగ్ కెప్టెన్‌గా చింగ్లేన్సన సింగ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2016 జూనియర్ ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు గోల్‌కీపర్ క్రిషన్ బహదూర్‌పాథక్‌తో పాటు దిల్‌ప్రీత్‌సింగ్, వివేక్‌సాగర్ ప్రసాద్ కొత్తగా జట్టులోకొచ్చారు. ఈనెల 17న మొదలయ్యే టోర్నీలో న్యూజిలాండ్‌తో పాటు భారత్, బెల్జియం, జపాన్ పోటీలో ఉన్నాయి.

హెచ్‌సీఏ తీరుపై అజర్ ఆగ్రహం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: పదేండ్లు భారతజట్టు కెప్టెన్‌గా పనిచేసిన తనను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) తీవ్రంగా అవమానించిందని అజరుద్దీన్ విమర్శించాడు. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేకానంద ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అనుమతించకపోవడంతో సుమారు గంటసేపు బయటే నిల్చున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇది తనను తీవ్రంగా అవమానించడమేనని, హెచ్‌సీఏ పనితీరు సవ్యంగా లేదని సోమవారం ఈ ఘటనపై స్పందించాడు. 'నేను హైదరాబాద్ ఆటగాడిని. పదేండ్లు జాతీయజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాను. కనీసం జీవితంలో ఒక్కసారైన బ్యాట్ లేదా బంతి పట్టనివాళ్లే క్రికెట్ పరిపాలన కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ సంఘంలోని సభ్యులంతా మద్దతు పలికితే హెచ్‌సీఏ అధ్యక్షుడిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను' అని అజర్ పేర్కొన్నాడు. ఎటువంటి ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేస్తుండడం బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. కేవలం హెచ్‌సీఏ అధ్యక్షపదవికి పోటీ పడుతుండడంతోనే 17 ఏండ్ల కెరీర్..అందులో పదేండ్లు జాతీయజట్టుసారథిగా వ్యవహరించిన తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నట్లు వివరించాడు. మ్యాచ్ ఫిక్సింగ్‌లో పాల్గొన్న నేరానికి బీసీసీఐ అజర్‌పై జీవితకాలం నిషేధించిన సంగతి తెలిసిందే.


రెండోరౌండ్‌లో నిఖత్

జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్



రోహ్‌తక్: జూనియర్ మాజీ ప్రపంచ చాంపియన్, మన రాష్ట్రానికి చెందిన నిఖత్ జరీన్ జాతీయ మహిళల రెండో ఎలైట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ముందంజ వేసింది. జాతీయ బాక్సింగ్ అకాడమీలో సోమవారం జరిగిన ఫ్లయ్‌వెయిట్ కేటగిరిలో భాగంగా జరిగిన బౌట్‌లో నిఖత్ జరీన్ 5-0 పాయింట్ల తేడాతో కేరళ రాష్ట్రానికి చెందిన అంజుసబుపై ఘన విజయం సాధించి రెండోరౌండ్‌కు చేరింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ గతేడాది కాలంగా గాయంతో బాక్సింగ్ రింగ్‌కు దూరమైంది. ఇటీవలే గాయం నుంచి కోలుకుని తొలిసారిగా ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొని తొలిరౌండ్‌లో విజయంతో తన ఆగమనాన్ని ఘనంగా చాటింది. బాక్సింగ్‌కు రింగ్‌కు దూరమైనా జరీన్ పంచ్ పవర్ తగ్గలేదు. దూకుడుగా ప్రత్యర్థిని తన పంచ్‌లతో దిమ్మతిరిగేలా చేసి అలవోకగా రెండో రౌండ్ చేరింది. 'ఏడాది విరామం తర్వాత మళ్లీ బాక్సింగ్‌రింగ్‌లో దిగి ఘన విజయం నమోదుచేయడం సంతోషాన్ని కలిగిస్తున్నది. బంగారు పతకం సాధించేవరకు ఇదే ఫాం కొనసాగించాలని కోరుకుంటున్నాను' అని జరీనా మ్యాచ్ అనంతరం వ్యాఖ్యానించింది. కాగా, మరోవైపు ప్రపంచ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ స్వర్ణ పతక విజేత, హర్యానాకు చెందిన సాక్షి చోప్రా కూడా రెండో రౌండ్ చేరింది. లైట్‌ఫ్లై వెయిట్ విభాగంలో దీపికా వర్మ, మునిల్యా, రాజేశ్ నర్వాల్.. బాంటమ్ వెయిట్‌లో మీనా కుమారి, సాంతియా తదితరులు విజయాలతో రెండో రౌండ్ చేరారు.

పెద్ది రాహుల్‌కు ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: మన రాష్ట్రానికి చెందినపెద్ది రాహుల్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సంపాదించాడు.ఇటలీలోని వెనిస్‌లో ముగిసిన ఇన్విటేషనల్ చెస్ చాంపియన్ సందర్భంగా మూడో ఇంటర్నేషనల్ నార్మ్ సాధించడంతో మనదేశం నుంచి ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా అందుకున్నాడు. హైదరాద్ నగరంలోని కొంపల్లికి చెందిన రాహుల్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాసాధించడంతో అతని తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేసారు. ఫిడేకు అధికార ప్రతినిధి కుకూస్ స్టోక్ నుంచి రాహుల్ ఐఎం హోదా అందుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన నారాయణ రామరాజు కోచ్‌గా రాహుల్‌ను ముందుకు నడిపిస్తున్నాడు. 2400 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించి గ్రాండ్‌మాస్టర్ హోదా దిశగా కదులుతున్నాడు. సాధు వైష్ణవి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న రాహుల్ 15 ఏండ్ల 9 రోజుల వయసులోనే ఐఎం నార్మ్ సాధనతో తెలంగాణ రాష్ట్రం నుంచి ఐఎం నార్మ్ సాధించిన అత్యంత పిన్నవయస్కుడిగా, దేశంలో ఈ ఘనత సాధించిన మూడో యువ చెస్ ఆటగాడిగా రికార్డులు నెలకొల్పాడు. 2017 ఆగస్టులో లాత్విలో జరిగిన టోర్నీలో తొలి ఐఎం నార్మ్ సాధించగా.. డిసెంబర్ 2017లో నెదర్లాండ్స్‌లో జరిగిన టోర్నీలో రెండోనార్మ్ సంపాదించాడు. గతేడాది ముగిసిన ప్రపంచ యువ చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. ఆసియా అండర్-10 చెస్ టోర్నీలో కాంస్యం అందుకున్నాడు.

మూడో ర్యాంకుకు ఆసీస్

దుబాయ్: యాషెష్ సిరీస్‌లో ఇంగ్లండ్‌పై 4-0 సిరీస్ విజయంతో ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో ఆసీస్(104) ఐదు నుంచి మూడో ర్యాంక్‌కు చేరింది. మరోవైపు ఇంగ్లండ్(99) మూడు నుం చి ఐదుకు పడింది. మరోవైపు భారత్ (124) నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉండగా, దక్షిణాఫ్రికా (111) రెండులో కొనసాగుతున్నది. జొహాన్నెస్‌బర్గ్‌లో ఇరు జట్ల మధ్య చివరి టెస్ట్ ముగిసిన తర్వాత ర్యాంకింగ్స్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి.

ఒక్క మ్యాచ్ ఆడకుండానే..



సర్తాక్

న్యూఢిల్లీ: ప్రతిభకు పట్టం కట్టాల్సింది పోయి.. పైరవీలకు పెద్దపీట వేశారు. ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని బీహార్ రాజకీయ నేత పప్పు యాదవ్ తనయుడు సర్తాక్ రంజన్‌ను ఢిల్లీ అండర్-23 జట్టుకు ఎంపిక చేయడం వివాదస్పదంగా మారింది. ఢిల్లీ జూనియర్ జట్టు తరపున టాప్ స్కోరర్‌గా నిలిచిన హితేన్ దలాల్‌ను రిజర్వ్‌గా ఎంపిక చేసి రంజన్‌కు సెలెక్టర్లు అవకాశం కల్పించడం ఆశ్చర్యంలో పడేసింది. అతుల్ వాసన్, హరీ గిద్వానీ, రాబిన్‌సింగ్(జూనియర్) నేతృత్వంలోని ముగ్గురు సభ్యులు సెలెక్షన్ కమిటీ సర్తాక్‌ను ఎంపిక చేయడం విమర్శలకు తావిస్తున్నది.

ఊరించి.. ఉసూరుమనిపించి

తొలి టెస్టులో భారత్ ఓటమి
72 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు
ఫిలాండర్‌కు ఆరు వికెట్లు
టీమ్‌ఇండియా పేసర్ల శ్రమ వృథా


చరిత్రను తిరుగరాసేందుకు అందివచ్చిన తొలి అవకాశం చేజారింది...ఊరిస్తున్న టార్గెట్ ఒకవైపు...వణుకు పుట్టించే పేసర్లు మరోవైపు...ఇంకో రోజు ఆట మిగిలి ఉంది...ఏడుగురు నిఖార్సైన బ్యాట్స్‌మెన్ అందుబాటులో ఉన్నారు.. గెలుపు కష్టమేమీ కాదనుకున్నారు...కానీ భారత పేస్ బౌలర్లే రెచ్చిపోయిన చోట, సొంతగడ్డపై సఫారీలు సునామీలా విరుచుకుపడలేరా..? సరిగ్గా అదే జరిగింది. గత పర్యటనలో భారత్‌కు చుక్కలు చూపించిన ఫిలాండర్ ఈసారి కూడా ఏ మాత్రం కుదురుకోనివ్వలేదు...కోహ్లీ కాసేపు ఊరించినా...అశ్విన్ ఆశలు రేపినా..ఆట ప్రత్యర్థి వశమైంది...ఊరించి ఉసూరుమనిపించడం మాత్రం మనోళ్ల వంతైంది.



6/44
టెస్టుల్లో దక్షిణాఫ్రికా బౌలర్ ఫిలాండర్‌కు ఇదే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన.

అశ్విన్ (37)

కేప్‌టౌన్: 208 పరుగుల లక్ష్యాన్ని చూసి.. విజయంపై భారత్ ఆశలుపెట్టుకున్నా..ఎక్కడో ఓ మూల ఆతిథ్య బౌలర్ల ధాటికి తట్టుకోగలమా..? అనే సందేహాలు అందరి మదిలోనూ మెదిలాయి. ఊహించిందే జరిగింది. దక్షిణాఫ్రికా పేసర్ల దెబ్బకు భారత బ్యాట్స్‌మెన్ బిక్కుబిక్కుమనుకుంటూ పెవిలియన్ చేరారు.అశ్విన్ (37), కోహ్లీ (28) తప్ప మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమవడం... 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఫిలాండర్ (6/42)కు తోడు మోర్కెల్ (2/39), రబాడ (2/41) రెచ్చిపోవడంతో భారత్ 135 పరుగులకే కుప్పకూలింది. 72 పరుగుల తేడాతో గెలిచిన దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో టెస్ట్ మ్యాచ్ ఈ నెల 13న సెంచూరియన్‌లో మొదలవుతుంది.



కోహ్లీ (28)

తడబడిన టాపార్డర్:
ఓపెనర్లు మురళీ విజయ్, శిఖర్ ధవన్ ఆరంభంలో నిలకడగా ఆడి మ్యాచ్‌పై ఆశలు రేకెత్తించారు. మోర్కెల్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో ఫోర్ కొట్టిన విజయ్ బౌండరీల ఖాతాను తెరిచాడు. ఆ తర్వాత ధవన్ వరుస ఓవర్లలో రెండు ఫోర్లు కొట్టాడు. ఇదే ఊపులో మోర్కెల్ వేసిన బంతిని పుల్‌షాట్ కొట్టగా...బంతిని గల్లీలో ఉన్న సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ మోరిస్ అందుకున్నాడు. భారత్ 30 పరుగుల వద్ద ధవన్ (16)ను తొలి వికెట్‌గా కోల్పోయింది. ఆ తర్వాత కొద్దిసేపటికే విజయ్ (13)ను ఫిలాండర్ బోల్తా కొట్టించాడు. అంతకు ముందే రెండుసార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి డీఆర్‌ఎస్ ద్వారా గట్టెక్కిన విజయ్ ఈసారి మాత్రం మూడో స్లిప్‌లో ఉన్న డివిలియర్స్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత పుజార (4) కూడా నిరాశపరిచాడు.

కీలక మలుపు:
39 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన భారత్‌ను కెప్టెన్ కోహ్లీ, రోహిత్ (10) ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా కోహ్లీ చూడచక్కని షాట్లతో క్రీజులో కుదురుకున్నట్టే కనిపించాడు. రోహిత్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 32 పరుగులు జోడించిన దశలో ఫిలాండర్ వరుసగా కోహ్లీ, రోహిత్‌ను అవుట్ చేసి భారత్ ఆశలపై నీళ్లు చల్లాడు. ఫిలాండర్ వేసిన బంతికి కోహ్లీ వికెట్ల ముందు దొరికిపోగా..రోహిత్ నిర్లక్ష్యంగా ఆడి బౌల్డ్ అయ్యాడు. అంతకు ముందే రబాడ బౌలింగ్‌లో రోహిత్ ఇచ్చిన క్యాచ్‌ను మహారాజ్ వదిలియేడంతో జీవదానం పొందాడు. ఆ తర్వాత ఎదుర్కొన్న రెండో బంతికే రోహిత్ అవుటయ్యాడు. దీంతో భారత్ 76 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఇక తొలి ఇన్నింగ్స్ హీరో పాండ్యపై భారీ అంచనాలుండగా..అతడు ఒక్క పరుగే చేసి రబాడ బౌలింగ్‌లో డివిలియర్స్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో పెవిలియన్ చేరాడు. టీ విరామానికి ముందు రబాడ, సాహా (8)ను వికెట్ల ముందు దొరుకబుచ్చుకున్నాడు.

అశ్విన్ పోరాటం:
82/7తో టీ విరామం అనంతరం ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్‌ను భువీ, అశ్విన్ జోడి ఆదుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా అశ్విన్ దక్షిణాఫ్రికా బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ చెత్త బంతుల్ని బౌండరీలుగా మలిచాడు. రబాడ వేసిన ఇన్నింగ్స్ 35వ ఓవర్ చివరి బంతికి బౌండరీ కొట్టి భారత్ స్కోరును 100 పరుగులకు చేర్చాడు. భువీతో కలిసి ఎనిమిదో వికెట్‌కు విలువైన 49 పరుగులు జోడించాడు. ఈ దశలో బౌలింగ్ చేసిన ఫిలాండర్ ఒకే ఓవర్‌లో అశ్విన్, షమి (4), బుమ్రా (0)ను ఔట్ చేసి దక్షిణాఫ్రికాకు విజయాన్ని అందించాడు.



రోహిత్‌శర్మ (10)

భారత పేసర్ల జోరు:
అంతకు ముందు (రెండో రోజు) ఓవర్‌నైట్ స్కోర్ 65/2తో నాలుగో రోజు ఆటను కొనసాగించిన సఫారీలకు భారత పేసర్లు చుక్కలు చూపించారు. ఫలితంగా నాలుగో రోజు ఆటలో 75 పరుగులు చేసి చివరి 8 వికెట్లు కోల్పోయింది. మహ్మద్ షమీ (3/28), బుమ్రా (3/39) సీమ్ అనుకూలతను సద్వినియోగం చేసుకుంటూ దక్షిణాఫ్రికా మిడిలార్డర్‌ను కుప్పకూల్చగా..భువీ చివర్లో రెండు (2/33) వికెట్లు తీశాడు. దీంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 41.2 ఓవర్లలో 130 పరుగులకే ఆలౌట్ అయింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ ఆమ్లా (4)ను షమీ అవుట్ చేసి వికెట్ల వేటకు తెరలేపాడు.ఇదే ఊపులో నైట్ వాచ్‌మన్ రబాడ(5)నూ పెవిలియన్‌కు పంపాడు.ఆ తర్వాత భువీ స్థానంలో బౌలింగ్‌కు దిగిన బుమ్రా...వరుస ఓవర్లలో డుప్లెసిస్ (0), డికాక్ (8)ను ఔట్ చేశాడు. ఇక షమీ మరోసారి రంగంలోకి దిగి ఫిలాండర్‌ను డకౌట్‌గా పెవిలియన్‌కు పంపాడు.డివిలియర్స్, కేశవ్ మహారాజ్ స్కోరు బోర్డును వంద పరుగులు దాటించారు. ఈ దశలో భువీ,మహారాజ్ (15)ను,అనంతరం మోర్కెల్ (2)ను పెవిలియన్‌కు పంపాడు. మరో ఎండ్‌లో ఒంటరిపోరాటం చేస్తున్న డివిలియర్స్ (35)ను బుమ్రా ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది.

1 టెస్ట్ మ్యాచ్‌లో నలుగురు భారత పేస్ బౌలర్లు కనీసం ఒక వికెట్ తీయడం ఇదే తొలిసారి.

2 భారత్ పై దక్షిణాఫ్రికాకు స్వదేశంలో రెండో ఇన్నింగ్స్‌లో ఇదే (130) రెండో అత్యల్ప స్కోరు.

6 భారత్ ఒక టెస్ట్ మ్యాచ్ రెండు ఇన్నింగ్సుల్లో 100 పరుగుల లోపే 7 వికెట్లు కోల్పోవడం ఇది ఆరోసారి.

10 ఈ మ్యాచ్‌లో వికెట్ కీపర్ సాహా చేసిన ఔట్ల సంఖ్య. భారత్ తరపున ఇదే రికార్డు.. ధోనీ (9)ని అధిగమించాడు.

స్కోర్ బోర్డు:

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286; **భారత్ తొలి ఇన్నింగ్స్** 209; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ :** మార్క్‌రామ్ (సి) కుమార్ (బి) పాండ్య 34, ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్య 25, రబాడ (సి) కోహ్లీ (బి) షమి 5, ఆమ్లా (సి) రోహిత్ (బి) షమి 4, డివిలియర్స్ (సి) కుమార్ (బి) బుమ్రా 35, డుప్లెసిస్ (సి) సాహా (బి) బుమ్రా 0, డికాక్ (సి) సాహా (బి) బుమ్రా 8, ఫిలాండర్ ఎల్బీ (బి) షమి 0, మహారాజ్ (సి) సాహా (బి) కుమార్ 15, మోర్కెల్ (సి) సాహా (బి) కుమార్ 2, స్టెయిన్ నాటౌట్ 0. **ఎక్స్‌ట్రాలు:** 2, **మొత్తం** 41.2 ఓవర్లలో 130 ఆలౌట్ **వికెట్ల పతనం:**1-52, 2- 59, 3-66, 4- 73, 5-82, 6- 92, 7- 95, 8- 122, 9- 130, 10-130 **బౌలింగ్:** కుమార్ 11-5-33-2, బుమ్రా 11.2 -1-39-3, షమి 12- 3- 28- 3, పాండ్య 6-0-27-2, అశ్విన్ 1-0-3-0.

భారత్ రెండో ఇన్నింగ్స్ : విజయ్ (సి) డివిలియర్స్ (బి) ఫిలాండర్ 13, ధవన్ (సి) సబ్-మోరిస్ (బి) మోర్కెల్ 16, పుజార (సి) డికాక్ (బి) మోర్కెల్ 4, కోహ్లీ ఎల్బీ (బి) ఫిలాండర్ 28, రోహిత్ (బి) ఫిలాండర్ 10, సాహా ఎల్బీ (బి) రబాడ 8, పాండ్య (సి) డివిలియర్స్ (బి) రబాడ 1, అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 37, భువనేశ్వర్ నాటౌట్ 13, షమి (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 4, బుమ్రా (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 0, **ఎక్స్‌ట్రాలు:**1, **మొత్తం:** 42.4 ఓవర్లలో 135 ఆలౌట్.
వికెట్ల పతనం: 1-30, 2-30, 3-39, 4-71, 5-76, 6-77, 7-82, 8-131, 9-135, 10-135.**బౌలింగ్:** ఫిలాండర్ 15.4-4-42-6, మోర్కెల్ 11-1-39-2, రబాడ 12-2-41-2, మహారాజ్ 4-1-12-0

ఆస్ట్రేలియా అజేయంగా..

సిడ్నీ టెస్ట్‌లో ఇంగ్లండ్‌పై ఘనవిజయం .. యాషెస్ సిరీస్ 4-0తో కైవసం



కంగారూలు కదం తొక్కారు. సొంతగడ్డపై తామెంత ప్రమాదకారులమో ప్రపంచానికి మరోమారు ఘనంగా చాటిచెప్పారు. అంచనాలకు భిన్నంగా ఇంగ్లండ్‌పై అన్నింటా ఆధిపత్యం ప్రదర్శిస్తూ ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌ను తిరిగి దక్కించుకున్నారు. కెప్టెన్ స్టీవ్‌స్మిత్ పరుగుల ప్రవాహానికి తోడు సమిష్టి బౌలింగ్ ప్రదర్శనతో సిరీస్‌లో అజేయంగా నిలుస్తూ 4-0తో నిలిచారు. వరుస విజయాల జోరును కొనసాగిస్తూ ఆఖరిదైన సిడ్నీలోనూ ఇంగ్లండ్‌ను చిత్తుచిత్తుగా ఓడిస్తూ జయకేతనం ఎగురవేశారు. భారీ అంచనాలతో ఆసీస్ గడ్డపై అడుగుపెట్టిన ఇంగ్లీష్ జట్టు కనీసం ఒక్క విజయం లేకుండానే యాషెస్‌ను అలవోకగా సమర్పించుకుంది.

సిడ్నీ: ఘన చరిత్ర కల్గిన యాషెస్ సిరీస్ ఈసారి ఏకపక్షంగా ముగిసింది. సొంతగడ్డపై తమకు ఎదురెవ్వరు లేరన్న రీతిలో ఆస్ట్రేలియా చెలరేగడంతో ప్రత్యర్థి ఇంగ్లండ్ నుంచి సరైన సమాధానం లేకపోయింది. డ్రా ముగిసిన మెల్‌బోర్న్ టెస్ట్ మినహా ఇంగ్లండ్..కనీసం పోటీనిచ్చిన పరిస్థితి లేకుండా పోయింది. 3-0 ఆధిక్యంతో ఆఖరిదైన సిడ్నీ టెస్ట్‌లో బరిలోకి దిగిన స్మిత్ సేన..ఇంగ్లండ్‌ను ఇన్నింగ్స్ 123 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. ఫలితంగా ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 4-0తో కైవసం చేసుకుని ఈయేడాదికి ఘనమైన ఆరంభం పలికింది. వరుస సెంచరీల హోరుతో 687 పరుగులు చేసిన కెప్టెన్ స్టీవ్‌స్మిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కగా, ఎనిమిది వికెట్లతో రాణించిన ప్యాట్ కమ్మిన్స్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య ఐదు వన్డేల సిరీస్ ఈనెల 14న మెల్‌బోర్న్‌లో మొదలవుతుంది.

కమ్మిన్స్ విజృంభణ
ఇంగ్లండ్ పతనాన్ని ఆసీస్ స్పీడ్‌స్టర్ ప్యాట్ కమ్మిన్స్(4/39) శాసించాడు. 93/4 ఓవర్‌నైట్ స్కోరుతో ఐదో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్..180 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ జోరూట్(58 రిటైర్ట్‌హర్ట్) మినహా ఎవరూ ఆసీస్ బౌలింగ్‌ను ఎదుర్కొలేకపోయారు. మొయిన్ అలీ ఔట్ తర్వాత క్రీజులోకొచ్చిన రూట్ అర్ధసెంచరీ తర్వాత ఆటను కొనసాగించలేకపోయాడు. తీవ్ర కడుపునొప్పి సమస్యతో సతమతమైన రూట్..రిటైర్‌హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. ఇదే అదునుగా ఆసీస్ తమ దాడులను తీవ్రతరం చేసింది. లంచ్ విరామం తర్వాత ఒకే ఓవర్లో బెయిర్‌స్టో(38), బ్రాడ్(4)ను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఇబ్బందుల్లోకి నెట్టేసాడు. ఇక్కణ్నుంచి ఇంగ్లీష్ జట్టు ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. టామ్ కుర్రాన్(23 నాటౌట్) ఆకట్టుకున్నా..అవతలి ఎండ్‌లో క్రేన్(2), అండర్సన్(2) వికెట్లు కోల్పోవడంతో ఇంగ్లండ్ 180 స్కోరుకే పరిమితమైంది. ఆఫ్‌స్పిన్నర్ నాథన్ లియాన్(3/54) మూడు వికెట్లు దక్కాయి.

సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 346 ఆలౌట్, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 649/7 డిక్లేర్డ్, **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 180 ఆలౌట్(రూట్ 58, కమ్మిన్స్ 4/39, లియాన్ 3/54)

చెన్నై స్మాషర్స్‌గెలుపు



సింధు

చెన్నై: పీబీఎల్ లీగ్ దశలో తన చివరి మ్యాచ్ ఆడిన చెన్నై స్మాషర్స్ 3-2తో బెంగళూరు బ్లాస్టర్స్‌పై విజయం సాధించింది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో మొదట పురుషుల డబుల్స్‌లో సుమిత్‌రెడ్డి, లీయాంగ్ (చెన్నై) జోడి 8-15, 15-14, 15-13తో మథియాస్, కిమ్ పై గెలువగా...మహిళల సింగిల్స్‌లో సింధు (చెన్నై) 15-9, 15-14తో గిల్‌మోర్‌ను చిత్తుచేసింది.ఆ తర్వాత జరిగిన రెండు పురుషుల సింగిల్స్ మ్యాచుల్లో బెంగళూరు గెలిచింది. అక్సెల్సెన్ (బెంగళూరు) 15-11, 6-15, 15-9తో టనాంగ్‌సాక్‌పై, సుభంకర్ దే (బెంగళూరు) 15-12, 15-12తో లెవర్డెజ్‌పై, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి, సా రంగ్ (బెంగళూరు) జోడి 15-14, 15-11తో సింధు, అడ్‌కాక్‌పై విజయం సాధించారు. ఇక ఈ మ్యాచ్‌లో గెలిచిన చెన్నైకి సెమీస్ అవకాశాలు మెరుగయ్యాయి.

పట్టురా..పట్టు

నేటి నుంచి ప్రొ రెజ్లింగ్ లీగ్



రా. 7.00 నుంచి సోనీ మ్యాక్స్, సోనీ ఈఎస్‌పీఎన్‌లో

న్యూఢిల్లీ: రెజ్లింగ్ పోటీలకు రంగం సిద్ధమైంది. ప్రత్యర్థులను పట్టుపట్టేందుకు కుస్తీ యోధులు కదనరంగంలోకి దూకేందుకు సమాయత్తమవుతున్నారు. దేశీయ, అంతర్జాతీయ స్టార్ రెజర్ల కలయికతో మంగళవారం ప్రొ రెజ్లింగ్ లీగ్(పీడబ్ల్యూఎల్)మూడో సీజన్‌కు తెరలేవనుంది. స్థానిక సిరి ఫోర్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఢిల్లీ సుల్తాన్స్, ముంబై మహారథి జట్ల మధ్య మొదటి పోరు జరుగనుంది. గత రెండు సీజన్లకు దూరమైన భారత స్టార్ రెజ్లర్ సుశీల్‌కుమార్..ఈసారి ఢిల్లీ తరపున 74కిలోల విభాగంలో పోటీపడుతున్నాడు. సుశీల్‌తో పాటు ఢిల్లీ జట్టులో అల్వారో అస్లాన్, సంగీత ఫోగట్ ఉన్నారు. మరోవైపు గత సీజన్‌లో మూడోస్థానంలో నిలిచిన ముంబైలో రియో(2016)స్వర్ణ పతక విజేత సొస్లాన్ రమనోవ్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య విజేత అండ్రీ పోటీలో ఉన్నారు.



గోల్డెన్ గ్లోబ్ అవార్డుతో హాస్య నటుడు అజీజ్ అన్సారీ

భారత సంతతి నటుడికి 'గోల్డెన్ గ్లోబ్'

టీవీ షోలో సంగీతం/ హాస్య విభాగంలో అజీజ్ అన్సారీకి అవార్డు

ఆసియా నటుడికి ఈ పురస్కారం లభించడం ఇదే ప్రథమం

లాస్‌ఏంజిల్స్: భారత సంతతి నటుడు అజీజ్ అన్సారీ 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు గెలుచుకున్నారు. టీవీ చానెళ్ల సంగీత/ హాస్య షో క్యాటగిరీలో 'ది మాస్టర్ ఆఫ్ నన్' పాత్ర పోషించినందుకు ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఆసియా ఖండ దేశాల సంతతిలోనూ, 34 ఏండ్ల వయస్సులోనూ ఈ అవార్డు గెలుచుకున్న తొలి నటుడిగా అజీజ్ అన్సారీ రికార్డు నెలకొల్పారు. లాస్ ఏంజిల్స్‌లో సోమవారం జరిగిన 75వ గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ప్రదానోత్సవంలో పురస్కారం అందుకున్న తర్వాత ఆయన స్పందిస్తూ 'నేను నిజంగా ఈ అవార్డు గెలుచుకుంటానని అనుకోలేదు. ఈ అవార్డు గెలుచుకున్నందుకు నాకు ఆనందంగా ఉంది. ఇది చాలా మంచి అవార్డు. షోలో నేను చాలా బాగా నటించినందువల్లే నాకు ఈ అవార్డు లభించింది' అని చెప్పారు. తనకు మద్దతుగా నిలిచిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా, 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' అనే షో 'ఉత్తమ రూపకం'తోపాటు నాలుగు గోల్డెన్ గ్లోబ్‌లను గెలుచుకున్నది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు ఒప్రా విన్‌ఫ్రే, నికోలె కిడ్మన్, ఫ్రాన్సెస్ మైక్‌డార్మండ్ మాట్లాడుతూ లింగ, జాతి సమానత్వం కోసం మార్పు రావాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఉత్తమ నటిగా మైక్ డార్మాండ్, ఉత్తమ సహ నటుడిగా శ్యామ్ రాక్‌వెల్, ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డును మార్టిన్ మైక్‌డొనాగ్ అందుకున్నారు. సెసిల్ బీడీమిల్లే పురస్కారాన్ని ఒప్రా విన్‌ఫ్రే అందుకున్నారు. ఈ అవార్డు అందుకున్న తొలి ఆఫ్రో – అమెరికన్ మహిళగా ఆమె నిలిచారు. కాగా, ఈ కార్యక్రమానికి హాజరైన కథా నాయికలు నల్లని దుస్తులు ధరించి వచ్చారు. హాలీవుడ్ సినీ నిర్మాత హార్వే వెయిన్‌స్టిన్ లైంగిక వేధింపులకు పాల్పడటాన్ని నిరసిస్తూ కథానాయికలు ట్విట్టర్‌లో 'మీ టూ'అనే పేరుతో ఆందోళన చేపట్టారు. మరోవైపు పురుష నటులతో సమానంగా పారితోషికం ఇవ్వాలన్న డిమాండ్‌తో '50:50' అనే బ్యాడ్జీలు ధరించారు.

డ్రోన్ల వినియోగానికి రైల్వే నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 8: వివిధ ప్రాజెక్టు పనుల పురోగతి, స్టేషన్లలో జనం రద్దీ నియంత్రణ, వివిధ జోన్ల పరిధిలో ట్రాక్‌లు, ఇతర పనుల నిర్వహణ తీరును పర్యవేక్షించేందుకు రైల్వేశాఖ డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నది. తొలిదశలో పశ్చిమ మధ్య రైల్వే అధికారులు ఈ డ్రోన్ కెమెరాలను కొనుగోలు చేశారు. గతేడాది ముంబైలోని ఎల్ఫిన్‌స్టన్ స్టేషన్ వద్ద వంతెనపై జరిగిన తొక్కిసలాటలో 23 మంది మృతి చెందిన నేపథ్యంలో డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. అన్ని జోన్లలో డ్రోన్ కెమెరాలు కొనుగోలు చేయాలని ఆదేశించినట్లు రైల్వేశాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

దుబాయ్‌లో కేరళవాసికి రూ.20.32 కోట్ల లక్కీ లాటరీ



లాటరీ గెలుచుకున్న హరికృష్ణన్ కుటుంబం

దుబాయ్: దుబాయ్‌లో నివసిస్తున్న భారతవాసిని రూ.20.32 కోట్ల (32 లక్షల డాలర్ల) విలువైన లక్కీ లాటరీ వరించింది. దుబాయ్‌లోనే అతిపెద్ద నగదు బహుమతి అందుకుంటున్న వ్యక్తిగా కేరళకు చెందిన 42 ఏండ్ల హరికృష్ణన్ వీ నాయర్ రికార్డు సృష్టించారు. ఆదివారం తీసిన 'బిగ్ టికెట్' లాటరీ డ్రాలో నాయర్ పేరు వచ్చింది. ఆయనకు భార్య, ఏడేండ్ల కుమారుడు ఉన్నారు. నాయర్ 2002 నుంచి దుబాయ్‌లో నివసిస్తున్నారు. ఇప్పటివరకు రెండుసార్లు టికెట్ కొన్నానని, ప్రస్తుతం తాను గెలిచాననే నిజాన్ని నమ్మలేకపోతున్నానన్నారు. కుటుంబసభ్యులతో కలిసి ప్రపంచం మొత్తం చుట్టిరావాలనే కోరిక ఎప్పటినుంచో ఉన్నదని, లాటరీ రావడంతో అది తీరబోతున్నదని చెప్పారు. పేదలకు సాయం చేయడంతోపాటు భారత్‌లో ఉంటున్న అమ్మ, అత్తను బాగా చూసుకుంటానని, కొడుకు చదువుకోసం ఆ డబ్బును ఉపయోగిస్తానని నాయర్ పేర్కొన్నారు.

సిరియాలో వైమానిక దాడులు

21 మంది దుర్మరణం.. మృతుల్లో 8 మంది చిన్నారులు

డమాస్కస్: సిరియాలో జిహాదీలు, తిరుగుబాటుదారుల ఆధిపత్యం కొనసాగుతున్న ఇడ్లిబ్ అనే ప్రాంతంలో రష్యాతో కలిసి సిరియా దళాలు ఆదివారం వైమానిక దాడులు జరిపాయి. ఈ దాడుల్లో 8మంది చిన్నారులు సహా మొత్తం 21మంది మృతిచెందారు. చనిపోయినవారిలో 11 మంది సింజర్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబంలోని వారు. సోమవారం కూడా ఇబ్లిబ్‌లో వాయుదాడులు కొనసాగుతున్నట్టు బ్రిటన్‌కు చెందిన పర్యవేక్షణ సంస్థ అధిపతి రమీ అబ్దుల్ రహమాన్ తెలిపారు.

ట్రంప్ టవర్స్‌లో అగ్ని ప్రమాదం

న్యూయార్క్: న్యూయార్క్‌లోని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాపార సముదాయం 'ట్రంప్ టవర్స్'లో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఏసీ సిస్టమ్ వేడెక్కడంతో సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి టవర్స్ నుంచి పొగలు వచ్చాయి. అగ్నిమాపక దళాలు సకాలంలో మంటల్ని ఆర్పివేశాయి.

'ఉగ్ర' స్థావరాలను నిర్మూలించాల్సిందే

పాకిస్థాన్‌కు స్పష్టం చేసిన సీఐఏ అధిపతి ❑ వేలెత్తి చూపడం సరికాదు.. పాక్‌కు చైనా మద్దతు

వాషింగ్టన్/ బీజింగ్: ఉగ్రవాదుల స్థావరాలను పాకిస్థాన్ కొనసాగించడం తమకు ఆమోదయోగ్యం కాదని అమెరికా నిఘా సంస్థ 'సీఐఏ' అధిపతి మైక్ పాంపియో స్పష్టంచేశారు. తాలిబన్, హక్కానీ తదితర ఉగ్రవాద సంస్థల నిర్మూలనలో విఫలమైనందుకు పాకిస్థాన్‌కు 200 కోట్ల డాలర్ల భద్రతా సాయాన్ని నిలిపేస్తూ అమెరికా ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదులకు పాక్ అన్ని విధాల సహకరిస్తున్నదని దీనివల్ల అమెరికాకు ముప్పు పొంచి ఉన్నదని ఆదివారం పాంపియో అన్నట్లు సీబీఎస్ న్యూస్ పేర్కొన్నది. పాకిస్థాన్ తగిన చర్యలు తీసుకోని పక్షంలో అమెరికా ఏం చేయాలన్న దానిపై అధ్యక్షుడు ట్రంప్ స్పష్టమైన వైఖరితో ఉన్నారని పాంపియా చెప్పారు. మరోవైపు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునే విషయమై పాకిస్థాన్‌ను అమెరికా వేలెత్తి చూపడాన్ని చైనా వ్యతిరేకించింది. ఉగ్రవాద సంస్థలు ఏదో ఒక దేశానికి పరిమితం కాలేదని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లుకంగ్ సోమవారం మీడియాతో చెప్పారు. అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా పాక్‌కు మద్దతుగా నిలిచిన లుకంగ్.. ఉగ్రవాద కార్యకలాపాల నిర్మూలనకు ఒక దేశం బాధ్యత వహించాలన్న అభిప్రాయాన్ని తాము ఆమోదించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే అంతర్జాతీయ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ పలుసార్లు త్యాగాలు చేసిందన్నారు.

పాక్‌లో పెరుగుతున్న ఐఎస్ ఉగ్రవాదం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థ పుంజుకుంటున్నదని అక్కడి ఓ పరిశోధన సంస్థ హెచ్చరిస్తున్నది. దేశంలో ఉగ్రవాదం లేకుండా చేస్తామన్న ప్రభుత్వం మాటకు విరుద్ధంగా ఇక్కడ పరిస్థితులు ఉన్నాయన్నది. ఉత్తర సింధ్, బలూచిస్థాన్‌లో ఐఎస్ చురుకుగా పనిచేస్తున్నదని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పీస్ స్టడీస్ (పీఐపీఎస్) అనే సంస్థ భద్రతా నివేదిక–2017లో పేర్కొన్నది. గత ఏడాది చైనాకు చెందిన ఇద్దరి అపహరణ, హత్య వెనుక కూడా ఐఎస్ హస్తం ఉన్నదన్నది. 2017లో పాకిస్థాన్‌లో జరిగిన 370 ఉగ్రదాడుల్లో 815 మంది మృతిచెందగా, 1736 మంది గాయపడ్డారు' అని నివేదికలో వివరించింది.

న్యూయార్క్‌లో అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు

న్యూయార్క్/ శ్రీనగర్/ కఠ్మాండు, జనవరి 8: అమెరికాను చలిపులి వణికిస్తున్నది. న్యూయార్క్ నగరంలోని జాన్ ఎఫ్ కెన్నెడి అంతర్జాతీయ విమానాశ్రయంలో శీతాకాలం వల్ల పడిపోయిన ఉష్ణోగ్రతలతో వాటర్ పైపులైన్ పగిలిపోయింది. దీంతో టర్మినల్ 4 రన్‌వే అంతా నీరు నిండటంతో అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు చేశారు. మరోవైపు జమ్ముకశ్మీర్‌లోని కార్గిల్ పట్టణంలో కనీష్ఠ ఉష్ణోగ్రతలు మైనస్ 18.5 సెల్సియస్‌గా నమోదైంది. ఇది ఆదివారంతో పోలిస్తే ఆరు డిగ్రీలు తక్కువ అని వాతావరణ కేంద్రం సోమవారం తెలిపింది. నేపాల్‌లో వీస్తున్న చలిగాలులతో సోమవారం ఏడుగురు పౌరులు మృతి చెందారు. దీంతో ఇప్పటివరకు చలిగాలుల వల్ల నేపాల్‌లో మృతి చెందిన వారి సంఖ్య 24 మందికి చేరింది.

ఎన్‌ఎల్‌సీలో గ్రాడ్యుయేట్ ట్రైయినీలు

తమిళ నాడులోని ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ అనుబంధ యూనిట్లలో పనిచేయడానికి ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రైయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- నవరత్న కంపెనీలో కొలువులు, ఆకర్షణీయమైన జీతభత్యాలు
- ఇంజినీరింగ్/ ఎమ్మెస్సీ కంప్యూటర్ అభ్యర్థులకు అవకాశం
- గేట్ –2018 స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక
- సీటీసీ రూ. 9.78 లక్షలు

వివరాలు:

ఎన్‌ఎల్‌సీ లిమిటెడ్‌ను గతంలో నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పిలిచేవారు. ఎన్‌ఎల్‌సీ భారత ప్రభుత్వ రంగ సంస్థ. మైనింగ్, పవర్ జనరేషన్‌లోని నవరత్న కంపెనీ.

- **పోస్టులు:** గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ
- ఖాళీల సంఖ్య – 150

విభాగాలవారీగా ఖాళీలు..

- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ మెకానికల్ – 50 (జనరల్–25, ఓబీసీ–14, ఎస్సీ–7, ఎస్టీ–4)
- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ ఎలక్ట్రికల్ (ఈఈఈ) – 35 (జనరల్–19, ఓబీసీ–9, ఎస్సీ–5, ఎస్టీ–2)
- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ ఎలక్ట్రికల్ (ఈసీఈ) – 10 (జనరల్–6, ఓబీసీ–3, ఎస్సీ–1)
- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ సివిల్ – 20 (జనరల్–11, ఓబీసీ–5, ఎస్సీ–3, ఎస్టీ–1)
- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ కంట్రోల్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ – 20 (జనరల్ –10, ఓబీసీ– 5, ఎస్సీ–3, ఎస్టీ – 2)
- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ కంప్యూటర్ – 5 (జనరల్–3, ఓబీసీ–1, ఎస్సీ–1)
- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ మైనింగ్ – 10 (జనరల్–5, ఓబీసీ–3, ఎస్సీ–1)
- **అర్హతలు:** సంబంధిత బ్రాంచీలో ఇంజినీరింగ్ డిగ్రీ లేదా ఏఎంఐఈలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులైతే 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. కంప్యూటర్ సైన్స్ విభాగానికి ఇంజినీరింగ్ డిగ్రీ లేదా ఏఎంఐఈ లేదా పీజీలో కంప్యూటర్ అప్లికేషన్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.



- **వయస్సు:** 2018, జనవరి 1 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** గేట్ – 2018 రాస్తున్నవారు దరఖాస్తు చేసుకోవాలి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి గేట్‌లో వచ్చిన స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారు.
- **ఇంటర్వ్యూ:** ఇంటర్వ్యూకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ కేటగిరీ అభ్యర్థులకు రానుపోను రైల్వే/బస్ చార్జీలను కంపెనీ చెల్లిస్తుంది.
- **జీతభత్యాలు:** రూ. 20,600 – 3% – 46,500 (ఈ2 గ్రేడ్). అంటే ఏడాదికి సుమారుగా రూ. 9.18 – 9.78 లక్షల వరకు జీతం వస్తుంది.
- శిక్షణ కాలం ఏడాది. అవసరాన్ని బట్టి పొడగించవచ్చు. ఈ కాలంలో బేసిక్ పే, డీఏ (124.3 శాతం), కామన్ అలవెన్స్‌లు (బేసిక్ పేలో 40 శాతం) చొప్పున ప్రతినెల చెల్లిస్తారు. వీటికి అదనంగా వృత్తిలో కనబర్చే ప్రావీణ్యతకు అదనపు జీతం చెల్లిస్తారు. ఉచిత వైద్య సౌకర్యాలు (కుటుంబ సభ్యులకు సైతం), గ్రూప్ ఇన్సూరెన్స్, హెచ్‌బీఏ, నామమాత్రపు అద్దెకు వసతి సౌకర్యం (ఆయా ప్రదేశాన్ని బట్టి) కంపెనీ కల్పిస్తుంది.
- **పనిచేయాల్సిన ప్రదేశం:** దేశ/విదేశాల్లో ఎన్‌ఎల్‌సీ యూనిట్/ఏరియాల్లో పనిచేయాల్సి ఉంటుంది.
- **సర్వీస్ అగ్రిమెంట్ బాండ్:** శిక్షణ తర్వాత కనీసం మూడేండ్లు పనిచేస్తామని బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి
- **చివరితేదీ:** జనవరి 27
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 300/– (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు)
- **వెబ్‌సైట్:** https://www.nlcindia.com

ఎస్‌బీఐలో ఆఫీసర్లు



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇంటర్నల్ ఆడిట్ విభాగంలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియాలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన ఎస్‌బీఐని 1955 జూలై 1న ఏర్పాటుచేశారు.

- **పోస్టు పేరు:** డిప్యూటీ మేనేజర్ (ఇంటర్నల్ ఆడిట్)
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 50 (జనరల్–26, ఓబీసీ–13, ఎస్సీ–7, ఎస్టీ–4)
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ/ఐసీఏ నుంచి చార్టెడ్ అకౌంటెంట్. సీఐఎస్‌ఏ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. సంబంధిత విభాగంలో రెండేండ్ల అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2017 జూన్ 1 నాటికి 21 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 600/–, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/–
- **ఎంపిక:** ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ/ గ్రూప్ డిస్కషన్ ద్వారా
- రాతపరీక్షలో మొత్తం 220 మార్కులకుగాను 170 ప్రశ్నలు ఇస్తారు. 135 నిమిషాల్లో పరీక్షను పూర్తిచేయాల్సి ఉంటుంది.
- రాతపరీక్షలో టెస్ట్ ఆఫ్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్, సంబంధిత ప్రొఫెషనల్ లాంగ్వేజ్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ:** జనవరి 28
- **కాల్‌లెటర్ డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 12
- **ఆన్‌లైన్ పరీక్షతేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** www.statebankofindia.com

సీఎంఈఆర్‌ఐలో సైంటిస్టులు

సెంట్రల్ మెకానికల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఈఆర్ఐ) ఖాళీగా ఉన్న సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

సీఎంఈఆర్‌ఐ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న అనుబంధ సంస్థ.

- **పోస్టు పేరు:** సైంటిస్ట్ –15 పోస్టులు
- సైంటిస్ట్–8 ఖాళీలు (జనరల్–3, ఓబీసీ–3, ఎస్సీ–1, ఎస్టీ–1)
- సీనియర్ సైంటిస్ట్–7 ఖాళీలు (జనరల్)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత బ్రాంచీలో ఎంఈ/ఎంటెక్ లేదా బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సీనియర్ సైంటిస్ట్‌కు పీహెచ్‌డీ లేదా సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 85,170/– (సీనియర్ సైంటిస్ట్‌కు రూ. 98,490/–)
- **వయస్సు:** 2018 జనవరి 25 నాటికి 32 ఏండ్లకు మించరాదు (సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏండ్లు)
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 25
- **వెబ్‌సైట్ :** www.cmeri.res.in

బీఐటీఎంలో

కోల్‌కతాలోని బిర్లా ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం (బీఐటీఎం) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ మెంటర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **పోస్టు పేరు:** జూనియర్ మెంటర్–5 పోస్టులు
- **విభాగాలు:** ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్/ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత. సంబంధిత విబాగంలో అనుభవం ఉండాలి.
- **పే స్కేల్ :** రూ. 25,000/–
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** 2018 జనవరి 13
- **వెబ్‌సైట్:** http://bitm.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఏ) దేశవ్యాప్తంగా 200 పైగా బిజినెస్ స్కూల్‌ల్లో ఎంబీఏ, పీజీడీఎం అండ్ అల్లైడ్ ప్రోగ్రామ్స్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే మ్యాట్ (మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్) నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

- ఎంట్రెన్స్ పేరు: మ్యాట్
- **అడ్మిషన్ పొందే ప్రదేశం:** దేశవ్యాప్తంగా 200 బిజినెస్ స్కూల్‌ల్లో
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1500/–
- **ఎంపిక:** పేపర్ బేస్డ్ /కంప్యూటర్ బేస్డ్ టెస్ట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 26
- **రాత పరీక్ష:** పేపర్ బేస్డ్ టెస్ట్– ఫిబ్రవరి 4, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్–ఫిబ్రవరి 17
- **వెబ్‌సైట్:** https://apps.aima.in

ఐఏఆర్‌ఐలో ఎస్‌ఆర్‌ఎఫ్

న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) ఖాళీగా ఉన్న ఎస్‌ఆర్‌ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

ఐఏఆర్‌ఐ అనేది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ పరిధిలో పనిచేస్తున్న సంస్థ.

- **పోస్టు పేరు:** సీనియర్ రిసెర్చ్ ఫెలో
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ (బాటనీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, అల్లైడ్ సైన్స్)లో ఉత్తీర్ణత. నెట్, రెండేండ్లపాటు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **పే స్కేల్:** రూ. 28,000/– అదనంగా హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తుతోపాటు అవసరమైన సర్టిఫికెట్లతో రిక్రూట్‌మెంట్ పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 10
- **వెబ్‌సైట్:** www.iari.res.in

హెచ్‌సీయూలో గెస్ట్ ఫ్యాకల్టీలు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అనేది పోస్టు గ్రాడ్యుయేట్‌లోని టీచింగ్ అండ్ రిసెర్చ్ రంగంలో మెలకువలను అందించడానికి ప్రాథమిక విద్యా సంస్థగా 1974 అక్టోబర్ 2న ఏర్పాటు చేశారు.

- మొత్తం ఖాళీల సంఖ్య: 7 పోస్టులు
- **విద్యార్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీఏతోపాటు పీహెచ్‌డీ ఉండాలి. సంబంధిత రంగంలో అనుబవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in